

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

మంగళవారం TUESDAY 16.7.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4 | సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 41 ‖ వెల (Price) రూ.6.50 | దక్షిణాయనం ప్రారంభం

మంగళవారం, సూర్యోదయం: 5-50, సూర్యాస్తమయం: 6-54. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం శుక్ల పక్షం తిథి: దశమి రాత్రి 8-34 వరకు. నక్షత్రం: విశాఖ రాత్రి 2-13 వరకు. వర్జ్యం: ఉదయం 6-30 నుంచి ఉదయం 8-13 వరకు. రాహుకాలం: పగలు 3-37 నుంచి సాయంత్రం 5-15 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 8-27 నుంచి ఉదయం 9-19 వరకు, పునః దుర్ముహూర్తం: రాత్రి 11-16 నుంచి రాత్రి 12-00 వరకు. అమృతకాలం: సాయంత్రం 4-47 నుంచి సాయంత్రం 6-30 వరకు. కర్కాటక సంక్రమణం ఉదయం 11-18 గంటలకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline



ఉద్యోగార్థుల ఆందోళనలతో అశోక్‌నగర్ అట్టుడుకుతున్నది. పలు కాలనీలను పోలీసులు అష్టదిగ్బంధం చేశారు. సోమవారం సాయంత్రం అశోక్ నగర్ క్రాస్‌రోడ్స్‌కు ర్యాలీగా బయల్దేరబోయిన గ్రూప్స్ అభ్యర్థులను సిటీ సెంట్రల్ లైబ్రరీ లోపలికి తోసి బయటి గేట్లు మూసివేస్తున్న పోలీసులు





గ్రూప్స్ పోస్టుల పెంపు కోసం నిరసిస్తున్న ఓ యువతిని అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు.. సెక్రటేరియట్ ముట్టడిలో అరెస్టయిన బీసీ జనసభ నేత రాజారాంయాదవ్, విద్యార్థి నేతలు

నిర్బంధంలో నిరుద్యోగి

- ఉదయం సచివాలయం!.. సాయంత్రం సిటీ సెంట్రల్ లైబ్రరీ! ఉద్యోగార్థుల నిరసనలతో ఉద్రిక్తత
- అడుగడుగునా అడ్డుకున్న పోలీసులు.. ఎక్కడికక్కడ అరెస్టులు.. లైబ్రరీ గేట్లు మూసి మరీ నిర్బంధం
- ఢిల్లీకి చేరిన ఉద్యమం.. నేడు జంతర్‌మంతర్ వద్ద ధర్నా.. రాహుల్‌గాంధీ ఇంటి ముట్టడికి పిలుపు › 2

రుణమాఫీకి కొర్రీలెన్నో!

రేషన్‌కార్డు ఆధారంగా 'కుటుంబం' గుర్తింపు.. ఒక కుటుంబంలో రైతులెందరున్నా 2 లక్షలే మాఫీ

పీఎం కిసాన్ నిబంధనలూ వర్తింపు.. కొట్టివేతలన్నీ పోతే సగంమందికైనా ప్రయోజనం దక్కేనా?

- రూ.2 లక్షల కన్నా ఎక్కువ ఉన్న రుణాన్ని రైతులే చెల్లించాలట! తర్వాతే ఖాతాలో డబ్బులేస్తారట!
- అనర్హులకు రుణమాఫీ అయితే.. తిరిగి రికవరీ!
- బంగారం కుదువపెట్టిన పంట రుణాలకు వర్తించదు
- 29 అంశాలపై బ్యాంకుల నుంచి వివరాల సేకరణ
- మార్గదర్శకాలు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం



హైదరాబాద్, జూలై 15(నమస్తే తెలంగాణ): రూ.2 లక్షల రుణమాఫీకి ప్రభుత్వం సోమవారం మార్గదర్శకాలు జారీ చేసింది. రాష్ట్రంలో భూమి కలిగిన ప్రతి రైతు కుటుంబానికి రూ.2 లక్షల రుణ మాఫీ చేయనున్నట్టు మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. తెల్లరేషన్ కార్డు ఆధారంగా కుటుంబాన్ని గుర్తించనున్నట్టు స్పష్టంచేసింది. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పీఎం కిసాన్ పథకం మినహాయింపులను కూడా వర్తింపజేయనున్న ట్టు పేర్కొన్నది. ఏ కుటుంబానికైనా రూ.2 లక్షలకు మించిన రుణం ఉంటే, ఎక్కువ ఉన్న ఆ మొత్తాన్ని ఆయా రైతులు బ్యాంకులకు చెల్లించాలని, ఆ తరువాతనే రుణమాఫీ నిధులు వారి ఖాతాలో జమ చేస్తామని వెల్లడించింది. 2018 డిసెంబర్ 12 నుంచి 2023 › 6వ పేజీలో

సందేహాలెన్నో!

మార్గదర్శకాలతో మరింత గందరగోళం
కొన్నేండ్లుగా కొత్త రేషన్ కార్డులు లేవు
కొత్తవి ఇవ్వకుండానే మాఫీ చేస్తరా? › 6
లక్షలాది లక్షల కుటుంబాలకు అనర్హత

పీఎం కిసాన్ నిబంధనాలు!

- అనర్హులుగా రిటైర్డ్, ప్రస్తుత ప్రభుత్వ ఉద్యోగులు
- రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్నవారికీ వర్తించదు
- డాక్టర్లు, న్యాయవాదులు, ఇంజినీర్లు, ఐటీ చెల్లింపుదారులూ రుణమాఫీకి దూరమే › 6

ప్రభుత్వ ఉద్యోగులకు రుణమాఫీ లేనట్టే!

రేషన్‌కార్డు లింకు, పీఎం కిసాన్ నిబంధనల వర్తింపే కారణం › 6
7 లక్షల కుటుంబాలకు నష్టం!



రైతుల వలపోత వదిలి వడపోతపైనే దృష్టి

రైతు భారం కన్నా ప్రభుత్వ భారం తగ్గించుకునే యత్నం
ఎన్నికలకుముందు చెప్పిందేంది? ఇప్పుడు చేస్తున్నదేంది?
మాటతప్పడం కాంగ్రెస్‌కు అలవాటే: హరీశ్‌రావు › 6



మార్గదర్శకాల పేరుతో మభ్యపెట్టే యత్నం

రుణమాఫీ పొందేదెందరు.. రేషన్‌కార్డు లేనోళ్లు ఎందరు?
కేసీఆర్ చేసిన రుణమాఫీ రూ.29,145 కోట్లు
మరి కాంగ్రెస్ చేస్తున్న మాఫీ ఎంత?: నిరంజన్‌రెడ్డి › 6



ప్రతి రైతుకూ 'భరోసా' ఇవ్వాల్సిందే

- ఎకరాలతో సంబంధం లేకుండా అమలు చేయాలి
- లేదంటే వేల ఎకరాలు పడావుగా మారుతాయి
- పెట్టుబడి కష్టానికి కొంతలో కొంత ఆసరా భరోసా
- వరంగల్‌లో మంత్రుల ముందు కుండబద్దలు కొట్టిన గుంటూరుపల్లి మహిళారైతు రమాదేవి

వరంగల్, జూలై 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రైతుభరోసాను కోతలు పెట్టి, ఏ కొద్దిమందికో అందించడం సరికాదని.. రైతులందరికీ 'భరోసా' ఇవ్వాల్సిందేనని హసన్‌పర్తి మండలం గుంటూరుపల్లికి చెందిన ఎస్ రమాదేవి మంత్రుల ఎదుటే తేల్చి చెప్పారు. రైతు భరోసా అనేది అన్నదాత కష్టానికి అందించే చిన్న పెట్టుబడి సాయం మాత్రమేనని పేర్కొన్నారు. వరంగల్‌లో సోమవారం రైతుభరోసా విధివిధానాలకు సంబంధించి నిర్వహించిన అభిప్రాయ సేకరణ సందర్భంగా ఆమె మాట్లాడారు. 'ఎకరాలతో సంబంధం లేకుండా ప్రతి రైతుకు రైతుభరోసా వర్తింపజేయాలి. 5,10 ఎకరాలని › 10వ పేజీలో

ఇంజినీరింగ్ ఫీజు మరింత భారం!

వారంలో పెంపుదలపై టీఏఎఫ్‌ఆర్‌సీ నోటిఫికేషన్!
వచ్చే మూడేండ్ల కాలానికి బీటెక్ కొత్త ఫీజులు › 9

ఐదు రోజులు భారీ వర్షాలు › 2

25 వరకు రాష్ట్రమంతటా వానలు
వేమనపల్లిలో 13 సె.మీ. వర్షం

రుణగ్రహీతలకు ఎస్బీఐ షాక్!

వడ్డీరేట్లను పెంచిన బ్యాంక్ › 8
వివిధ కాలపరిమితులపై 10 బేసిస్ పాయింట్లదాకా పెంపు
మరింత భారంగా ఈఎంఐలు

ఓడిన అభ్యర్థి వేదికపై..

ప్రజలెన్నుకున్న ఎమ్మెల్యే నేలపై!

- ప్రజాపాలనలో ప్రజాతీర్పు అపహాస్యం
- కొత్తపేటలో ప్రొటోకాల్‌కు తిలోదకాలు
- అధికారుల తీరుపై ఎమ్మెల్యే సబిత ఆగ్రహం
- స్టేజీ ముందు నేలపై బైఠాయించి నిరసన
- బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల తోపులాట

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జూలై 15 (నమస్తే తెలంగాణ): ప్రజల ఆశీర్వాదంతో గెలిచిన ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనడం సహజం. అది ప్రజాస్వామ్య స్ఫూర్తి. ప్రజాక్షేత్రంలో ఓడి, ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధంలేని వ్యక్తి అధికారిక స్టేజీ మీద కూర్చోవడమంటే? అది ప్రజాస్వామ్యాన్ని అవమానించడమే! ప్రజాతీర్పును అవహేళన చేయడమే! రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని కొత్తపేటలో సోమవారం ఇదే జరిగింది. ఐదుసార్లు › 3వ పేజీలో



ప్రభుత్వ కార్యక్రమంలో ప్రొటోకాల్‌కు విరుద్ధంగా కాంగ్రెస్ నేత కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి వేదికపై కూర్చుండగా, నేలపై కూర్చుని నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

ప్రజాప్రతినిధుల హక్కుల్ని కాలరాస్తున్న సర్కార్

ప్రొటోకాల్ కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోండి
ఉల్లంఘనలు జరగకుండా సీఎస్, కలెక్టర్‌కు ఆదేశాలివ్వండి
కాంగ్రెస్ నేతలకు సంక్షేమ పథకాల పంపిణీ బాధ్యతలా?
ఇది ప్రజాతీర్పుకు విరుద్ధం.. ప్రజాస్వామ్యానికి విఘాతం
ప్రొటోకాల్ ఉల్లంఘనలపై స్పీకర్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ



హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్యేల హక్కులు, వారికి ఉండే ప్రొటోకాల్‌ను స్పీకర్ పరిరక్షించాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేల హక్కుల రక్షణ విషయంలో స్పీకర్ తన అధికారాలను వినియోగించాలని, ప్రొటోకాల్ ఉల్లంఘనలు జరగకుండా ప్రభుత్వ ప్రధానకార్యదర్శితోపాటు కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రావాలనే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను టార్గెట్ చేస్తూ ప్రొటోకాల్ ఉల్లంఘనలకు పాల్పడుతున్నదని ఆరోపించారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు లేనిచోట ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా విపక్ష ఎమ్మెల్యే › 3వ పేజీలో

నేను బతికే ఉన్న!




సచ్చిపోయినానని ఈ సర్కారు అంటున్నది
అందుకే పింఛన్ ఇస్తలేదు
కేసీఆర్ డబుల్ బెడ్రూం ఇల్లు ఇచ్చిండు
నాకు పింఛన్ ఇచ్చేందుకూ వీళ్లకు చేతులొస్తలేవు!
ప్రజావాణిలో ఓ వృద్ధురాలి ఆవేదన

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 15 (నమస్తే తెలంగాణ): 'నేను బతికే ఉన్న. పింఛన్ ఇప్పించండి సారూ' అంటూ ఓ వృద్ధురాలు ఎక్కని మెట్టు, కలవని అధికారి లేరు. అధికారులు కనికరించకపోవడంతో సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణిలో దరఖాస్తు పెట్టుకునేందుకు వచ్చింది. ఖైరతాబాద్ బీజేఆర్‌నగర్‌కు చెందిన కే రుక్కమ్మకు 59 ఏండ్లు. భర్త చనిపోవడంతో ఇల్లు గడవడమే కష్టంగా మారింది. పింఛన్ మంజూరు కోసం తహసీల్దార్‌కు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని కన్నీటి పర్యంతమైంది. తాను చనిపోయినట్టు రికార్డుల్లో ఉందని, బతికున్నట్టు నిరూపించుకోవాలని అధికారులు చెప్తున్నారని పేర్కొన్నది. కేసీఆర్ ప్రభుత్వంలో డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరైందని, ఇప్పుడు మాత్రం పింఛనూ ఇస్తలేరని ఆవేదన వ్యక్తంచేసింది.

ఓటరు జాబితా ఆధారంగా బీసీగణన

బీసీలకు రిజర్వేషన్ 24% మించే చాన్సే లేదు
కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో 42% రిజర్వేషన్ హామీ
తాజా లెక్కలతో హామీకి మంగళం పలికినట్టేనా?
స్థానిక ఎన్నికలపై రాష్ట్ర ప్రభుత్వం మల్లగుల్లాలు
ఓటర్ల లెక్కల ఆధారంగా నిర్ణయించే యోచన

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): మరో హామీకి కాంగ్రెస్ ప్రభుత్వం మంగళం పాడినట్టే కనిపిస్తున్నది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని మ్యానిఫెస్టోలో ప్రకటించింది. అయితే 42 కాస్తా తిరిగి 24గా మార్చేందుకు ముందుకు సాగుతున్నది. రాష్ట్రంలో స్థానిక సంస్థల్లో బీసీ కులగణన చేసి, జనాభా శాతాన్ని తేల్చి వారికి 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని మ్యానిఫెస్టోలో ప్రకటించింది. కానీ ఇతర రాష్ట్రాల్లో కోర్టు తీర్పులు రిజర్వేషన్లు 50 శాతం దాటవద్దని తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఇక్కడ కూడా 50 శాతం › 10వ పేజీలో



బీసీ రిజర్వేషన్లపై యాక్షన్ ప్లాన్

కులగణన ఆధారంగా ఎన్నికలకు వెళ్తే ఎట్లుంటది?
అది తేల్చేందుకు ఎంత సమయం తీసుకుంటారు?
పంచాయతీ ఎన్నికలపై అధికారులతో సీఎం › 10

పెన్షనర్ల పోరు బాట

కలెక్టరేట్ల ఎదుట నల్లబ్యాడ్జీలతో ఆందోళన

- ముఖ్యమంత్రి రేవంత్ మొండివైఖరి వీడాలి
- రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి › 3
- మంత్రులు, సీఎస్ చుట్టూ తిరిగినా పనవ్వట్లే
- పెండింగ్ డీఏల కోసం పెన్షనర్ల జేఏసీ నిరసన
- ఈ నెల 30న ఇందిరాపార్కు వద్ద మౌనదీక్ష





సోమవారం సెక్రటేరియట్ ముట్టడికి వచ్చిన రాజారాం యాదవ్, జంగయ్య తదితరులను అడ్డుకుంటున్న పోలీసులు



చిక్కడపల్లిలోని సిటీ సెంట్రల్ లైబ్రరీ వద్ద నిరుద్యోగులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

లోకం పోకడ



పోలీసులు నిరుద్యోగుల్ని అరెస్టు చేయడంలో బిజీ.. మనం మన ఉద్యోగం చేసుకుందాం పదా!

సెక్రటేరియట్ ముట్టడి సక్సెస్

- ధర్నాలతో దద్దరిల్లిన సచివాలయం
- డీఎస్సీ వాయిదా, గ్రూప్స్ పోస్టులు పెంచాలని నిరుద్యోగుల డిమాండ్
- బీసీ కులగణన కోసం బీసీ జనసభ
- స్కాలర్‌షిప్‌ల కోసం ఏఐఎస్ఎఫ్
- అరెస్టులు.. ఠాణాలకు తరలింపు
- రాష్ట్రమంతటా నేతల నిర్బంధాలు

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): ఓవైపు నిరుద్యోగులు, మరోవైపు విద్యార్థి సంఘాలు, ఇంకోవైపు బీసీ నేతల ముప్పేట ముట్టడితో సచివాలయం, చుట్టుపక్కల ప్రాంతాలు సోమవారం దద్దరిల్లాయి. డీఎస్సీ వాయిదా, జాబ్ క్యాలెండర్ విడుదల, గ్రూప్స్ పోస్టుల పెంపు డిమాండ్లతో నిరుద్యోగులు, రాష్ట్రంలో బీసీ కులగణన, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల కోసం బీసీ జనసభ నేతలు, రూ.8వేల కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు సెక్రటేరియట్‌ను ముట్టడించారు. వరుస ధర్నాలు, చిక్కులుపిక్కటిల్లేలా ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో సచివాలయం ప్రాంతం హోరెత్తింది. వేలాది మంది ఒకంతొక్కడంతో సెక్రటేరియట్ వద్ద రోజంతా ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. ముట్టడి నేపథ్యంలో పోలీసులు సచివాలయం చుట్టూ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున బారికేడ్లు పెట్టారు. నిరుద్యోగులను ఎక్కడికక్కడ అడ్డుకునేందుకు సచివాలయానికి వచ్చే అన్ని మార్గాల్లో సుమారు 100 మీటర్ల మేర వందలాదిమంది సివిల్, స్పెషల్ పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బంది మోహరించారు. అష్ట దిగ్బంధాన్ని చేదించుకుంటూ ఆయా సంఘాల నాయకులు, విద్యార్థులు సెక్రటేరియట్‌లోకి చొచ్చుకెళ్లే ప్రయత్నంలో పోలీసులు, నిరసనకారుల మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో రాజారాం యాదవ్‌తో పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. నిరసన తెలిపినవారిని వాహనాల్లోకి ఎక్కించి పోలీసుస్టేషన్లకు తరలించారు.



భూదాన్‌పోచంపల్లి పోలీసుల అదుపులో బీఆర్ఎస్‌వీ నాయకులు

డీఎస్సీ వాయిదా వేయాల్సిందే..

డీఎస్సీ వాయిదా వేయాలని, జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, గ్రూప్-1 మెయిన్స్‌కు 1:100 నిష్పత్తిలో పిలవాలని, గ్రూప్-2, 3 పోస్టులు పెంచాలని నిరుద్యోగులు డిమాండ్ చేశారు. 'వీ వాంట్ జస్టిస్', 'సీఎం డౌన్ డౌన్' అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. సచివాలయం ఆగ్నేయం గేటు వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. మరోవైపు నల్లపోచమ్మ గుడి వైపు నుంచి కొందరు నిరుద్యోగులు సచివాలయం ముట్టడికి యత్నించగా అరెస్ట్ చేసి, పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ముట్టడికి ఓయూ నుంచి బయలుదేరిన నిరుద్యోగులను ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకున్నారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల సతీశ్, ఇతర నాయకులను ఉప్పల్‌లో అదుపులోకి తీసుకున్నారు. చిక్కడపల్లి లైబ్రరీ నుంచి నిరుద్యోగులు ర్యాలీ తీసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.

కులగణన చేపట్టాలి

రాష్ట్రంలో బీసీ కులగణన వెంటనే చేపట్టాలనే డిమాండ్‌తో బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ ఆధ్వర్యంలో సెక్రటేరియట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా పోలీసులు ఆయనను ముందస్తు అరెస్ట్ చేసేందుకు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. సెక్రటేరియట్ వద్ద రాజారాం యాదవ్‌ను అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు, రాష్ట్రంలో పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర కౌన్సిల్ ఆధ్వర్యంలో విద్యార్థులు సచివాలయం ముట్టడికి ర్యాలీగా వస్తుండగా అరెస్ట్ చేశారు. కాగా, పోలీసులు సచివాలయం చుట్టూ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నల్లపోచమ్మ గుడి నుంచి సచివాలయంలోకి వచ్చే రోడ్డును పూర్తిగా మూసేశారు. చుట్టూ అదనంగా బారికేడ్లు పెట్టి అదనపు బలగాలను మోహరించారు. నిరసనకారులను పోలీస్‌స్టేషన్లకు తరలించేందుకు పదుల సంఖ్యలో వాహనాలను సిద్ధంగా ఉంచారు. వచ్చినవారిని వచ్చినట్టే అరెస్ట్ చేస్తూ ఠాణాలకు తరలించారు. సచివాలయం వైపు వచ్చే మార్గాల్లో 100 మీటర్ల వరకు ప్రధాన కూడళ్లలో పోలీసులు గుంపులుగా మోహరించారు.

ప్రభుత్వ పతనం ప్రారంభం: రాజారాంయాదవ్

ఖైరతాబాద్: సెక్రటేరియట్ వద్ద ధర్నాలో రాజారాంయాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు, నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకుండా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. ఎన్ని నిర్బంధాలు విధించినా నిరుద్యోగుల సమస్య పరిష్కారమయ్యేదాకా పోరాడుతామని స్పష్టంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ పతనం ప్రారంభమైందని ఆగ్రహం వ్యక్తంచేశారు.

రాష్ట్రమంతటా అరెస్టుల పర్వం

రాష్ట్రమంతటా ఆదివారం అర్ధరాత్రి నుంచే నిరుద్యోగ, విద్యార్థి, బీసీ సంఘాల నేతల అరెస్టులు కొనసాగాయి. బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యాగల శ్రీనివాసను నర్సంపేటలో, గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాయంచు నాగరాజును ములుగులో అరెస్టు చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా సహా మిర్యాలగూడ, దేవరకొండ, నార్కట్‌పల్లి, దామరచర్ల, కాటిగారం, తిర్మలగిరిసాగర్, త్రిపురారం, మాడ్గులపల్లి, సంస్థాన్ నారాయణపురం, మోత్కూర్, సూర్యాపేట, నాగారం, తిరుమలగిరి, యాదాద్రిభువనగిరి, గుండాల, అడ్డగూడూర్, భూదాన్‌పోచంపల్లి, నడిగూడెం, తుంగతుర్తితో పాటు పలుచోట్ల వివిధ సంఘాల నేతల అరెస్టులు కొనసాగాయి.



నిరుద్యోగులు టెర్రరిస్టులా?

బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ చెప్పేదొకటి చేసేదొకటి అని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి ఆరోపించారు. ప్రజలను తప్పుదారి పట్టించి పబ్బం గడపాలని కాంగ్రెస్ సర్కారు చూస్తున్నదని ఆయన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాము ఏ నిర్ణయం తీసుకున్నా నాలుగు గోడల మధ్య ఉండదని, ప్రజల మధ్యే తీసుకుంటామని స్వయంగా ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులు చెప్తున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అయితే, ఆ సిద్ధాంతం నిరుద్యోగులకు వర్తించదా? అని ఆయన ప్రశ్నించారు. తమ నిర్ణయాలు ప్రజల్లోనే ఉంటాయని చెబుతున్న సర్కారు ఓయూలో, దిల్‌సుఖ్‌నగర్‌లో, అశోక్‌నగర్‌లో నిరుద్యోగులు చేస్తున్న నిరసన ప్రదేశాలకు ఎందుకు వెళ్లటంలేదని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు ఓట్ల కోసం అశోక్‌నగర్, చిక్కడపల్లి చుట్టూ తిరిగినవారు ఇప్పుడెందుకు వెళ్లరని ఆయన ప్రశ్నించారు. రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి వెళ్లకపోయినా కనీసం ఓ మంత్రిని, ఎమ్మెల్యేనైనా ఎందుకు పంపటంలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. సెక్రటేరియట్ ముట్టడికి పిలుపునిస్తే వందలాది మంది పోలీసులను దించారని, నిరుద్యోగులేమైనా టెర్రరిస్టులా? అని ప్రశ్నించారు.

నాడు ఓట్లు కొల్లగొట్టిండ్రు నేడు వీపులు పగలగొడుతున్నరు

- చిక్కడపల్లిలో విద్యార్థులపై పోలీసుల దాడి పాశవికం
- ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలి
- మాజీ మంత్రి హరీశ్ మండిపాటు



హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ) : చిక్కడపల్లి సెంట్రల్ లైబ్రరీలో గ్రూప్స్, డీఎస్సీ అభ్యర్థులు, నిరుద్యోగులపై ప్రభుత్వం పాశవికంగా ప్రవర్తించడం దుర్మార్గమని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. 'ఇదేనా ప్రజాపాలన అంటే, ఇదేనా ఇందిరమ్మ రాజ్యమంటే..?' అని ప్రశ్నించారు. ఆనాడు సిటీ సెంట్రల్ లైబ్రరీకి రాహుల్ గాంధీని తీసుకువెళ్లి ఓట్లు కొల్లగొట్టారని, నేడు అదే లైబ్రరీకి పోలీసులను పంపించి విద్యార్థుల వీపులు పగలగొడుతున్నారని ధ్వజమెత్తారు. చిక్కడపల్లి సెంట్రల్ లైబ్రరీలో విద్యార్థులపై పోలీసుల దౌర్జన్యాన్ని సోమవారం ఎక్స్ వేదికగా హరీశ్ తీవ్రంగా ఖండించారు. విద్యార్థులపై దమనకాండను ప్రభుత్వం వెంటనే ఆపాలని, ఘటనకు బాధ్యత వహించి ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం పట్ల : ఎర్రోళ్ల

విద్యార్థులను అవమానిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు చెప్పుగొట్టేలా మాట్లాడటం పట్ల విద్యార్థులు రోడ్లపైకి వచ్చారని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆరోపించారు. నిరుద్యోగులు, విద్యార్థుల అరెస్టును ఆయన ఖండించారు. హైదరాబాద్‌లో ఎటు చూసినా ముండ్ల, ఇనుప కంచెలతో సమైక్యపాలనలో ఉద్యమ రోజులను తలపిస్తున్నదని చెప్పారు. నిరుద్యోగులు సచివాలయం ముట్టడికి పిలుపునిస్తే వారిని పిలిచి చర్చలు జరపకుండా యూనివర్సిటీ విద్యార్థులు, నిరుద్యోగులు, ముదిరిపోయిన బెండకాయలని ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలుచేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటం తగదని సూచించారు. నిరుద్యోగులు కోరుతున్నట్టుగా డీఎస్సీ వాయిదా వేసి పరీక్షల మధ్య వ్యవధి పెంచాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల పోరాటానికి బీఆర్ఎస్ మద్దతు ఎప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు.

నిర్బంధంలో నిరుద్యోగి

- సిటీ సెంట్రల్ లైబ్రరీలో రణరంగం
- గ్రూప్స్ పోస్టుల పెంపు కోసం ఆందోళన
- ర్యాలీకి అనుమతి ఇవ్వని పోలీసులు
- గేటు దాటి రాకుండా ఆంక్షలు
- వచ్చినవారిని వచ్చినట్టే అరెస్టు
- వార్త కవరేజీకి వెళ్లిన జర్నలిస్ట్ అరెస్ట్

చిక్కడపల్లి, జూలై15 : ప్రశాంతంగా ఉండే చిక్కడపల్లి సిటీ సెంట్రల్ లైబ్రరీ సోమవారం రాత్రి రణరంగాన్ని తలపించింది. నిరుద్యోగుల ఆందోళనలు, పోలీసుల అరెస్టులతో వాతావరణం ఉద్రిక్తంగా మారింది. గ్రూప్-2,3 పోస్టులు పెంచాలని డిమాండ్ చేస్తూ అభ్యర్థులు సిటీ సెంట్రల్ లైబ్రరీ వద్ద నిరసన తెలిపారు. శాంతియుతంగా ర్యాలీ తీస్తామని పోలీసులను కోరినా నిరాకరించారు. ప్రధాన గేటు దాటి బయటకు వస్తే అరెస్టు చేస్తామని హెచ్చరించారు. లైబ్రరీ నుంచి బయటకు వచ్చేందుకు యత్నించిన 20 మందిని అరెస్టు చేసి దాంధ్రాయణగుట్ట, బొల్లారం పోలీస్ స్టేషన్లకు తరలించారు. వీరిలో ఇద్దరు మహిళా అభ్యర్థులున్నారు.

అభ్యర్థుల్లో భయంభయం

ఓవైపు గేటు బయటకు వెళ్తున్న నిరుద్యోగులను పోలీసులు అరెస్టు చేస్తుంటే మరోవైపు లోపల ఉన్నవారు ఆందోళన కొనసాగించారు. గ్రూప్ 2,3 పోస్టులు పెంచాలని, డిసెంబర్‌లో పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. 'సీఎం డౌన్‌డౌన్', 'గుండుమెస్సీ డౌన్ డౌన్' అంటూ గర్జించారు. దీంతో పోలీసులతో పాటు స్పెషల్ టీం పోలీసులు గేటు లోపలికి వెళ్లి నిరసనకారులను అరెస్ట్ చేశారు. పోలీసులు దూసుకురావడంతో అభ్యర్థులు భయభ్రాంతులకు లోనై లోపలికి వెళ్లి లైబ్రరీ భవనం గ్రిల్ వేసుకున్నారు. లైబ్రరీలోనికి పోలీసులు ఎలా వస్తారని నిలదీశారు. రాత్రి 8 గంటల ప్రాంతంలో అభ్యర్థులు భోజనం చేసేందుకు అనుమతించారు. బయటకు వెళ్తున్నవారిలో ఆందోళన చేస్తున్న వారిని గుర్తించి అరెస్టు చేశారు.


జర్నలిస్ట్ అరెస్టు

సిటీ సెంట్రల్ లైబ్రరీ బయట యూట్యూబ్ చానల్ జర్నలిస్ట్ మహిపాల్ యాదవ్ కవరేజ్‌లో భాగంగా అభ్యర్థులతో మాట్లాడుతుంటే అతడిని పోలీసులు అరెస్ట్ చేశారు. తాను రిపోర్టర్‌నని చెప్పినా వినిపించుకోలేదు. ఈ విషయంపై వివిధ చానళ్ల ప్రతినిధులు ఇన్‌స్పెక్టర్‌ను అడుగగా 'మా పనికి అడ్డు వచ్చిన వారిని అరెస్టు చేస్తాం' అని దురుసుగా సమాధానమిచ్చారు.

నియంతృత్వ ధోరణి నశించాలి: జంగయ్య

కాంగ్రెస్ ప్రభుత్వ నియంతృత్వ ధోరణి నశించాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి పీ జంగయ్య మండిపడ్డారు. నిరుద్యోగులను రెచ్చగొట్టి ఓట్లు దండుకొని ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసుకుని.. ఇప్పుడు కనీసం వారితో మాట్లాడే ఆలోచనలో కూడా లేని దౌర్భాగ్యపు స్థితిలో ప్రభుత్వం ఉన్నదని దుయ్యబట్టారు. నిరుద్యోగులు ఇంత ఆందోళన చేస్తున్నా దున్నపోతు మీద వాన పడ్డట్టు వ్యవహరించడం అత్యంత సిగ్గుచేటని విమర్శించారు.

నిరుద్యోగుల సమస్యలపై అఖిలపక్షాన్ని పిలవండి



హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తున్న నిరుద్యోగులపై ప్రభుత్వ నిర్బంధం సరైంది కాదని, వారి సమస్యల పరిష్కారం కోసం వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని పిలవాలని రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ఓ లేఖను విడుదల చేశారు. అఖిలపక్ష సమావేశంలో నిరుద్యోగుల సమస్యలపై చర్చించి పరిష్కరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. గ్రూప్-1లో 1:100, గ్రూప్-2, 3 పోస్టులను పెంచడం, డీఎస్సీ వాయిదా, జీవో పోస్టులు తదితర అంశాలపై చర్చిస్తే తప్పకుండా పరిష్కారం లభిస్తుందని తెలిపారు.

'మొండి వైఖరి వీడాలి'

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): పరీక్షలపై ఆందోళన చేస్తున్న నిరుద్యోగులతో చర్చలు చేయకూడదనే నియంతృత్వ వైఖరిని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడనాడాలని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు ప్రొఫెసర్ చక్రధరరావు, కార్యదర్శులు ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. నిరుద్యోగులు తమ డిమాండ్లపై పోరాటం చేస్తున్నా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చర్చలకు పిలవకపోవడం గర్హనీయమని అభిప్రాయపడ్డారు. ఉద్యమంలో ప్రతిపక్ష పార్టీలు ఉన్నాయనే పేరుతో నిరుద్యోగులను అరెస్ట్ చేయడం, బారికేడ్లు, ముళ్లకంచెలు ఏర్పాటు చేసి నిర్బంధాన్ని ప్రయోగించడం నియంతృత్వ ప్రభుత్వ లక్షణం అన్నారు. ప్రభుత్వం నిరుద్యోగులతో చర్చలు జరపాలని, పరీక్షల వాయిదా విషయాన్ని పరిశీలించాలని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ డిమాండ్ చేసింది.

శాంతియుత ఆందోళన నిషేధమా?

- నిరుద్యోగ యువతపై సర్కారు దుర్మార్గం
- విద్యార్థి నాయకులను విడుదల చేయాలి
- ప్రభుత్వం ఇలాగే మొండికేస్తే పోరాటం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): నిరుద్యోగ యువకులు తమ డిమాండ్ల సాధన కోసం ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. నిరుద్యోగ యువకుల సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరించాల్సింది పోయి నిర్బంధం పెడుతూ అరెస్టులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల డిమాండ్ల పరిష్కారం కోసం సెక్రటేరియట్ ముట్టడికి ప్రయత్నించిన రాజారాంయాదవ్ సహా ఇతర విద్యార్థి నాయకులను అరెస్ట్ చేయడాన్ని ఆయన ఒక ప్రకటనలో ఖండించారు. అధికారంలోకి రాగానే నిరుద్యోగ సమస్య లేకుండా చేస్తామని నమ్మబలికిన సర్కార్ ఇప్పుడు వారిని గాలికి వదిలేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకురావడం ప్రజాపాలనలో నిషేధమా? అని ప్రశ్నించారు. గత కొన్ని రోజులుగా విద్యార్థులు, నిరుద్యోగుల పట్ల ప్రభుత్వం అణచివేత ధోరణి అవలంబిస్తున్నదని, ఇది సరికాదని హెచ్చరించారు. పోలీసులు అరెస్ట్ చేసిన రాజారాంయాదవ్ సహా మిగతా విద్యార్థి నాయకులందరినీ బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులను రెచ్చగొట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ వారిని పట్టించుకోవడం మానేసిందని విమర్శించారు. విద్యార్థులు, నిరుద్యోగులు చేస్తున్న డిమాండ్లను పరిష్కరించకపోతే ఏ నిరుద్యోగులను రెచ్చగొట్టి గద్దెనెక్కారో వాళ్లే ఈ ప్రభుత్వ పతనాన్ని శాసిస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇలాగే మొండి వైఖరితో ముందుకెళ్తే బీఆర్ఎస్ తరఫున పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని కేటీఆర్ హెచ్చరించారు.

నిరుద్యోగులు ఉగ్రవాదులా?

ఆ మేధావులు ఇప్పుడేందుకు మాట్లాడ్తలేరు?: మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్



హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ) : అధికారం కోసం నిరుద్యోగులను వాడుకున్న కాంగ్రెస్, ఇప్పుడు వారిని ఉగ్రవాదుల్లా చూస్తున్నదని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సచివాలయం, ఉస్మానియా యూనివర్సిటీ చుట్టూ పోలీస్ బలగాలను దించారని, నిరుద్యోగులేమైనా ఉగ్రవాదులా? అని ప్రశ్నించారు. రేవంత్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఇండ్ల చుట్టూ తిరిగి కండువాలు కప్పుతున్నారని విమర్శించారు. కేవలం డీఎస్సీ వాయిదానే నిరుద్యోగులు అడుగుతున్నారని, గ్రూప్-2, 3 పోస్టులు పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. 'గ్రూప్ -1 మెయిన్స్‌కు 1:100 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేయాలని అసెంబ్లీలో భట్టి డిమాండ్ చేయలేదా? నిరుద్యోగుల పక్షాన రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గేను తీసుకెళ్లి దింపినవారు ఇప్పుడు పలకరించరేదా?' అని ప్రశ్నించారు. నిరుద్యోగులపై ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతున్నదని, సీఎం అహంకార పూరిత మాటలపై మేధావులు ఎందుకు స్పందించడం లేదని? ప్రొఫెసర్ కోదండరాం, ఆకునూరి మురళి, ప్రొఫెసర్ నాగేశ్వర్ ఎక్కడికి పోయారని ప్రశ్నించారు. కోచింగ్ సెంటర్ల నిర్వాహకులను సీఎం విమర్శిస్తే ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. నిరుద్యోగుల సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో పోరాడుతామని ఇప్పటికే కేటీఆర్ ప్రకటించారని చెప్పారు. నిరుద్యోగులను పెయిడ్ ఆర్టిస్టులుగా చిత్రీకరిస్తున్నారని, నిరుద్యోగుల సమస్యలపై కమ్యూనిస్టులు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. అరెస్టు చేసిన నిరుద్యోగులందర్నీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నిరుద్యోగులది కృత్రిమ ఉద్యమం

- నిరసనల వెనుక రాజకీయ ప్రోద్బలం
- త్వరలో 9వేల పోస్టులతో మరో డీఎస్సీ
- అన్నిరంగాల్లో 30 లక్షల ఉద్యోగాలు భర్తీ
- ప్రజాభవన్‌కు వచ్చి నిరసన తెలపండి
- ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేయకండి
- ప్రజాకళ సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి



హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ) : కొందరు రాజకీయ నాయకులు డబ్బు ఖర్చు చేసి నిరుద్యోగులతో కృత్రిమ ఉద్యమాలు చేయిస్తున్నారని, దీని వెనుక రాజకీయ ప్రోద్బలం ఉన్నదని ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి ఆరోపించారు. సచివాలయంలోని మీడియా పాయింట్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ అధికారంలోకొచ్చిన ఏడాదిలోపు 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, ఈ మేరకు ఇప్పటికే 30 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని చెప్పారు. గ్రూప్ వన్ నోటిఫికేషన్, మెయిన్స్ షెడ్యూల్ కూడా ఇచ్చామని గుర్తుచేశారు. రాష్ట్రంలో 20 వేల ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. తాము ఒకేసారి 20వేల పోస్టులు భర్తీ చేస్తే నాణ్యమైన అభ్యర్థులు దొరకరనే ఉద్దేశంతో మొదట 11 వేలకు పైగా పోస్టులతో నోటిఫికేషన్ ఇచ్చామని తెలిపారు. మిగతా 9వేల పోస్టులతో మరో నోటిఫికేషన్ వేస్తామని చెప్పారు. కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు విద్యార్థులను ప్రేరేపించి ఆందోళన చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి ఇంటికి వెళ్లి ధర్నా చేయడం కాదని, అవసరమైతే ప్రజాభవన్‌కు వచ్చి నిరసన తెలపాలని కోరారు. ప్రజావాణిలో వేసే దరఖాస్తులకు ఫలితాలు కూడా వస్తున్నాయని, రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేయొద్దని కోరారు.

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
నిజామాబాద్	33.3°c	24.6°c
ఆదిలాబాద్	32.4°c	25.1°c
రంగారెడ్డి	30.2°c	21.7°c
ఖమ్మం	30.0°c	25.0°c
మెదక్	29.7°c	22.5°c
కరీంనగర్	29.0°c	25.0°c
వరంగల్	29.0°c	24.0°c
నల్లగొండ	28.5°c	22.0°c
హైదరాబాద్	28.0°c	22.6°c
మహబూబ్‌నగర్	25.6°c	23.1°c

ఐదు రోజులు భారీ వర్షాలు!

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రాబోయే ఐదు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నదని వాతావరణ శాఖ వెల్లడించింది. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని, దీని ప్రభావంతో వర్షాలు కురుస్తాయని తెలిపింది. మరో వారం రోజుల్లో ఇంకో అల్పపీడనం ఏర్పడొచ్చని, కాబట్టి ఈ నెల 25 వరకూ వర్షాలు పడొచ్చని అంచనా వేసింది. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా సోమవారం మంచిర్యాల, జయశంకర్-భూపాలపల్లి, వికారాబాద్, సంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో మోస్తరు వర్షం కురిసింది. మంచిర్యాల జిల్లా వేమనపల్లిలో అత్యధికంగా 13.86 సెంటీమీటర్ల (సెం.మీ) వర్షపాతం నమోదైంది. హైదరాబాద్‌లోని మారేడుపల్లిలో 6.73 సెం.మీ. వర్షం కురిసింది. కాగా, ఈ ఏడాది జూన్ 1 నుంచి జూలై 15 (సోమవారం) వరకు రాష్ట్రంలో 258.6 మిల్లీమీటర్ల (మి.మీ) వర్షపాతం నమోదైనట్టు వాతావరణ శాఖ తెలిపింది. గత ఏడాది ఇదే సమయానికి 189.5 మిల్లీమీటర్లు నమోదైంది. అయితే ఇప్పటికీ దాదాపు 102 మండలాల్లో లోటు వర్షపాతం ఉన్నది.



ధర్నాకు అనుమతించాలని న్యూఢిల్లీ డీసీపీకి వినతిపత్రం అందజేస్తున్న మోతీలాల్‌నాయక్

ఢిల్లీకి చేరిన ఉద్యమం

- నేడు జంతర్‌మంతర్‌లో నిరుద్యోగుల ధర్నా
- 'రేవంత్‌రెడ్డి హటావో.. తెలంగాణ బచావో' నినాదంతో మోతీలాల్‌నాయక్ పోరాటం

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని నిరుద్యోగుల ఉద్యమం దేశ రాజధాని ఢిల్లీకి చేరింది. గల్లీలోని కాంగ్రెస్ సర్కారు పట్టించుకోకపోవడంతో ఢిల్లీ కాంగ్రెస్‌కు తమ తడాఖా చూపేందుకు నిరుద్యోగులు ఢిల్లీ వెళ్లారు. రేవంత్ సర్కారు తీరును ఢిల్లీ వేదికగా ఎండగట్టేందుకు రాహుల్‌గాంధీ ఇంటి ముట్టడికి పిలుపునిచ్చారు. మంగళవారం ఢిల్లీ జంతర్‌మంతర్‌లో ధర్నా నిర్వహించనున్నారు. నిరుద్యోగ జేఏసీ నేత మోతీలాల్‌నాయక్ నేతృత్వంలోని 30 మంది ప్రతినిధుల బృందం సోమవారం ఢిల్లీకి చేరింది. జంతర్‌మంతర్‌లో ధర్నాకు అనుమతివ్వాలని న్యూఢిల్లీ డీసీపీని కలిసి వినతిపత్రాన్ని సమర్పించగా వీరిలో కొందరు రాహుల్‌గాంధీ ఇంటి ముట్టడికి పిలుపునిచ్చారు. జంతర్‌మంతర్‌లో ధర్నా, రాహుల్‌గాంధీ ఇంటి ముట్టడిని విజయవంతం చేయాలని జేఏసీ నేతలు కోరారు. ధర్నాకు ఢిల్లీ పోలీసులు అనుమతినిచ్చినట్టు మోతీలాల్‌నాయక్ తెలిపారు. 'రేవంత్‌రెడ్డి హటావో.. తెలంగాణ బచావో' అనే నినాదంతో పోరాటాన్ని ఉధృతం చేస్తామని, డిమాండ్లు నెరవేరేదాకా ఢిల్లీ దద్దరిల్లేలా ఉద్యమిస్తామని స్పష్టంచేశారు. దశలవారీగా నిరుద్యోగులు ఢిల్లీకి వస్తారని, జంతర్‌మంతర్‌లో ధర్నా చేస్తారని, ఢిల్లీలో పోరాటం నిరంతరాయంగా కొనసాగుతుందని చెప్పారు.

రేవంత్ సర్కారు స్పందన లేకనే..

పరీక్షలు రాయనివాళ్లే దీక్షలు చేస్తున్నారంటూ సీఎం రేవంత్‌రెడ్డి అవమానించడంతో ఆగ్రహించిన నిరుద్యోగులు శనివారం రాత్రి చిక్కడపల్లి, అశోక్ క్రాస్‌రోడ్స్, అశోక్‌నగర్‌లో తెల్లవారేదాకా నిరసన కొనసాగించారు. సీఎం రేవంత్‌రెడ్డికి కౌంటర్‌గా మోతీలాల్‌నాయక్ గ్రూప్ -1, గ్రూప్-4 హాల్‌టికెట్లను ఐహిత్యం చేశారు. అశోక్‌నగర్‌లో పోలీసుల బందోబస్తు నేపథ్యంలో నిరుద్యోగులు దీక్షను వేదికగా చేసుకొని ఆదివారం రాత్రి మెట్రో పిల్లర్ల కింద ఆందోళన చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం దిగిరాకపోవడంతో ఇక ఢిల్లీలోనే తేల్చుకోవాలని నిర్ణయించారు.

విపక్ష ఎమ్మెల్యేల హక్కులను కాలరాస్తున్న సర్కార్

> మొదటిపేజీ తరువాయి...



హక్కులకు భంగం కలిగిస్తూ, ప్రజాస్వామిక స్ఫూర్తిని కాలరాస్తున్నదని దుయ్యబట్టారు. ప్రతి సందర్భంలో ప్రొటోకాల్ ఉల్లంఘనలకు పాల్పడుతూ రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించడం ప్రభుత్వానికి అలవాటుగా మారిందని ధ్వజమెత్తారు. తమ పదేండ్ల పాలనలో ఎప్పుడూ ప్రొటోకాల్ ఉల్లంఘనలకు పాల్పడలేదన్నారు.

కాంగ్రెస్ నాయకులే ప్రజాప్రతినిధులా?

ఎమ్మెల్యేలకు స్థానిక నియోజకవర్గంలో జరిగే ఏ పనికి సంబంధించినైనా ప్రొటోకాల్ ఉంటుందని, కాంగ్రెస్ నాయకులు కావాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అవమానించే విధంగా ప్రొటోకాల్ ఉల్లంఘనలకు పాల్పడుతున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీతోపాటు ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్ధిదారులకు అందించాల్సిన చెక్కులను స్థానిక ఎమ్మెల్యేలు కాదని కాంగ్రెస్ నాయకులే పంపిణీ చేస్తున్నారని ఉదహరించారు. అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభ కార్యక్రమాలను ఎమ్మెల్యే లేకుండానే పూర్తి చేస్తున్నదని అభ్యంతరం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు లేని చోట పోటీ చేసి, ఓడిపోయిన అభ్యర్థి, లేదంటే అక్కడి కాంగ్రెస్ నాయకులే ఎమ్మెల్యేలు అన్నట్టుగా వ్యవహారం సాగుతున్నదని మండిపడ్డారు. హుజూరాబాద్, మహేశ్వరం, ఆసిఫాబాద్, జనగామ సహా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్న చాలా నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి నెలకొన్నదని తెలిపారు. ప్రొటోకాల్ ఉల్లంఘనలకు యథేచ్ఛగా పాల్పడుతూ ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేలపైనే ఎదురుదాడి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వంలోని పెద్దల బెదిరింపుల కారణంగా అధికారులు సైతం వాళ్లు చెప్పిన విధంగా చేసే పరిస్థితి తీసుకొచ్చారని విమర్శించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి అప్రజాస్వామిక సంఘటనలు ఎంత మాత్రం సరైనవి కావని స్పష్టంచేశారు. రాష్ట్రంలో ఏడు నెలలుగా ప్రొటోకాల్ ఉల్లంఘనలు వరుసగా జరుగుతున్నాయని, ఈ విషయాన్ని తమ పార్టీ ఎమ్మెల్యేలు స్పీకర్ దృష్టికి తేవాలనే ప్రయత్నం చేసినా అందుబాటులో లేరని పేర్కొన్నారు.

ప్రొటోకాల్‌ను పరిరక్షించాలి

ఎమ్మెల్యేల హక్కులను, వారికి ఉండే ప్రొటోకాల్‌ను పరిరక్షించే విషయంలో పూర్తి అధికారం స్పీకర్‌దేనని కేటీఆర్ గుర్తుచేశారు. ఎమ్మెల్యేల హక్కులు, ప్రొటోకాల్, వారి గౌరవానికి భంగం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత స్పీకర్‌పైనే ఉన్నదని పేర్కొన్నారు. గత కొంతకాలంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేల విషయంలో ఏ విధంగా ప్రొటోకాల్ ఉల్లంఘనలకు పాల్పడుతున్నారో మీడియా ద్వారా కూడా వెలుగుచూసిన విషయాన్ని గుర్తుచేశారు. ఎమ్మెల్యేల హక్కుల రక్షణ విషయంలో స్పీకర్ తన అధికారాలను వినియోగించాలని కోరారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ప్రొటోకాల్ పరిరక్షణ కోసం వెంటనే సీఎస్ సహా అన్ని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయాలని ఆయన స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు.

ఓడిన అభ్యర్థి వేదికపై.. ప్రజలెన్నుకున్న ఎమ్మెల్యే నేలపై!

> మొదటిపేజీ తరువాయి...



మహేశ్వరం నియోజకవర్గం అల్మాస్‌గూడ డివిజన్ ఖిలా మైసమ్మ దేవాలయంలో బోనాల పండుగ చెక్కుల పంపిణీ సందర్భంగా ప్రొటోకాల్ పాటించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ అధికారులను నిలదీస్తున్న మాజీ మంత్రి సబిత. బలవంతంగా నెట్టి వేస్తున్న పోలీసులు

శాసనసభకు ప్రాతినిధ్యం వహించడంతోపాటు మూడు పర్యాయాలు మంత్రిగా సుదీర్ఘ రాజకీయానుభవం ఉన్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కాంగ్రెస్ సర్కారు తీరుపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే అధికారిక స్టేజీ ముందు నేలపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ప్రజాపాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాప్రతినిధులకు ఇచ్చే గౌరవం ఇదేనా? అని మండిపడ్డారు.

కొత్తపేట పరిధిలోని అల్మాస్‌గూడ డివిజన్ ఖిలా మైసమ్మ దేవాలయ ఆవరణలో ఆషాఢ మాస బోనాల దశాబ్ది ఉత్సవాలు-2024 చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డితో పాటు కాంగ్రెస్ ప్రభుత్వ సలహాదారుడు వేణుగోపాల్‌రావు హాజరయ్యారు. అధికారులు వారిని స్టేజీ మీదకు ఆహ్వానిస్తూనే, కార్యక్రమంతో ఏమాత్రం సంబంధంలేని, ప్రధానంగా ప్రజాప్రతినిధి కాని కాంగ్రెస్ నాయకుడు కే లక్ష్మారెడ్డిని స్టేజీ మీదకు ఆహ్వానించారు. దీనిపై ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారిక కార్యక్రమాల్లో సంబంధం లేని వ్యక్తిని ఎలా స్టేజీ మీదకు ఆహ్వానిస్తారు? అని ప్రభుత్వ సలహాదారుడు వేణుగోపాల్‌రావుతో పాటు అధికారులను ప్రశ్నించారు. ఇదే సమయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు స్టేజీ మీదకు రావడంతో తోపులాట జరిగింది. బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ నినాదాలు చేయడంతో ఘర్షణ వాతావరణం నెలకొన్నది. అనంతరం మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి స్టేజీ మీద నుంచి కిందకు వచ్చి నేలపై బైఠాయించి తన నిరసన వ్యక్తం చేశారు. ఎప్పుడూ లేనివిధంగా లబ్ధిదారులను మాత్రమే లోపలికి అనుమతిస్తామని పోలీసులు చెప్పడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు పదిహేను నిమిషాల పాటు అక్కడ నిరసన వ్యక్తం చేసిన ఆమె.. ఆ తర్వాత దేవాలయం బయటికి వచ్చి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి మళ్లీ బైఠాయించి నిరసన వ్యక్తంచేశారు.

మాజీ ఎమ్మెల్యేలను ఆహ్వానించే చట్టం తీసుకురండి : ఎమ్మెల్యే సబితారెడ్డి

ఈ వివాదం నేపథ్యంలో ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య చేసిన వ్యాఖ్యలకు సబితారెడ్డి దీటుగా సమాధానమిచ్చారు. 'కేఎల్‌ఆర్ మాజీ ఎమ్మెల్యేనే కదా మేడం' అనడంతో ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ఇక్కడ (మహేశ్వరం)మాజీ ఎమ్మెల్యే కాదు. మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే నేనే ఉన్నాను. అధికారిక కార్యక్రమాలకు మాజీ ఎమ్మెల్యేలను పిలవడమనే చట్టం ఏమైనా ఉందా? రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో మాజీ ఎమ్మెల్యేలను పిలవండి. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్ నుంచే ఆ సంప్రదాయాన్ని ప్రారంభించండి. కొడంగల్‌లో కూడా మాజీ ఎమ్మెల్యే ఉన్నారు. అధికారిక కార్యక్రమాలకు ఆయనను పిలవండి. ప్రొటోకాల్ అంశంలో మీరు (పోలీసులు) ఎందుకు మాట్లాడుతున్నారు? అంటూ మండిపడ్డారు. దీంతో ఏసీపీ అక్కడి నుంచి వెళ్లిపోయారు.



ప్రొటోకాల్ ఉల్లంఘనలపై స్పీకర్ స్పందించాలి

మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ కార్యక్రమాలు, సమావేశాల్లో ప్రొటోకాల్ పాటించడం లేదని ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులను ప్రభుత్వం అవమానిస్తున్న తీరును ఆయన తీవ్రంగా ఖండించారు. సోమవారం మహేశ్వరంలో జరిగిన ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడుసార్లు మంత్రి, ఐదుసార్లు ఎమ్మెల్యే అయిన మహిళా ప్రజాప్రతినిధికి ఇందిరమ్మరాజ్యంలో గౌరవం లేదా? ప్రజలు గెలిపించిన నాయకులకు విలువ లేదా? అని ప్రశ్నించారు. మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని విస్మరించి, కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి మూడో స్థానానికి పరిమితమైన కిచ్చన్నగారి లక్ష్మారెడ్డికి అధికార యంత్రాంగం సలాం కొట్టడం ఏమిటని మండిపడ్డారు. ప్రొటోకాల్ విషయంలో ప్రజాప్రతినిధులకు జరుగుతున్న అవమానం పట్ల స్పీకర్ వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ రద్దుకు సుప్రీంకోర్టులో కేసీఆర్ పిటిషన్

విచారణ నేటికి వాయిదా

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఛత్తీస్‌గఢ్ నుంచి కొనుగోలు చేసిన విద్యుత్తుతోపాటు యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్తు కేంద్రాల నిర్మాణం తదితర అంశాలపై విచారణకు నియమించిన జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి కమిషన్‌ను రద్దు చేయాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ కమిషన్ తనకు నోటీసులు జారీచేసి, విచారణకు పిలవడంపై కేసీఆర్ న్యాయపోరాటం చేస్తున్నారు. దీంతో కేసీఆర్ పిటిషన్‌పై విచారణను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్టు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం ప్రకటించింది.

కాంగ్రెస్ మాట నిలబెట్టుకోవాలి

- 'కల్యాణలక్ష్మి'తో పాటు తులం బంగారం ఇవ్వాల్సిందే
- మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

భీమ్‌గల్, జూలై 15: కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద రూ.లక్ష చెక్కుతో పాటు తులం బంగారం ఇస్తామన్న హామీని కాంగ్రెస్ నిలబెట్టుకోవాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్‌లో 136 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను వేముల పంపిణీ చేసి మాట్లాడారు. ఎన్నికల్లో గెలిచేందుకు రేవంత్‌రెడ్డి బంగారం ఇస్తామని చెప్పారని, నెలలు గడిచిపోతున్నా ఇంకా ఇవ్వడం లేదన్నారు. వీఆర్‌ఏల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

గౌడల హామీలపై స్పందనేది?

- ట్యాంక్‌బండ్‌పై సర్వాయి పాపన్న విగ్రహమేది?
- గౌడలకు ఇస్తామన్న మోపెడ్లు ఎక్కడ?
- మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్



హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): కల్లు గీత కార్మికులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై సీఎం రేవంత్‌రెడ్డి నిరాశపరిచారని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. గౌడ కులస్థులకు కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఎన్నో హామీలు ఇచ్చారని, వాటి గురించి మాట్లాడుతారనుకుంటే.. స్పందించలేదని అన్నారు. సోమవారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. సీఎం రేవంత్ ఇచ్చిన కాటమయ్య మోకులు కేసీఆర్ హయాంలో తయారైనవేనని, ఎన్నికల కోడ్ వల్ల ఇవ్వలేకపోయామని తెలిపారు. వైన్, బార్‌షాపుల్లో గౌడలకు కేసీఆర్ హయాంలో 15 శాతం రిజర్వేషన్లు ఇస్తే, తాము 25 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రకటించిందని.. అలాంటిది షాపుల రిజర్వేషన్ల గురించి సీఎం ఎలాంటి ప్రకటన చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గీత కార్మికుల పెన్షన్ రూ.4 వేలకు పెంచాలని, ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి పడి చనిపోతే ఇచ్చే ఎక్స్‌గ్రేషియాను రూ.10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. గౌడలకు మోపెడ్‌లు ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. సర్వాయి పాపన్న జయంతి వచ్చే నెలలోనే ఉన్నదని, అప్పటికి విగ్రహం ఏర్పాటు చేయాలని, జనగామ జిల్లాకు సర్వాయి పాపన్న పేరు పెడతామన్నారని, ఇప్పటి వరకు ఆ ఊసే లేదని దుయ్యబట్టారు. సర్వాయి పాపన్న తిరిగిన 4 వేల ఎకరాల గుట్టలను పరిరక్షించేందుకు పురావస్తు శాఖకు అప్పగించాలని డిమాండ్ చేశారు. నిర్మాణాలు జరుపుకుంటున్న నీరా కేఫ్‌ల మిగతా పనులు పూర్తి చేసి ప్రారంభించాలని, కల్లు దుకాణాలకు శాశ్వత లైసెన్సులు ఇస్తామన్న హామీ నెరవేర్చాలని అన్నారు. హామీల అమలుపై స్పందించకుంటే గౌడ సంఘాలతో సమావేశమై భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తిక్కమయ్యగౌడ్, కల్లు గీత ఆర్థిక సహకార సంస్థ మాజీ చైర్మన్ పల్లె రవి కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ నేత ఇస్లావత్ రామచంద్రునాయక్ పాల్గొన్నారు.

గౌడన్నల గుండెలపై తన్నిన రేవంత్

- చెట్టుపై నిలబెట్టి ఎకసెక్కాలా?
- కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ ఆంజనేయగౌడ్



హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని గౌడన్నల ఆత్మగౌరవ గుండెలపై సీఎం రేవంత్‌రెడ్డి తన్ని తాను బీసీ వ్యతిరేకినని మరోసారి స్పష్టంచేశారని స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ ఆంజనేయగౌడ్ ఆరోపించారు. లష్కర్‌గూడ సభలో సీఎం వ్యవహారశైలి దారుణమని ఆయన సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆవేదన వ్యక్తంచేశారు. గౌడన్నను చెట్టుపై చాలాసేపు నిలబెట్టి, కింద కుర్చీపై కాటమయ్య కాలేసుకొని కూర్చొని వృత్తిని ఎగతాళి చేస్తూ, సహచర మంత్రులతో ఎకసెక్కాలాడుతూ సీఎం రేవంత్ తన దొరతనాన్ని ప్రదర్శించారని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం కేరళ వంటి రాష్ట్రాలకు ప్రతినిధి బృందం పంపి, అధ్యయనం చేయించి, బడ్జెట్ కేటాయించి రూపొందించిన కాటమయ్య రక్షణ కవచం కిట్లను తన ప్రభుత్వ పథకంగా సీఎం రేవంత్ ప్రగల్భాలు పలుకడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. ఐదు గుంటలపై వైఖరి మారకపోతే, ముఖ్యమంత్రికి ముందున్నది ముసళ్ల పండుగ అని ఆంజనేయగౌడ్ హెచ్చరించారు.

ఎమ్మెల్యేల ఫిరాయింపుపై విచారణ 18కి వాయిదా

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్యేలు దానం నాగేందర్ (ఖైరతాబాద్), కడియం శ్రీహరి (స్టేషన్‌ఘన్‌పూర్), తెల్లం వెంకటరావు (భద్రాచలం) పార్టీ ఫిరాయించి కాంగ్రెస్‌లో చేరడాన్ని సవాలు చేస్తూ బీఆర్ఎస్ దాఖలు చేసిన వ్యాజ్యాలపై విచారణ ఈ నెల 18కి వాయిదా పడింది. వారిపై అనర్హత వేటు వేసేలా స్పీకర్‌కు ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద వేర్వేరుగా దాఖలు చేసిన ఈ పిటిషన్లపై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి సోమవారం విచారణ జరపాల్సి ఉన్నది. కానీ, అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు ఈ విచారణ మరోసారి వాయిదా పడింది.



తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద. చిత్రంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

స్థానిక సంస్థల నిర్వీర్యానికే హైడ్రా

- మూడు ముక్కలుగా జీహెచ్‌ఎంసీ నిర్ణయానికి బీఆర్ఎస్ వ్యతిరేకం
- కాంగ్రెస్ పాలనలో పడిపోయిన హైదరాబాద్ బ్రాండ్
- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న పంచాయతీలు, కార్పొరేషన్లు, మున్సిపాలిటీలను కలిపి మూడు కార్పొరేషన్లుగా చేయాలనే ప్రభుత్వ ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి అనుభవరాహిత్యం, అవగాహన రాహిత్యం, అనాలోచిత నిర్ణయాలతో హైదరాబాద్ బ్రాండ్ పడిపోయిందని ఆందోళన వ్యక్తంచేశారు. సోమవారం తెలంగాణభవన్‌లో మీడియా సమావేశంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో కలిసి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ ప్రొటెక్షన్ అథారిటీ (హైడ్రా) పేరుతో ఔటర్ రింగ్ రోడ్డులోని అన్ని మున్సిపాలిటీలను, చెరువులను, భూములను, ఆస్తులను కాపాడుతామని రెండు రోజులుగా వస్తున్న వార్తలు స్థానిక సంస్థలకు వ్యతిరేకమని తెలిపారు. ప్రభుత్వ నిర్ణయాలన్నీ స్థానిక సంస్థలను బలోపేతం చేయకపోగా, నిర్వీర్యం చేస్తాయని ఆందోళన వ్యక్తంచేశారు. జీహెచ్‌ఎంసీతోపాటు శివారు ప్రాంతాల్లోని ఏడు కార్పొరేషన్లు, 20 మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టు లేనందునే హైడ్రా పేరుతో స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధులు, ప్రజలు భాగస్వామ్యం లేకుండా పెత్తనం చేయాలనే కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని వివేకానంద స్పష్టంచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మున్సిపల్ శాఖ మంత్రిగా కేటీఆర్ ఉన్న తర్వాత జోన్లు, సర్కిళ్లు పెంచి డిప్యూటీ కమిషనర్లకు అధికారాలు ఇచ్చి హైదరాబాద్ మహానగరాన్ని ఎంతో అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. ఫలితంగానే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఘనవిజయం సాధించిందని వివరించారు. ఏడు నెలలుగా ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయని, హైదరాబాద్ బ్రాండ్ రోజురోజుకు దిగజారి పోతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు.

పార్టీ మార్పు దుష్ప్రచారమే

కేసీఆర్ నాయకత్వంలో తనకు రాష్ట్రంలో అత్యధిక మెజార్టీ వచ్చిందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద తెలిపారు. పార్టీ మార్పుపై తనపై దుష్ప్రచారం చేస్తున్నారని, బీఆర్ఎస్ పార్టీ మారిన కడియం శ్రీహరి అనర్హత అంశంపై పిటిషనర్‌గా తానేనని వివేకానంద గుర్తుచేశారు. రాజకీయాల్లో హత్యలుండవని, ఆత్మహత్యలే ఉంటాయని, రేవంత్‌రెడ్డి ఆత్మహత్యాయత్నం చేసుకుంటున్నారని అన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు వచ్చే ఎన్నికల్లో టికెట్లు ఇస్తారో ఇవ్వరో అనే అనుమానం ఉందని తెలిపారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలందరూ త్వరలో అనర్హతకు గురవుతారని స్పష్టం చేశారు. ఉపఎన్నికలు వస్తాయని, బీఆర్ఎస్ అభ్యర్థులే విజయం సాధిస్తారని ధీమా వ్యక్తంచేశారు.

అర్చకుల బదిలీపై హైకోర్టు స్టే

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ఆలయాల్లోని అర్చకుల బదిలీ ప్రక్రియను నిలిపివేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీల కోసం దరఖాస్తులు కోరుతూ దేవాదాయ శాఖ జారీ చేసిన ఆదేశాలకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ పుల్లా కార్తీక్ సోమవారం విచారణ చేపట్టారు. అర్చకులను ఉద్యోగులుగా పరిగణించి బదిలీ చేయడం చెల్లదని, మతపరమైన కార్యకలాపాల్లో ప్రభుత్వం జోక్యం చేసుకోవడం సరికాదని పిటిషనర్ల తరఫు న్యాయవాది తెలిపారు. దీంతో అర్చకుల బదిలీలపై కోర్టు స్టే విధించింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని దేవాదాయ శాఖను ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

ఎమ్మెల్యే లేఖ ఆధారంగా చర్యలా?

బీఆర్ఎస్ కార్యాలయ నిర్మాణ కేసులో ఆర్డీవో తీరును తప్పుపట్టిన హైకోర్టు

హైదరాబాద్, జూలై 15(నమస్తేతెలంగాణ): హనుమకొండలో బీఆర్ఎస్ కార్యాలయం ఏర్పాటు కోసం కేటాయించిన స్థలాన్ని రద్దు చేయాలంటూ వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి రాసిన లేఖ ఆధారంగా ఆర్డీవో చర్యలకు ఉపక్రమించడాన్ని హైకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. ఎమ్మెల్యే చెబితే ఏమైనా చేసేస్తారా? అంటూ ప్రభుత్వాన్ని నిలదీసింది. ఈ వ్యవహారంలో కలెక్టర్‌కు రాజేందర్‌రెడ్డి రాసిన లేఖను సమర్పించాలని ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీ చేసింది. బీఆర్ఎస్ కార్యాలయ నిర్మాణ అనుమతులతో పాటు స్థల కేటాయింపు ఉత్తర్వులను మూడు రోజుల్లోగా సమర్పించాలంటూ జూన్ 25న మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ జారీచేసిన నోటీసుకు వ్యతిరేకంగా హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు వినయ్ భాస్కర్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ కే లక్ష్మణ్ సోమవారం విచారణ చేపట్టారు. 2018లో ప్రభుత్వం బీఆర్ఎస్‌కు ఎకరం స్థలాన్ని కేటాయించిందని పిటిషనర్ తరఫు న్యాయవాది తెలిపారు. అది ఉచితంగా జరిపిన కేటాయింపు కాదని, ఆ స్థలంకోసం ప్రభుత్వానికి బీఆర్ఎస్ రూ.4.84 లక్షలు చెల్లించిందని వివరించారు. ఇప్పటివరకు ప్రహరీ నిర్మాణం మాత్రమే జరిగిన ఆ స్థలం లో తాత్కాలికంగా షెడ్డును ఏర్పాటు చేసుకొని పార్టీ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఇంతలో అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి కల్పించుకుని.. ప్రభుత్వం కేటాయించిన స్థలంలో కాకుండా మరోచోట బీఆర్ఎస్ నిర్మాణాలు చేపట్టిందని, అనుమతులు లేకుండా ప్రహరీ నిర్మించిందని తెలిపారు. ఈ వాదనలపై న్యాయమూర్తి స్పందిస్తూ.. అసలు ఎమ్మెల్యే లేఖ ఆధారంగా అధికారులు చర్యలు చేపట్టడం ఏమిటని ప్రశ్నించారు. ఆ లేఖతోపాటు గత నెల 1న ఆర్డీవోకు కలెక్టర్ రాసిన లేఖనూ సమర్పించాలని ఆదేశిస్తూ.. తదుపరి విచారణను ఈనెల 18కి వాయిదా వేశారు.

కొత్త జీపీల నియామకాలు తుది తీర్పునకు లోబడే

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని దిగువ కోర్టుల్లో కొత్త న్యాయాధికారుల నియామకాలు తమ తుది తీర్పునకు లోబడి ఉండాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. యాదాద్రి భువనగిరి జిల్లా సెషన్స్ కోర్టులో ప్రభుత్వ న్యాయవాదిగా చేస్తున్న నాగారం అంజయ్య సహా పలువురు ప్రభుత్వ ప్లీడర్లు దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి సోమవారం విచారణ జరిపారు. ప్రస్తుతమున్న లా ఆఫీసర్ల స్థానంలో పనిచేయడానికి ప్రత్యామ్నాయ/తాత్కాలిక ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్లను ఆదేశించిందని, మూడేండ్ల కాలానికి నియమితులైన వారిని కాదని కొత్త ప్లీడర్లను నియమించడం రాజ్యాంగ విరుద్ధమని పిటిషనర్ల తరఫు న్యాయవాది పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కొత్త న్యాయాధికారులను నియమించకుండా తాత్కాలిక స్టే ఇవ్వాలని కోరారు. దీనిపై కౌంటర్ దాఖలుకు గడువు కావాలని ప్రభుత్వ న్యాయవాది కోరడంతో తదుపరి విచారణను ఈ నెల 22కు వాయిదా వేస్తున్నట్టు న్యాయమూర్తి ప్రకటించారు.

రాధాకిషన్‌రావు బెయిల్ పిటిషన్‌పై విచారణ నేటికి వాయిదా

నాంపల్లి కోర్టులు, జూలై 15(నమస్తే తెలంగాణ): ఫోన్ ట్యాపింగ్ కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు నాంపల్లి కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలుచేశారు. దీనిపై సోమవారం విచారణ చేపట్టిన 17వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్.. కౌంటర్ దాఖలు నిమిత్తం పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు నోటీసులు జారీ చేశారు. గడువు కావాలని పీపీ కోరడంతో విచారణ మంగళవారానికి వాయిదా పడింది.

పోలీసుల కస్టడీ పిటిషన్‌పై నేడు తీర్పు

కిడ్నాప్‌తోపాటు బెదిరింపు కేసులో జూబ్లీహిల్స్ పోలీసులు ప్రొడక్షన్ వారెంట్‌పై రాధాకిషన్‌రావును అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు విచారణ నిమిత్తం రాధాకిషన్‌రావును 10 రోజులపాటు తమ కస్టడీకి అప్పగించాలని కోరుతూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై నాంపల్లి కోర్టులో వాదనలు ముగిశాయి. దీంతో తీర్పును మంగళవారానికి వాయిదా వేస్తున్నట్టు కోర్టు ప్రకటించింది.



హైదరాబాద్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న పెన్షనర్ల జేఏసీ ప్రతినిధులు

పెన్షనర్ల పోరుబాట

- సీఎం మొండి వైఖరి వీడాలి
- మా సమస్యలు పరిష్కరించాలి
- మంత్రి, సీఎస్ చుట్టూ తిరిగినా పనులు కావడం లేదు
- పెండింగ్ డీఏల కోసం పెన్షనర్ల జేఏసీ నిరసన
- కలెక్టరేట్లలో ఆందోళన
- 30న ఇందిరాపార్కు వద్ద దీక్ష

హైదరాబాద్ సిటీబ్యూరో/జనగామ/కామారెడ్డి, జూలై 15 (నమస్తేతెలంగాణ): ప్రజాపాలన అంటూ సీఎం రేవంత్‌రెడ్డి గొప్పలు చెప్పుకోవడమే గానీ ఎక్కడా క్షేత్రస్థాయిలో కనిపించడం లేదని తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల జేఏసీ నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీఎస్‌ను చాలాసార్లు కలిసి విన్నవించినా ప్రయోజనంలేదని వాపోయారు. రాష్ట్రవ్యాప్తంగా సోమవారం అన్ని కలెక్టరేట్ల ఎదుట పెన్షనర్ల జేఏసీ సభ్యులు నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళనచేపట్టారు. జనగామ, కామారెడ్డి కలెక్టరేట్లలో డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ కే లక్ష్మయ్య, సెక్రటరీ జనరల్ జీ పుల్లారావు మాట్లాడుతూ.. పెన్షనర్లకు బకాయి ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈహెచ్‌ఎస్ స్కీంతో అన్ని కార్పొరేట్ దవాఖానల్లో నగదు రహిత చికిత్స వర్తింపచేయాలని చెప్పారు. ప్రతీ జిల్లాలో రెండు వెల్‌నెస్ సెంటర్లు, హైదరాబాద్‌లో 10 వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేసి వైద్యులు, మందులను అందుబాటులో ఉంచాలని కోరారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన ఐఆర్ 5 శాతాన్ని కనీసం 20 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. రూ.398 నిర్ణీత వేతనంతో పనిచేసి రిటైర్డ్ అయిన స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి గతంలో మాటిచ్చారని.. దాన్ని నిలబెట్టుకోవాలని కోరారు. పెన్షనర్లకు రాష్ట్రస్థాయిలో వైద్య బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణ ఉద్యమంలో ప్రభుత్వ పెన్షనర్లు క్రియాశీలకంగా పాల్గొన్నారని వారిసేవలను గుర్తించి ఇన్సెంటివ్ ఇచ్చి గౌరవించాలని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో చూపుతున్న నిర్లక్ష్యాన్ని ఎండగట్టేందుకు 30న రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద 'మౌన దీక్ష' చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 2 లక్షల మంది పెన్షనర్లు పాల్గొంటారని వివరించారు.

వేదిక
'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

ట్రంప్‌పై హత్యాయత్నం

అగ్రరాజ్యం అమెరికాలో ఎన్నికల సందడి మధ్యలో మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై హత్యాయత్నం జరగడంతో ప్రపంచం ఒక్కసారిగా ఉలికిపాటుకు గురైంది. ఆయన అదృష్టంగా వెంట్రుకవాసిలో మృత్యువును తప్పించుకోవడంతో అంతా హమ్మయ్యా అని ఊపిరి పీల్చుకున్నారు. ప్రజాస్వామిక దేశమైన అమెరికాలో పరాకాష్ఠకు చేరిన హింసా సంస్కృతికి ఇది అద్దం పడుతున్నది. సాయుధ అంగరక్షకుల తక్షణ ప్రతిస్పందనతో ట్రంప్ సురక్షితంగా బయటపడ్డప్పటికీ, నిఘా, భద్రతా ఏర్పాట్ల వైఫల్యం విమర్శలకు గురవుతున్నది. సాయుధ ఆగంతకుడు ఒక మాజీ అధ్యక్షుడికి అంత సమీపంలోకి ఎలా రాగలిగాడన్నది ప్రశ్న. ఈ హత్యాయత్నం వెనుక ఉన్న వ్యక్తులెవరో, వారి కుట్రలేమిటో ఇంతవరకైతే పెద్దగా తెలియరాలేదు. సాధారణంగా ఇలాంటి ఘటనలపై ఊహాపోహలు, కుట్రవాదాలు వెల్లువెత్తుతాయి. మాజీ అధ్యక్షుడు కెనెడీ హత్యోదంతం నిగూఢంగానే ఉండిపోవడం తెలిసిందే. ఇప్పుడీ ఘటన కూడా అలాగే మిగిలిపోవచ్చు. దాడికి తెగబడ్డ యువకుడిని భద్రతాధికారులు మట్టుబెట్టిన కారణంగా అసలు రహస్యం ఎప్పటికైనా బయటకు వస్తుందా? అనేది సందేహాస్పదమవుతున్నది.

దాడి ఘటన ఎన్నికల్లో రాజకీయ వేడి రాజేస్తున్నది. ఒకరకంగా చెప్పాలంటే మొత్తంగా ఎన్నికల ప్రచార సరళిని అది రాత్రికి రాత్రే తారుమారు చేసింది. సహజంగానే అధ్యక్ష ఎన్నికల్లో ఆరోగ్య నిర్ణాయక అంశంగా మారుతున్నట్టు స్పష్టమవుతున్నది. దీనిపైన, ముఖంపైన రక్తం చారికలతో కూడిన డొనాల్డ్ ట్రంప్ ఫొటోలను రిపబ్లికన్ పార్టీ ప్రచారాస్త్రాలుగా చేసుకుంటున్నది. అధ్యక్షుడు బైడెన్ తన రిపబ్లికన్ ప్రత్యర్థిపై చేసిన తీవ్ర విమర్శల ఫలితంగానే హత్యాయత్నం జరిగినట్టు రిపబ్లికన్ నేతలు ఆరోపించడమే ఇందుకు నిదర్శనం. ట్రంప్ మళ్లీ గెలిస్తే ప్రమాదమనీ, ఆయన ఓ నియంతలా మారి అమెరికా జీవనవిధానాన్ని దెబ్బ తీస్తారని జో బైడెన్ చేసిన హెచ్చరికలను ఈ సందర్భంగా వారు ఉదహరిస్తుండటం గమనార్హం. ముఖ్యంగా ట్రంప్‌పై 'గురి'పెట్టాలని, ఆయనను 'లక్ష్యం'గా చేసుకోవాలని ఇచ్చిన పిలుపును ఎత్తిచూపుతున్నారు. బైడెన్ యాదృచ్ఛికంగానే ఆ వ్యాఖ్యలు చేసినప్పటికీ ఇప్పుడు వాటినే ఎదురుదాడికి ఉపయోగించుకుంటున్నారు.

2020 అధ్యక్ష ఎన్నికల్లో పరాజయాన్ని అంగీకరించకుండా తన మద్దతుదారులతో కాంగ్రెస్ భవనంపై దాడి జరిపించారన్న ఆరోపణలు ట్రంప్‌ను వెంటాడుతూనే ఉన్నాయి. ఆ దాడి ఫలితంగా ఆయన కాంగ్రెస్ అభిశంసనకు గురవడమే కాకుండా, అనేక కేసులను కూడా ఎదుర్కొంటున్నారు. ఇలా ఎన్నో అవాంతరాలు ఎదురైనప్పటికీ ఆయన మరోసారి రిపబ్లికన్ అభ్యర్థిగా నామినేషన్ పొందడమే కాకుండా అధ్యక్షుడు బైడెన్‌కు గట్టి పోటీ ఇస్తుండటం విశేషం. అటు ప్రచారంలో వెనుకబడినట్టుగా భావిస్తున్న అధ్యక్షుడు బైడెన్ విజయావకాశాలను దాడి ఘటన తీవ్రంగా తీస్తే, ఇటు స్వల్ప ఆధిక్యతలో ఉన్న ట్రంప్‌కు సానుభూతి భారీగా పెరిగినట్టు వార్తలు వస్తున్నాయి. అంతిమంగా గెలుపోటములు ప్రజల చేతుల్లో ఉంటాయి. పెన్సిల్వేనియాలో జరిగిన దాడి ప్రస్తుత ఎన్నికలపై మాత్రమే కాకుండా దీర్ఘకాలికంగా అమెరికాపై ప్రభావం వేస్తుందని చెప్పవచ్చు.

రైతులపై ఎరువుల భారం!



పెన్నింటి విజయ్‌కుమార్
90520 39109

> 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని 2016 ఫిబ్రవరిలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. రెట్టింపు సంగతి పక్కనపెడితే పలు రాష్ర్టాల రైతుల ఆదాయం గణనీయంగా తగ్గినట్టు స్టాండింగ్ కమిటీ నివేదిక సమర్పించింది. మార్చి 2022లో విడుదల చేసిన ఈ నివేదిక ప్రకారం... 2015-16, 2018-19 మధ్య కొన్ని రాష్ర్టాల్లో రైతుల ఆదాయం పడిపోయింది. జార్ఖండ్‌లో రైతుల ఆదాయం నెలకు రూ.7,068 నుంచి రూ.4,895కి, నాగాలాండ్‌లో రూ.11,428 నుంచి రూ.9,877కి, ఒడిశాలో రూ.5,274 నుంచి రూ.5,112కి తగ్గాయి. ఆదాయం రెట్టింపు ముచ్చట దేవుడెరుగు కానీ రైతుల పెట్టుబడి వ్యయాన్ని రెట్టింపు చేసిందనేది ప్రభుత్వ వ్యవసాయ విధానాలను పరిశీలిస్తే మనకు అవగతమవుతుంది.

వ్యవసాయ రంగాన్ని సైతం కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టి రైతులను తమ పొలాల్లోనే కూలీలుగా మార్చే కేంద్ర ప్రభుత్వ వైఖరి సుస్పష్టంగా మన కండ్లముందున్నది. సబ్సిడీలతో, రుణమాఫీలతో కార్పొరేట్ వ్యవస్థను పెంచిపోషిస్తూ... దేశానికి వెన్నెముకైన నిలిచిన రైతులపై ఎరువుల భారం వేస్తూ వెన్నుపోటు పొడుస్తున్నది. 'రైతు పండించిన పంటలకు కల్పించే మద్దతు ధరకు, ఎరువుల ధరకు పొంతన లేకుండానే 2022లో ఎరువుల ధరలు 50 శాతం పెంచి రైతాంగాన్ని ఒక్కసారిగా ఆగాధంలోకి నెట్టింది. దీనికి కుంటిసాకుగా మాత్రం అంతర్జాతీయ మార్కెట్లో ఎరువుల ముడిసరుకు ధరలు పెరిగినట్టు చెప్తున్నది. ముడిసరుకు ధరలు పెరిగితే వాటిని భరించాల్సిన కేంద్రం ఆ భారాన్ని రైతులపై మోపుతూ వారి నడ్డిని విరుస్తున్నది. ఇదిలా ఉంటే రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ప్రగల్భాలు పలకడం చూస్తుంటే 'హత్య చేసినోడే సంతాపసభ కోసం వెతికినట్టు ఉన్నదని' రైతులు వాపోతున్నారు.

గడిచిన పదేండ్లలో కేంద్రం గుట్టుగా ఎరువుల ధరలను పెంచుతూ యూరియా, డీఏపీ వినియోగాన్ని తగ్గించేలా ప్రచారం చేయాలని రాష్ర్టాలకు చెప్తున్నది. రైతులు ఎక్కువగా వాడే 28.28.0 ఎరువు ధరను 50 శాతం, పొటాష్ ధరను 100 శాతానికి పైగా 2021 ఏడాది చివరలో 90 రోజుల్లోనే



పెంచడం కొసమెరుపు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు ఎంవోపీ, కాంప్లెక్స్ ఎరువుల ధరలను దేశంలో రైతులు ఎక్కువగా పండించే వరి, పత్తి పంటలకు మద్దతు ధరలను ఏ విధంగా పొంతన లేకుండా నిర్ణయించిందనేది ఒకసారి పరిశీలిద్దాం...

1. ఎరువుల ధరలు: (50 కిలోల బస్తాలు) 2. వరికి కేంద్ర ప్రభుత్వ మద్దతు ధర (రూపాయలలో)
3. పత్తి పంటకు కేంద్ర ప్రభుత్వ మద్దతు ధర(రూపాయలలో)

ఏడాది	కాంప్లెక్స్‌లు (రూ.లలో)	వరి సాధారణ రకం - ఎ గ్రేడ్ రకం	పత్తి పంటకు కేంద్ర ప్రభుత్వ మద్దతు ధర
2014-15	890-1210	1360-1400	3750-4050
2015-16	890-1210	1410-1450	3800-4100
2016-17	890-1197	1470-1510	3860-4160
2017-18	900-1225	1550-1590	4020-4320
2018-19	1040-1425	1750-1770	5150-5
2019-20	950-1425	1815-1835	5235-5550
2020-21	975-1275	1815-1835	5515-5825
2021-22	12-1395 (కొన్నింటికి 1900 రూపాయలు)	1940-1960	5726-6025
2022-23	1350-1400	2040-2060	6080-6380
2023-24	1450-1200 (కేవలం 20-20-13కు మాత్రమే)	2183-2203	6620-7020
2024-25	1700-1900	2300-2320	7121-7521

ఈ విధంగా కేంద్ర ప్రభుత్వం పొంతన లేని ఎరువుల ధరలు, పంటలకు మద్దతు ధరలను నిర్ణయించడం చూస్తుంటే వ్యవసాయ రంగంపై వారికి ఉన్న చిత్తశుద్ధి ఏమిటో అర్థమవుతున్నది. అంతేకాకుండా ప్రభుత్వాలు దశాబ్దాల నుంచి ఎరువులపై కొనసాగించిన రాయితీ విధానాన్ని కుంగలో తొక్కుతూ సేంద్రియ సాగును ప్రోత్సహించే 'పీఎం ప్రణామ్' సాకుతో ఈ ఆర్థిక సంవత్సరం ఎరువుల సబ్సిడీకి కేంద్రం 22.25 శాతం కోత పెట్టింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఎరువులపై సబ్సిడీ రూ.2.54 లక్షల కోట్లు ఉండగా, ఈ ఆర్థిక సంవత్సరం 2023-2024 ఆర్థిక సంవత్సరంలో రైతులకు ఎరువులపై ఇస్తున్న రాయితీని రూ.1.75 లక్షల కోట్లకు తగ్గిస్తున్నట్టు ఆర్థికమంత్రి సీతారామన్ పార్లమెంట్‌లో బడ్జెట్ సమావేశంలో తెలిపారు. ఈ విధంగా కేంద్ర ప్రభుత్వం ఎరువులపై సబ్సిడీని తగ్గిస్తుండటంతో ఆకస్మాత్తుగా ఎరువుల ధరలు భారీగా పెరిగి అంతంత మాత్రంగా ఉన్న రైతులపై భారం పడుతున్నది.

రైతాంగానికి తీవ్రనష్టం: ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల ఇప్పటికే తీవ్ర నష్టాల్లో ఉన్న రైతులకు పెరిగిన ఎరువుల ధరలు వారి ఆర్థిక స్తోమతను కుంగదీస్తున్నాయి. ఈ ఏడాది నామమాత్రంగా పెంచిన మద్దతు ధరలు, ఏటేటా పెరుగుతున్న ఎరువుల ధరలతో రైతులు అంతోళనకు గురవుతున్నారు. మన తెలంగాణలో వరితో పాటు పత్తి పంటలు అధికంగా సాగవుతాయి. పంటలకు పోషకాలు అందించేందుకు రైతులు ఎక్కువగా ఎరువులపైనే ఆధారపడుతుంటారు. అయితే ఏటా ఎరువుల ధరలు అందనంత ఎత్తుకు పెరుగుతుండటం, తెలంగాణలోని చిన్న, సన్నకారు రైతులే ఎక్కువగా ఉండటంతో వారు సాగుకే దూరంగా ఉండటం మంచిదనే అభిప్రాయానికి వస్తున్నారు. కరోనాకు ముందు 50 కిలోల పొటాష్ ధర రూ.870 ఉండగా నేడు అది రూ.1550కి చేరడం ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. అంతేకాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 5 శాతం జీఎస్టీని విధించడంతో ఒక్కో బస్తాకు దాని ధరను బట్టి 80- 120 రూపాయల అదనపు భారం పడుతున్నది. ఎరువులపై జీఎస్టీ విధానం పట్ల రైతులు కేంద్ర ప్రభుత్వంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వం ధరలు పెంచడంతో వ్యాపారులు సిండికేట్ అయి, మార్కెట్లో కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. దీంతో గతంలో ఎరువుల కొరత మధ్యప్రదేశ్, యూపీ తదితర రాష్ర్టాల్లో లైన్లలోనే నిలబడి రైతన్నలు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు అనేకం జరిగాయి.

కార్పొరేట్ల పక్షాన నిలుస్తున్న కేంద్రం.. భూమినే నమ్ముకున్న అన్నదాతపై ఎరువుల భారాన్ని మోపడం చూస్తుంటే వారి ప్రేమ ఎవరి మీద అనేది స్పష్టంగా అర్థమవుతున్నది. కార్పొరేట్లతో చేసే సహవాసం వారికి అధిక లాభాలను చేకూర్చవచ్చేమో కానీ, వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేస్తే భారీ మూల్యం చెల్లించక తప్పదు.

> వ్యవసాయ పంటల మద్దతు ధర కోసం 2004లో ఏర్పాటు చేసిన ఎం.ఎస్.స్వామినాథన్ కమిటీ 6 దశలుగా నివేదిక సమర్పించింది. సాగు వ్యయం కన్నా 50 శాతం అదనంగా గిట్టుబాటు ధరను ఇవ్వాలని సూచించింది. దానికి అనుగుణంగానే మద్దతు ధరలను తక్కువగా ప్రకటిస్తున్న కేంద్రం.. మూలధన వ్యయాన్ని, భూమి కౌలు వ్యయాన్ని పరిగణనలోకి తీసుకోవడం లేదు. అంతేకాకుండా మద్దతు ధర ఇచ్చి పంటల కొనుగోలుకు కేంద్రం విశ్వసనీయ వ్యవస్థను ఏర్పాటు చేయకపోవడంతో గిట్టుబాటు ధర రైతులకు అందని ద్రాక్షగానే మిగిలిపోతున్నది.

ఎరువుల ధరలను పెంచడం మూలాన రైతులకు తీరని నష్టం వాటిల్లుతున్నది. ఎరువుల ధరలను చిన్న, సన్నకారు రైతులకు అందుబాటు ధరలోకి తీసుకువచ్చి, జీఎస్టీ సుంకాన్ని రద్దుచేసి అన్న'దాత'పై అదనపు భారాన్ని మోపకుండా చూడాల్సిన బాధ్యత కేంద్రానిదే. ఎరువుల ముడిసరుకులపై అంతర్జాతీయ మార్కెట్లో పెరిగిన ధరలను కేంద్రమే భరించి.. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఎరువుల సబ్సిడీ విధానాన్ని రైతుల సంక్షేమం దృష్ట్యా కొనసాగించాలి. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని కేంద్రం తీసుకొచ్చిన ప్రణామ్ పథకంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలి. అంతే తప్ప దాన్ని సాకుగా చూపి ఎరువులపై సబ్సిడీని వెనక్కి తీసుకోవడం సరైన చర్య కాదు. అడ్డూఅదుపు లేకుండా పెరుగుతున్న ఇంధన ధరల వల్ల రైతులపై భారీగా భారం పడుతున్నది. వాటి ధరలను నియంత్రించాలి. లోపభూయిష్టంగా ఉన్న మద్దతు ధర విధానం అమలుతో పెట్టుబడి ఖర్చులు విపరీతంగా పెరిగేలా చేస్తున్నది. దీనిపై ఒక విశ్వసనీయ వ్యవస్థను ఏర్పాటుచేయాలి. అప్పుడే రైతులు ఆశలు తిరిగి చిగురిస్తాయి.

(వ్యాసకర్త: కేయూ విద్యార్థి)

ఏడు నెలల్లోనే దశాబ్దం వెనక్కి



బూడిద భిక్షమయ్య గౌడ్

తెలంగాణలో ఎక్కడ చూసినా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలే దర్శనమిస్తున్నాయి. రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులతో పాటు వివిధ వర్గాల ప్రజలు తమ తమ సమస్యల పరిష్కారం కోసం రోడ్లెక్కుతున్నారు.



ప్రజాపాలన అని గప్పాలు కొట్టే కాంగ్రెస్ ప్రభుత్వం సామాన్యుల సమస్యలను పట్టించుకోవడం లేదు. పైగా నిరసనలు చేస్తున్నవారిని ఇష్టారీతిన దుర్భాషలాడుతూ అక్రమ కేసులు పెడుతున్నది. రాజధాని హైదరాబాద్ హత్యలతో అట్టుడుకుతున్నది. శాంతిభద్రతలు కరవవడంతో రాష్ట్ర ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. కరెంట్ కోతలు ఎక్కువయ్యాయి. ఫలితంగా తెలంగాణలోని పరిశ్రమలు తరలిపోతున్నాయి. దాంతో ఉపాధి అవకాశాలు దెబ్బతింటున్నాయి. అసలు ఏం జరుగుతున్నది మన తెలంగాణలో? ఎట్లుండే తెలంగాణ ఎట్లయింది.

మోసపూరిత హామీలిచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఏ ప్రభుత్వమైనా కొత్తగా అధికారంలోకి వస్తే గత ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, సంక్షేమ పథకాలను ముందుకు తీసుకెళ్తుంది. కానీ, రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం వాటిని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నది. ఒక్క సంక్షేమ పథకాలే కాదు, సాగు, తాగు నీరు, పరిశ్రమలు, రియల్ ఎస్టేట్, కరెంట్, శాంతిభద్రతలు, ఉద్యోగాల కల్పన, విద్య, వైద్య వ్యవస్థ.. ఇలా ఒక్కటేమిటి అన్ని రంగాల్లో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. ఈ కారణంగా కొట్లాడి సాధించుకున్న తెలంగాణ ఏడు నెలల కాంగ్రెస్ పాలనలో ఎంతో వెనక్కి వెళ్లింది.

మొదటి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కానీ, అధికారంలోకి వచ్చి 7 నెలలైనా ఇప్పటివరకు ఒక్కటంటే ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేకపోయింది. కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలకు నియామక పత్రాలు ఇచ్చి తామే కొలువులు భర్తీ చేశామని గొప్పగా ప్రచారం చేసుకున్నది. వారికి కూడా నాలుగు నెలలుగా జీతాలు లేవు. జీతాల కోసం సీఎం ఇంటి ముందు ధర్నా చేసే పరిస్థితి వచ్చింది. డీఎస్సీ వాయిదా వేయాలని, 1:100 ప్రాతిపదికన గ్రూప్-1 అభ్యర్థులను ఎంపిక చేయాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగులు నిరసనలు, నిరాహార దీక్షలు చేస్తున్నారు. అయినా కాంగ్రెస్ సర్కార్ పట్టించుకోవడం లేదు. పైగా నిరసనలు చేస్తున్న నిరుద్యోగ యువతపై అక్రమ కేసులు పెడుతున్నది. కేసీఆర్ హయాంలో ఉన్న ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థ నేడు ప్రభుత్వ పెద్దలకు ఫ్రెండ్లీగా మారిపోయింది. నిరసనలను అణచివేస్తూ, అక్రమ కేసులు పెడుతూ, యువతను దుర్భాషలాడుతూ నేడు అదే పోలీస్ వ్యవస్థ తమ లాఠీలకు పని చెప్తున్నది. అంతేకాదు, మీడియా ప్రతినిధులపై కూడా కేసులు పెడుతుండటం దారుణం.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత ఉస్మానియా యూనివర్సిటీ మళ్లీ ఖాకీ వలయంగా మారుతుందని, ప్రత్యేక బలగాలు ఓయూ చుట్టూ మోహరిస్తారని ఎవరూ ఊహించి ఉండరు. కానీ, కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం ఏర్పడిన ఏడు నెలలకే 2014కు ముందు పరిస్థితులు ఓయూలో సాక్షాత్కారమయ్యాయి. విద్యార్థులతో కోలాహలంగా ఉండే వర్సిటీ పోలీసుల పహారాలోకి వెళ్లిపోయింది. ఎక్కడ, ఎవరూ కనిపించినా వారిని కాకాలను తరలిస్తున్నారు. ఆందోళనకారులపై ఏకంగా దాడులకు తెగబడుతున్నారు. మీడియా ప్రతినిధులను కాలర్ పట్టుకుని లాక్కెళ్లి పోలీస్ జీపులో పడేస్తున్నారు. దోషుల వలె జర్నలిస్టులను హింసిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వంలో చలనం రావడం లేదు. పరీక్షలు వాయిదా వేస్తారా, వేయరా? అన్నది ప్రభుత్వం ఇష్టం. కానీ, ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలపడం నిరుద్యోగుల హక్కు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు నిరుద్యోగులను పట్టించుకోలేదని కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ, మల్లికార్జున ఖర్గే పెద్దపెద్ద ఉపన్యాసాలు ఇచ్చారు. ప్రియాంకాగాంధీ దేశంలోనే యూత్ డిక్లరేషన్ కూడా ప్రకటించారు. రాహుల్, ఖర్గే కాంగ్రెస్ మేనిఫెస్టోతో పాటు జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించారు. రాహుల్‌గాంధీ స్వయంగా సెంట్రల్ లైబ్రరీకి వెళ్లి నిరుద్యోగులతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కానీ, ఇప్పుడు ఆ హామీలన్నీ నీటిమీద రాతలుగా మారాయి.

ఇప్పటికైనా రేవంత్ సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలకు స్వస్తి పలకాలి. పాలనపై దృష్టిసారించాలి. రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితమైతే బాగుంటుంది. ఇది అందరి రాష్ట్రం. కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రం. అనేక పోరాటాలు, త్యాగాలు, బలిదానాలతో సాధించుకున్న రాష్ట్రం. పోరాడి సాధించుకున్న తెలంగాణ కేసీఆర్ నాయకత్వంలో గత పదేండ్ల పాటు అభివృద్ధి పథంలో దూసుకుపోయింది. కేసీఆర్ సర్కార్ వలె ప్రస్తుత ప్రభుత్వం కూడా అభివృద్ధిని పరుగులు పెట్టించాలి. కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను కొనసాగించాలి. లేకపోతే కొట్లాడి సాధించుకున్న తెలంగాణ అందరి ముందు నవ్వుల పాలవుతుంది. రేవంత్‌కు పాలన అనుభవం లేదు. కనీసం సలహాదారులుగా అనుభవం ఉన్నవాళ్లను పెట్టుకొని తెలంగాణను ముందుకు తీసుకెళ్లాలి.

(వ్యాసకర్త: ఆలేరు మాజీ ఎమ్మెల్యే)




> డిగ్రీలెందుకు..
> పంక్చర్ షాపులు తెరవండి!
>
> మీరు చదివే డిగ్రీలు దండుగ. వాటితో భవిష్యత్తులో ఎలాంటి ప్రయోజనం ఉండదు. అందుకే మీకో సలహా ఇవ్వాలనుకుంటున్నా. డిగ్రీలు చదివే బదులుగా మోటార్‌సైకిల్ పంక్చర్ రిపేర్ షాపులను తెరవండి. అవే మీకు జీవనోపాధి మార్గాన్ని చూపిస్తాయి.
>
> - పన్నాలాల్, మధ్యప్రదేశ్ బీజేపీ ఎమ్మెల్యే





అనారోగ్య బదిలీలలు



యెనుగందుల శంకర్

వైద్యారోగ్యశాఖలో బదిలీలు గందరగోళంగా తయారయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 80 సాధారణ బదిలీలపై నిషేధం ఎత్తివేసింది. ఈ నిషేధం జూలై 21వ తేదీ వరకు కొనసాగుతుంది. దీంతో వైద్యారోగ్యశాఖ కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ వైద్యారోగ్యశాఖ ప్రత్యేకమైన బదిలీల కోసం జీవో 200ను జారీ చేసింది. సివిల్ సర్జన్లు, డిప్యూటీ సివిల్ సర్జన్లు, సివిల్ అసిస్టెంట్ సర్జన్ తదితర సిబ్బంది బదిలీల కోసం ఈ జీవో జారీ చేసింది. కానీ, ఆ జీవోలో 4 ఏండ్ల లోపు ఉన్నవారు బదిలీ కావలసిన అవసరం లేదని, నాలుగేండ్లు దాటిన వారే తప్పనిసరిగా బదిలీ కావాలని తెలియజేస్తూ మళ్లీ 40 శాతం మాత్రమే బదిలీ చేస్తామని చెప్పడం హాస్యాస్పదం.

ఇందులో బహుళార్థసాధక ఆరోగ్య కార్యకర్తలు అత్యధికంగా నష్టపోతున్నారు. వారికి వెకెన్సీ లిస్ట్‌లో క్లియర్ వెకెన్సీ పేరుతో ఏఎన్ఎం ఉన్న ఉపకేంద్రాలన్నీ క్లియర్ వెకెన్సీగా చూపిస్తూ నాలుగేండ్ల పైబడిన వారందరినీ సాధారణ వెకెన్సీగా చూపిస్తూ ఒక లిస్టు వచ్చింది. ఆ లిస్టుతో అందరికీ అందోళన మొదలైంది. ఎందుకంటే నాలుగేండ్లు పైబడిన వారందరూ ఆప్షన్ పెట్టుకోవాలా లేదా వెకెన్సీ లిస్ట్ ఏదైతే ఉందో ఆ లిస్ట్ ఎంత ఉందో అంతవరకు కటాఫ్ ఉన్న 40 శాతం మంది మాత్రమే ఆప్షన్ పెట్టుకోవాలా అనే సందేహం వారిలో ఉన్నది. అయితే ఆ సందేహాన్ని నివృత్తి చేయగల అధికారులు లేరు. హడావుడిగా డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌లో ఒక గ్రీవెన్స్ సెల్ ప్రారంభించి ఆ గ్రీవెన్స్ ఒకరోజు మాత్రమే సమయం ఇచ్చి జూలై 11 సాయంత్రం 5 గంటల లోపు మీకు ఎలాంటి సందేహాలున్నా నేరుగా ఫిర్యాదు చేయండని తెలిపారు. అయితే ఇంతవరకు కొన్ని క్యాడర్ల వెకెన్సీ లిస్ట్ కానీ, అర్హత గల వారి లిస్ట్ గానీ పెట్టలేదు. అంటే లిస్ట్ 11న ఉదయం వస్తే సాయంత్రం 5 గంటల లోపు హైదరాబాద్‌లో గల డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయానికి ఎలా చేరుకుని ఫిర్యాదు చేస్తారో ఒకసారి అధికారులు ఆలోచించాలి. అంతేకాకుండా జూలై 12వ తేదీ సాయంత్రం 5 గంటల లోపే ఆప్షన్ల పెట్టుకునే అవకాశం ఇచ్చారు. లిస్ట్ 11వ ఉదయం పెట్టి జూలై 12వ సాయంత్రం 5 గంటల లోపు ఆప్షన్లు పెట్టుకోవాలనడం విడ్డూరం. ఎందుకంటే వారికి కనీసం ఆలోచించుకునే సమయం కూడా ఇవ్వకుండా హడావుడిగా బదిలీలు చేయడం సరైంది కాదు. దీనివల్ల తర్వాత ఎన్నో ఆర్థిక లావాదేవీలతో అక్రమాలు జరిగే అవకాశాలున్నాయి. కాబట్టి ప్రభుత్వం గమనించి వెకెన్సీ లిస్ట్, బదిలీలకు అర్హత గల ఉద్యోగుల లిస్ట్ అందుబాటులో ఉంచి ఆప్షన్లు పెట్టుకోవడానికి సమయం ఇవ్వాల్సిన అవసరం ఉన్నది.

వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు జిల్లా అధికారులకు సరైన గైడ్‌లైన్స్ ఇచ్చి గ్రీవెన్స్ జిల్లా స్థాయిలోనే ఏర్పాటుచేస్తే బాగుంటుంది. రాష్ట్రం మొత్తానికి ఒకే గ్రీవెన్స్, అది కూడా ఒకరోజు మాత్రమే ఏర్పాటుచేయడం వలన గందరగోళ పరిస్థితి ఏర్పడుతున్నది. వెకెన్సీ లిస్ట్ కూడా ఒక్కో జోన్‌కు ఒక్కోరకంగా ఇస్తున్నారు. అంటే జోన్‌లో నాలుగేండ్లు దాటిన అందరి స్థానాలను వెకెన్సీ లిస్టులో సూచించారు. కొన్ని జోన్లలో 40 శాతం మాత్రమే వెకెన్సీ లిస్ట్‌లో చూపించారు. ఇది సరైంది కాదు. జూలై 11న వెలువడిన ఆరోగ్య విస్తరణాధికారుల సీనియారిటీ జాబితా తప్పుల తడకగా మారింది. ఎందుకంటే పన్నెండేండ్ల సీనియారిటీ ఉన్న వ్యక్తుల పేర్లు లేకపోవడం ఆశ్చర్యకరం, సీనియారిటీ క్రమంలో పేర్లు లేకపోవడం ఇంకా విచిత్రం. రెండేండ్లు మాత్రమే సీనియారిటీ గల వ్యక్తుల పేర్లు ఉండటం మరీ విచిత్రం. మొత్తంగా రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్‌లో బదిలీలు చేపడుతూ ఉద్యోగులకు చుక్కలు చూపిస్తున్నది.

(వ్యాసకర్త: ఆరోగ్య విస్తరణాధికారి)

• నీళ్ల కోసం ఖాళీ బిందెలతో నిరసన



నీటి సమస్యను పరిష్కరించాలని సోమవారం వనపర్తి జిల్లా అమరచింత పట్టణం బీసీ కాలనీలోని 6, 7వ వార్డుల మహిళలు, యువకులు ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించారు. వీరికి బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం, ప్రజాపంథా నాయకులు మద్దతు తెలిపారు. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని మున్సిపల్ మేనేజర్ హామీ ఇవ్వడంతో విరమించారు. - అమరచింత

• రోడ్డు కోసం బురదలో నాట్లు వేసి నిరసన



రోడ్డు కోసం బురదమయమైన రోడ్డుపై వరి నాట్లు వేసి నిరసన తెలిపారు నిర్మల్ జిల్లా మామడ మండలం పరిమండల్ గ్రామస్తులు. కొత్తపల్లి ఒకటో వార్డులో శ్మశానానికి వెళ్లే దారి బురదమయంగా మారింది. కనీసం నడవలేని పరిస్థితి నెలకొనడంతో బురదమయమైన రోడ్డుపై నాట్లు వేసి గ్రామస్తులు ఇలా నిరసన తెలిపారు. - నిర్మల్ అర్బన్

• కలెక్టరేట్ ఎదుట దళితబంధు లబ్ధిదారుల ఆందోళన



దళితబంధు పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు రేవంత్ సర్కారు కుట్రలు చేస్తున్నదంటూ సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట లబ్ధిదారులు ఆందోళనకు దిగారు. గత సర్కారు చేయూతతో యూనిట్లు పెట్టుకున్న తాము ఇప్పుడు నడుపుకోలేందుకు అప్పులు చేయాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. ఖాతాలు ఫ్రీజ్ చేయడంతో 8వేల మందికిపైగా లబ్ధిదారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని వాపోయారు. ఇప్పటికైనా న్యాయం చేయాలని, లేదంటే ఆత్మహత్యలే శరణ్యమంటూ కన్నీటి పర్యంతమయ్యారు. - కరీంనగర్ కలెక్టరేట్

• ఉపాధి కల్పించాలని నేతకార్మికుల ధర్నా



కాంగ్రెస్ సర్కారు తప్పుడు విధానాల వల్లే మరమగ్గాల పరిశ్రమ తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోయిందంటూ సిరిసిల్లలోని చేనేత జౌళిశాఖ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ చేనేత, పవర్‌లూం కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికులు, ఆసాములు సోమవారం ధర్నా చేశారు. లాల్‌బావుటా చేనేత, పవర్‌లూం కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంతం రవి మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభం వల్ల కార్మికులు ఆకలి చావులు, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. - రాజన్న సిరిసిల్ల, నమస్తే తెలంగాణ

• ఇన్నర్ రింగ్ రోడ్డు భూనిర్వాసితుల ధర్నా



ఖిలావరంగల్ ఇన్నర్ రింగ్ రోడ్డు భూనిర్వాసితులు వరంగల్ కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. ఏడేండ్లుగా పరిహారం ఇవ్వకుండా 200 ఫీట్ల రోడ్డు పనులు చేపడుతున్నారని ఆరోపించారు. కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ, రెవెన్యూ అధికారులు అవగాహన లేకుండా రేపు, మాపు అంటూ తిప్పుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికే పదుల సంఖ్యలో నిర్వాసితులు మనోవేదనతో మరణించినట్టు తెలిపారు. హనుమకొండకు వచ్చిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వినతి పత్రం ఇచ్చేందుకు ర్యాలీగా వెళ్లారు. - ఖిలావరంగల్

• భూములు కాపాడాలని చెంచుల ఆందోళన



సీఎం రేవంత్‌రెడ్డి ఇలాకా, మంత్రి జూపల్లి నియోజకవర్గంలో చెంచుల భూములు అన్యాక్రాంతమవుతున్నాయని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు రవికుమార్, తోకల భీమ్‌రావు ఆరోపించారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ ఆర్డీవో కార్యాలయం ఎదుట చెంచులు వర్షంలోనే ఆందోళన చేపట్టారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గం పర్వతాలు, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మానాయక్, రైతు సంఘం రాష్ట్ర నాయకుడు కృష్ణారెడ్డితోపాటు రవి, భీమ్‌రావు వీరికి మద్దతు తెలిపారు. - కొల్లాపూర్

• 'సీతారామ' కెనాల్ పనులను అడ్డుకున్న అఖిలపక్షం



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం వినోబానగర్ సమీపంలో సీతారామ ప్రాజెక్ట్ లింక్ కెనాల్ పనులను సోమవారం అఖిలపక్షం నాయకులు అడ్డుకున్నారు. పీజే ఆర్ ప్రభుత్వం చేసిన డిజైన్ ప్రకారం కెనాల్ నిర్మించి జూలూరుపాడు మండలం కాకర్ల, గుండెపూడి, పాపకొల్లుకు నీరందించాలని డిమాండ్ చేశారు. - జూలూరుపాడు

ఎమ్మెల్యేల ఇండ్ల ముట్టడి.. ఆందోళన

రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, పింఛన్ ఐదు వేలు ఇవ్వాలి.. 19న 'చలో ప్రజాభవన్': అంగన్‌వాడీలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, జూలై 15 : సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సోమవారం ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలు, ఇండ్ల వద్ద ధర్నాలు చేపట్టారు. డిమాండ్ల సాధన కోసం 19న చలో ప్రజాభవన్ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లకు రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని, రూ.5వేల పింఛన్ ఇవ్వాలని, జీవో 10 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గత కేసీఆర్ సర్కార్ టీచర్లకు రూ.2 లక్షలు, ఆయాలకు రూ.లక్ష ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. డిమాండ్లు నెరవేర్చకుంటే 19న శిశు సంక్షేమ శాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.



మహబూబాబాద్ తొర్రూరులో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఇంటి ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు



సీఐటీయూ ఆధ్వర్యంలో వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించిన అంగన్‌వాడీలు, ఆయాలు

ఎమ్మెల్యేల ఇండ్ల ముట్టడి

సీఐటీయూ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి ఇంటిని, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ క్యాంప్ కార్యాలయాలను ముట్టడించారు. సీఐటీయూ జిల్లా నాయకుడు బొల్లం అశోక్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఇంటిని ముట్టడించి, ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు శ్రీలతకు వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు గండి శైలజ, పనుల స్వరూప పాల్గొన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు, తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్ యూనియన్ జిల్లా కార్యదర్శి స్నేహలింద ఆధ్వర్యంలో మహబూబాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే మురళీనాయక్ క్యాంపు ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ భగవాన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

అసెంబ్లీలో లేవనెత్తుతాం..

సీఐటీయూ నాయకులు నాగన్న, దుర్గారావు, తిరుపతమ్మ, మంగమ్మ, సలీమా, వీరలక్ష్మి పాల్గొన్నారు. నిజామాబాద్‌లో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తాకు అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలు వినతిపత్రం అందజేయగా, సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తుతానని ఆయన హామీ ఇచ్చారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి క్యాంపు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డికి వేల్పూర్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలు(ప్రజాభవన్) వద్ద అంగన్‌వాడీలు ధర్నాకు దిగారు. కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు, భద్రాచలం, అశ్వారావుపేట, ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి నియోజకవర్గ కేంద్రాల్లో ప్రజాభవన్లను ముట్టడించి వినతిపత్రాలు అందజేశారు. అంగన్‌వాడీ యూనియన్ (సీఐటీయూ) మంచిర్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భానుమతి, రాజమణి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ర్యాలీ తీసి ముగ్గురు ఎమ్మెల్యేల ఇండ్ల ఎదుట ధర్నా చేశారు. కాగజ్‌నగర్ లో సర్‌సిల్క్ కాలనీలోని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ఇంటి ఎదుట ధర్నా చేసి, మాజీ జడ్పీటీసీ పాల్వాయి సుధారాణికి వినతిపత్రం ఇచ్చారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఎదుట ధర్నా నిర్వహించారు.

• ఉపాధ్యాయురాలి కోసం ఆందోళన



బదిలీల్లో భాగంగా పాఠశాలకు రాకుండా పోయిన ఉపాధ్యాయురాలు త్వరగా జాయిన్ అయ్యేలా చూడాలని జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలం కిష్టాపురం ప్రాథమిక పాఠశాల ఎదుట విద్యార్థులు, తల్లిదండ్రులు సోమవారం ఆందోళన చేపట్టారు. ఇన్‌చార్జి డీఈవోను వివరణ కోరగా విషయం తన దృష్టికి రాలేదని తెలిపారు. - అయిజ రూరల్

• డిగ్రీ కళాశాల కోసం పోస్టుకార్డు ఉద్యమం



జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణంలో డిగ్రీ కాలేజీతోపాటు వసతి గృహాలను ఏర్పాటు చేయాలని విద్యార్థులు పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. అయిజ పట్టణంలోని ప్రభుత్వ, హరిహర జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి సోమవారం సీఎం రేవంత్‌రెడ్డికి వేలాది పోస్టుకార్డులను రాయించి పోస్ట్ చేయించారు. - అయిజ



ఏజెన్సీ డీఎస్సీ కోసం ఐటీడీఏ ముట్టడి

ఏజెన్సీ డీఎస్సీ నిర్వహించాలని తుడుందెబ్బ ఆధ్వర్యంలో సోమవారం ములుగు జిల్లా ఏటూరునాగారంలోని ఐటీడీఏను ముట్టడించారు. తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో వంద శాతం రిజర్వేషన్ అమలుతో వెంటనే ఏజెన్సీ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పీవో చిత్రమిశ్రాకు వినతిపత్రాన్ని అందజేశారు. - ఏటూరునాగారం



ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చిన వృద్ధ దంపతులు

కొడుకు ఇంట్లోకి రానివ్వడం లేదు

- ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన వృద్ధ దంపతులు
- ఇంటికి చేరుకునే లోపే వృద్ధురాలి మృతి

ఎదులాపురం, జూలై 15 : కన్నకొడుకు ఇంట్లోకి రానివ్వడం లేదంటూ ఆదిలాబాద్ పట్టణానికి చెందిన 90 ఏండ్లకుపైబడిన వృద్ధ దంపతులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్థానిక క్రాంతినగర్‌కు చెందిన దేవ్‌రావు, విఠాబాయి(90) దంపతులకు ఇద్దరు కుమారులు, ఓ కూతురు ఉన్నారు. కొంతకాలం క్రితం పెద్ద కొడుకు మరణించాడు. చిన్న కుమారుడు గంగారాం ప్రైవేటు కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వృద్ధ దంపతులు ప్రస్తుతం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అర్లీ(టీ)లో కూతురు విమల వద్ద ఉంటున్నారు. తన కుమారుడు తమను ఇంట్లోకి రానివ్వడం లేదని, అలనా పాలనా చూసుకోవడం లేదంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆటోలో తిరిగి కూతురు విమల గ్రామం అర్లీ టీ వెళ్తుండగా తీవ్ర అనారోగ్యానికి గురైన విఠాబాయి మార్గమధ్యంలో మరణించింది. కుమారుడు గంగారాం రాకపోవడంతో కూతురు విమల, అల్లుడు పాండురావు వృద్ధురాలికి అంత్యక్రియలు నిర్వహించారు.

వాటాల కోసం వాదులాట

- అమ్మ ఆదర్శ నిధుల కోసం టీచర్ల రగడ
- విద్యార్థుల ఎదుటే బూతు పురాణం
- పాఠశాలకు తాళం వేసిన గ్రామస్తులు
- నేడు గ్రామస్తుల సమక్షంలో విచారణ

కుమ్రం భీం ఆసిఫాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ) : అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనుల కోసం మంజూరైన నిధుల విషయంలో ఇద్దరు ఉపాధ్యాయులు గొడవపడ్డారు. విద్యార్థుల ఎదుటే బూతులు తిట్టుకుంటూ చెప్పులతో కొట్టుకొట్టుకునే స్థాయికి వెళ్లారు. దీనికి సంబంధించి గ్రామస్తులు, విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్ మండలం సాలెగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అమ్మ ఆదర్శ పథకం కింద ఎంపికైంది. ఇందుకోసం రూ.7.25 లక్షలు మంజూరయ్యాయి. హెచ్ఎం ఆనంద్‌రావు 20 రోజులుగా అనారోగ్య కారణాలతో సెలవులో ఉన్నారు. మరో ఉపాధ్యాయుడు తిరుపతికి ఇన్‌చార్జి హెచ్ఎంగా బాధ్యతలు అప్పగించారు. సోమవారం హెచ్ఎం ఆనంద్‌రావు పాఠశాలకు వచ్చారు. అమ్మ ఆదర్శ నిధుల విషయంలో హెచ్ఎం ఆనంద్‌రావు, ఇన్‌చార్జి హెచ్ఎం తిరుపతికి మధ్య మాటామాటా పెరిగి గొడవకు దారితీసింది. బూతులు తిడుతూ చెప్పులు చూపిస్తూ, రాళ్లతో దాడికి ఆనంద్‌రావు ప్రయత్నించారు. విషయం తెలుసుకుని గ్రామస్తులు అక్కడికి వచ్చి గొడవను ఆపారు. పాఠశాలకు తాళం వేసి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. హెచ్ఎం ఆనంద్‌రావు ఇష్టానుసారంగా పనులు చేపట్టారని, పాఠశాల మరమ్మతుల కోసం తెచ్చిన సామగ్రిని తమ ముందే ఆటోలో తరలించుకుపోయారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నిధుల వాటా అందకపోవడంతో హెచ్ఎం ఆనంద్‌రావు గొడవకు దిగారని పేర్కొంటున్నారు. ఈ విషయమై ఎంఈవో మనుకుమార్‌ను వివరణ కోరగా.. మంగళవారం గ్రామస్తుల సమక్షంలో విచారణ చేపడుతామని తెలిపారు.



ఇన్‌చార్జి హెచ్ఎం తిరుపతి నుంచి వివరాలు తెలుసుకుంటున్న గ్రామస్తులు

రుణమాఫీకి కొర్రీలెన్నో!



వలపోతలను వదిలి వడపోతలపైనే దృష్టి

- మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): రైతు రుణమాఫీ అమలు విషయంలో ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలను పరిశీలిస్తే, రైతుల వల పోతల కంటే వడపోతలపైనే ఎక్కువ దృష్టి పెట్టినట్టు స్పష్టమవుతున్నదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. ఎన్నికలప్పుడు ఒక మాట, అధికారంలోకి వచ్చాక ఒక మాటగా చెప్పడం కాంగ్రెస్ పార్టీకి అల వాటుగా మారిందని ఎక్స్‌వేదికగా మండిపడ్డారు. డిసెంబర్ 12, 2018 కంటే ముందున్న రుణాలకు రైతు రుణ మాఫీ వర్తించదనే నిబంధన అసమంజ సమని పేర్కొన్నారు. రైతులకు రుణ భారం తగ్గించే ప్రయత్నం కన్నా ప్రభుత్వ భారం తగ్గించుకునే ప్రయ త్నమే కనిపిస్తున్నదని విమర్శించారు. ఆహార భద్రతకార్డు, పీఎం కిసాన్ పథకం ప్రామాణికం అని ప్రకటించడం అంటే లక్షలాది రైతుల ఆశలపై నీళ్ల చల్లడమేనని ఆగ్రహం వ్యక్తంచేశారు.

కుటుంబాన్ని నిర్ధారించడానికే తెల్లరేషన్ కార్డు

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): రుణ మాఫీ పథకంలో తెల్ల రేషన్‌కార్డు అనే ది కేవలం కుటుం బాన్ని నిర్ధారించడానికి ప్రామాణికమే నని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టంచేశారు. ప్రభుత్వం దగ్గర అంద రి వివరాలు ఉన్నాయని, కుటుంబ నిర్ధారణ కాగానే రుణమాఫీని మిగతా వారికీ వర్తింపచేస్తామని తెలిపారు. 2018లో అవలంబించిన విధానాలే 2024లో అమలు చేస్తున్నామని చెప్పా రు. రుణమాఫీ కింద రూ.20 వేల కోట్లు ప్రకటించి రూ.13 వేల కోట్లు విడుదల చేశారు. ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన మొదటి ఆరు నెలల్లోనే, ఏక కాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తుంటే హర్షించాల్సింది పోయి విమ ర్శించడం సరికాదని పేర్కొన్నారు.

> మొదటివిడత తరువాయి...

డిసెంబర్ 9 వరకు ఉన్న స్వల్పకాలిక పంట రుణాలను మాత్రమే మాఫీ చేయనున్నట్టు స్పష్టం చేసింది. బ్యాంకుల నుంచి రైతుల, రుణాల వివరాలను ప్రత్యేక పోర్టల్ ద్వారా సేకరించనున్నారు. ఇందుకోసం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక పోర్టల్‌ను ప్రారం భించి దీని ద్వారా రుణమాఫీ చేస్తారు. ప్రతి బ్యాంకు నుంచి ఒక నోడల్ అధికారిని నియ మిస్తారు. ఈ అధికారి అటు వ్యవసాయ శాఖ, ఇటు ఎన్ఐసీ(పోర్టల్)కి అవసరమైన సమా చారం అందిస్తారు. రుణమాఫీలో రైతులకు ఎదురయ్యే సమస్యలు, ఇబ్బందులు, సందే హాలను తీర్చేందుకు పోర్టల్ ద్వారా, మండల స్థాయిలో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయా లని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి ఫిర్యా దును 30 రోజుల్లోపు పరిష్కరించాలని అధి కారులను ఆదేశించింది.



మార్గదర్శకాల్లోని ముఖ్యాంశాలు

- భూమి కలిగిన ప్రతి రైతు కుటుంబానికి రూ.2 లక్షల వరకు గల స్వల్పకాలిక పంట రుణాలను మాఫీ వర్తిస్తుంది.
- 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 మధ్య రుణాలు తీసుకున్న, రెన్యువల్ చేసిన రైతులకు మాత్రమే రుణమాఫీ.
- కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకొని రూ.2 లక్షలు (అసలు, వడ్డీ కలిపి) రుణమాఫీ.
- తెల్ల రేషన్‌కార్డు ఆధారంగా కుటుంబాన్ని నిర్ధారిస్తారు. అందరి ఆధార్ నంబర్లను లింకు చేసి కుటుంబాన్ని గుర్తిస్తారు.
- రుణమాఫీ డబ్బులు నేరుగా రైతు బ్యాంకు ఖాతాలో జమవుతాయి.
- అందరికీ ఒకేసారి రుణమాఫీ చేయరు. తక్కువ రుణం తీసుకున్న వారికి ముందుగా మాఫీ చేసి ఆ తర్వాత క్రమంగా ఎక్కువ మొత్తం తీసుకున్న వారికి మాఫీ చేస్తారు.
- ఒక కుటుంబానికి 2లక్షలకుపైగా రుణం ఉంటే..ఎక్కువ ఉన్న రుణాన్ని మొదట రైతులు బ్యాంకుకు చెల్లించాకే రుణమాఫీ వర్తిస్తుంది.
- ఒక కుటుంబంలో రూ.2 లక్షల కన్నా ఎక్కువ రుణం ఉంటే మొదటగా కుటుంబంలోని మహిళ పేరుపై ఉన్న రుణాన్ని మాఫీ చేస్తారు. ఆ తర్వాత అర్హత ఉంటే పురుషుల పేరుపై రుణాన్ని మాఫీ చేస్తారు.
- ఒకవేళ అనర్హులైన రైతులకు రుణమాఫీ జరిగితే ఆ మొత్తాన్ని రైతుల నుంచి తిరిగి రికవరీ చేయనున్నారు.

వీరికి రుణమాఫీ వర్తించదు

- రుణమాఫీకి కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పీఎం కిసాన్ నిబంధనలను వీలైనంత వరకు అమలు చేయనున్నారు. దీంతో ప్రస్తుతం పీఎం కిసాన్ అందుకోలేనివారికి రుణమాఫీ వర్తించే అవకాశం లేదు.
- ఎస్‌హెచ్‌జీలు, జేఎల్‌జీలు, ఆర్ఎంజీలు, ఎల్ఈసీఎస్‌లకు తీసుకున్న రుణాలకు రుణమాఫీ వర్తించదు.
- రీషెడ్యూల్ చేసిన రుణాలకు కూడా రుణమాఫీ వర్తించదు.
- కంపెనీలు, ఫర్మ్స్ వంటి సంస్థలకు ఇచ్చిన పంట రుణాలకు వర్తించదు. అయితే ప్రాథమిక సహకార సంఘాల ద్వారా తీసుకున్న రుణాలకు మాత్రం వర్తిస్తుంది.

రుణాలను మాఫీ వర్తిస్తుంది.

సందేహాలెన్నో.. స్పష్టతే లేదు!

- రుణమాఫీ మార్గదర్శకాలతో గందరగోళం

హైదరాబాద్, జూలై 15(నమస్తే తెలంగాణ): రైతు రుణమాఫీకి ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలు అనేక సందేహాలు లేవ నెత్తున్నాయి. కానీ, వాటికి జవాబులే దొర కడం లేదు. దీంతో రుణమాఫీ మార్గదర్శకాలు రైతుల్లో అనేక భయాలు, గందరగోళం సృష్టి స్తున్నాయి.

రేషన్‌కార్డు లేని వారి పరిస్థితి ఏమిటి?

రేషన్‌కార్డు ఆధారంగా కుటుంబాన్ని లింకు చేసి రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటిం చింది. ప్రభుత్వ నిర్ణయంతో రేషన్‌కార్డుల్లో పేరు ఉన్నవారికి కొంత నష్టం జరిగినా, ఎంతో కొంత అప్పు తీరుతుంది. అయితే, రేషన్‌కార్డు లేని వారి పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది. కొందరు రైతులు పంట రుణం తీసుకున్నారు. కానీ, వారికి రేష న్‌కార్డు లేదు. ఇప్పుడు వారిని ఏ విధంగా గుర్తిస్తారు? వారికి రుణమాఫీ చేస్తారా? లేదా? అనే ప్రశ్నకు జవాబు లేదు.

గోల్డ్‌లోన్ రుణమాఫీ లేనట్టే

రైతులు పంట సాగు కోసం బ్యాంకుల్లో పాస్‌బుక్‌తోపాటు బంగారాన్ని తాకట్టు పెట్టి పంట రుణం తీసుకుంటారు. దీనిని కూడా బ్యాంకులు పంట రుణం కిందనే భావిస్తాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ తరహా రుణా లను కూడా మాఫీ చేసింది.కాంగ్రెస్ ప్రభు త్వం పాస్‌పుస్తకాలతోపాటు బంగారాన్ని తాక ట్టు పెట్టి తీసుకున్న పంట రుణాలను మాఫీ చేయడం లేదు. బంగారంపై తీసుకున్న రుణాల మాఫీపై నిబంధనల్లో ఎక్కడా పేర్కొ నలేదు. ఈ విధంగా ఆ రైతులకు రుణమా ఫీలో ప్రభుత్వం మొండి చెయ్యి చూపినట్టే.

ఎక్కువ రుణం చెల్లించిన తర్వాతే రుణమాఫీ

ఒక కుటుంబానికి రూ.2 లక్షల కన్నా ఎక్కువ రుణం ఉంటే.. ఎక్కువ ఉన్న మొత్తాన్ని రైతులు ముందుగా చెల్లించాలని షరతు పెట్టింది. రైతులు ఆ డబ్బులు చెల్లించిన తర్వాత రూ.2 లక్షలు మాఫీ చేస్తామని స్పష్టంచేసింది. ఈ నిబంధన రైతులపై భారాన్ని మోపడమేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒక రైతు రూ.3 లక్షల రుణం తీసుకున్నట్టయితే, ఆ రైతు రుణమాఫీకి ముందే రూ.లక్ష చెల్లించాల్సి ఉంటుంది. అంత మొత్తం చెల్లించడం రైతుకు ఇబ్బందే. అసలు, వడ్డీ కలిపి రూ.2 లక్షలకు మించినా ఇదే నిబంధన వర్తిస్తుందా? అనే సందేహాలున్నాయి. నిర్దిష్ట రుణం ఎక్కువ మొత్తాన్ని రైతులు చెల్లించారో లేదో తెలుసుకునేందుకు మరో జాబితా తెప్పిం చుకోవాలి. ఇది రుణమాఫీని ఆలస్యం చేసే అవకాశం ఉన్నది. ప్రభుత్వం చేసే మాఫీకి, అదనపు మొత్తం చెల్లింపులకు లింకు పెట్టడంపై విమర్శలొస్తున్నాయి.

ఆరోహణ క్రమం అంటే.. ?

ఆరోహణ క్రమంలో రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం పేర్కొన్నది. అంటే తక్కువ నుంచి ఎక్కువకు రుణమాఫీ చేస్తుంది. అయితే దీనిపై నిబంధనల్లో స్పష్టత ఇవ్వలేదు. తొలుత ఎంత మొత్తం నుంచి రుణమాఫీ మొదలు పెడుతుంది? ఎప్పటి నుంచి మొదలుపెడు తుంది? ఎప్పటి వరకు పూర్తి చేస్తుంది? అనే అంశాలపై స్పష్టత ఇవ్వలేదు. ఆరోహణ క్రమంలో అంటే ఎంతెంత మొత్తం ఎప్పుడు చేస్తారో స్పష్టత లేదు.

రుణమాఫీకి ఇన్ని నిబంధనలు ఎందుకు?

బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి



హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): ఎలాంటి ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేస్తామని చెప్పి, ఇప్పుడు ఇన్ని నిబంధనలు ఎందుకు విధిస్తున్నారని బీజేపీ ఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సోమ వారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాల యంలో మీడియాతో మాట్లాడారు. రేషన్‌కార్డు నిబంధన పెట్టి చాలా మందికి రుణమాఫీ ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రీ షెడ్యూల్ అయిన రుణాలకు మాత్రమే రుణ మాఫీ ఇస్తామనడం దుర్మార్గమ న్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే నిబంధనలు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు గ్రామపంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థలకు నిధులు విడుదల చేయాలంటూ లేఖ రాశారు.

రుణమాఫీపై చిత్తశుద్ధి లేని ప్రభుత్వం



- 2 లక్షల రుణమాఫీ పొందే రైతులెందరు?
- రేషన్‌కార్డులులేని రైతుల పరిస్థితి ఏమిటి?
- మార్గదర్శకాల పేరుతో రైతులను మభ్యపెట్టే ప్రయత్నాలు
- తెల్లకార్డుపై నాలుక మడతేసిన సీఎం రేవంత్‌రెడ్డి
- కేసీఆర్ చేసిన రుణమాఫీ 29,144.61 కోట్లు
- కాంగ్రెస్ సర్కార్ చేసే మాఫీ ఎంత?
- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి నిలదీత

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): రూ.2 లక్షల రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, మార్గదర్శకాల పేరుతో రైతులను మభ్య పెట్టే ప్రయత్నాలు చేస్తున్నదని వ్యవ సాయ శాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. రుణమాఫీకి తెల్ల రేషన్‌కార్డు ప్రామా ణికం కాదని ఇటీవల పేర్కొన్న సీఎం రేవంత్‌రెడ్డి నాలుగు రోజులు తిరగకుం డానే నాలుక మడతేశారని విమర్శిం చారు. రేషన్‌కార్డులేని రైతుల పరిస్థితి ఏమిటని నిలదీశారు. ప్రభుత్వ మార్గద ర్శకాలు కొందరు తప్ప ఎవరూ పట్టిన పంచంగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. మార్గదర్శకాలు అధికారులు, రైతుల మధ్య చిచ్చుపెట్టేలా ఉన్నాయని, అధికా రులపై రాజకీయ ఒత్తిళ్లు పెరిగేలా ఉన్నా యని దుయ్యబట్టారు. రుణమాఫీపై రైతుల నుంచి ఫిర్యాదులను కోరడం వెనుక రైతుల మధ్య వివాదాలను సృష్టించే ఎత్తుగడ ఉన్నదని ఆరోపిం చారు. రుణమాఫీ ఆకాంక్ష అధికారం దక్కించుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం హామీల నుంచి తప్పించుకునేందుకు సాకులు వెతుకుతున్నదని మండిపడ్డారు. సర్కారు దగ్గర కిసాన్ డాటా ఉంటే రుణ మాఫీ అమలుకు వ్యవసాయ శాఖ అధి కారులను బాధ్యులను చేయడం ఎందుకు? రైతుల నుంచి ఫిర్యాదులు ఆహ్వానించడం ఎందుకు? అని ప్రశ్నిం చారు. 'డిసెంబర్ 9నే రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తాం. పూచీ నాది. రుణాలు తెచ్చుకోనివారు వరుసగట్టి తెచ్చుకోండి' అని ప్రగల్భాలు పలికిన రేవంత్‌రెడ్డి మార్గదర్శకాల పేరుతో రైతులకు ఇప్పుడు చావుకబురు చల్లగా చెప్పారని మండిప డ్డారు. కాంగ్రెస్ సర్కారు చేసిన మోసా నికి రైతులు తప్పకుండా గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. కేసీఆర్ ప్రభుత్వం అసలు రుణమాఫీయే చేయలే దని కాంగ్రెస్ పార్టీ దుష్ప్రచారం చేసిం దని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు రుణమాఫీ అమలు చేశామనే పేరు కోసం, ప్రచారం కోసం తప్ప రైతుల మేలుకోరేవి కావని స్పష్టంచేశారు. రాష్ట్రంలో రూ.2 లక్షల రుణం పొందిన రైతులు ఎంతమంది ఉన్నారో వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. పీఎం కిసాన్ డాటాను అనుసరించడం అంటే రుణ మాఫీ లక్ష్యానికి గండికొట్టడం, రైతాం గాన్ని వంచించడమేనని మండిపడ్డారు.

కేసీఆర్ చేసిన రుణమాఫీ 29,144 కోట్లు

రాష్ట్రంలో వ్యవసాయం, రైతాంగం బాగుండాలి తద్వారా ఉపాధి అవకా శాలు లభించాలనే ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమ లుచేసిందని నిరంజన్‌రెడ్డి గుర్తుచేశారు. వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన ఉచిత కరెంటు, సాగునీళ్లు, రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ పథకాలను అమ లుచేశామని వివరించారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో రైతులు, వ్యవసా యమే ఇరుసుగా పనిచేసిందని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో పడిన రైతుల రుణభా రాన్ని తొలగించడం ద్వారానే రైతులు కుదుటపడతారని, వ్యవసాయం సుస్థిరం అవుతుందని భావించి కేసీఆర్ రెండు విడతలుగా రుణమాఫీ చేశారని చెప్పారు. మొదటి విడతలో 35.31 లక్షల మంది రైతులకు రూ.16,144.10 కోట్లు, రెండో విడతలో 22,98,039 రైతులకు చెందిన రూ.13,000.51 కోట్లు రుణమాఫీ చేశామని వివరించారు. ఎన్నికల కోడ్ వచ్చే వరకు కేసీఆర్ ప్రభు త్వంలో రూ.6,440 కోట్లు మిగిలిపో యిందని చెప్పారు. రెండు విడతల్లో బీఆ ర్ఎస్ ప్రభుత్వం రూ.29,144.61 కోట్లు రుణమాఫీ చేసిందని తెలిపారు. రైతు కుటుంబాలను గుర్తించేందుకే రేషన్ కార్డును పరిశీలించామని, కాంగ్రెస్ సర్కారు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం 10 ఎకరాలుండి గులాబీ కార్డు ఉన్న రైతులందరికీ వర్తించదా? అని ప్రశ్నించారు.

రుణమాఫీ సగం మందికే!

- ప్రభుత్వ కొర్రీలతో దూరంకానున్న లబ్ధిదారులు

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): 'మీరు పంట రుణాలు రెన్యువల్ చేసుకోండి. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే అందరి రుణాలను మాఫీ చేస్తాం.' 'ఆగస్టు 15లోగా రైతులందరినీ రుణ విముక్తులను చేస్తాం.'.. ఇవీ ఎన్నికలకు ముందు, ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, కాంగ్రెస్ నేతలు పదేపదే చేసిన వ్యాఖ్యలు. కానీ, సోమవారం విడు దల చేసిన రుణమాఫీ మార్గదర్శకాల ప్రకారం అవన్నీ గాలిమాటలేనని, రుణ మాఫీ సగం మందికి కూడా అందడం కష్ట మేనని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. గణాంకాలతో సహా వివరిస్తున్నారు.

ప్రస్తుతం రాష్ట్రంలో 69 లక్షల మంది రైతులు ఉన్నారు. ఇందులో సుమారు 55 లక్షల మంది పంట రుణాలు తీసుకున్నట్టు వ్యవసాయ శాఖ వర్గాల అంచనా. రుణ మాఫీకి పీఎం కిసాన్ యోజన మార్గదర్శ కాలను అమలుచేస్తామని ప్రభుత్వం చెప్తు న్నది. ప్రస్తుతం రాష్ట్రంలో పీఎం కిసాన్ యోజన లబ్ధిదారులు 33 లక్షల మంది ఉన్నారు. ఈ డాటాను చివరగా 2019లో అప్‌డేట్ చేశారు. అప్పటినుంచి ఈ పథకా నికి అర్హులైన వారి సంఖ్య ఐదేండ్లలో మరో ఐదు లక్షల వరకు పెరిగి ఉంటుం దని అంచనా. ఈ లెక్కన పీఎం కిసాన్ నిబంధనలకు అనుగుణంగా 38 లక్షల మంది వరకు ఉంటారని భావిస్తున్నారు. కుటుంబాన్ని నిర్ధారించేందుకు రేషన్‌కా ర్డును ప్రామాణికంగా తీసుకుంటామని ప్రభుత్వం చెప్తున్నది. ఈ లెక్కన 38 లక్షల మందిలోనూ రేషన్‌కార్డు లేనివారికి రుణ మాఫీ దక్కదు. కొత్త రేషన్‌కార్డులు రాకపో వడం వల్ల ఇప్పటికే లక్షల కుటుంబాలు ఒకే కార్డులో ఉన్నాయి. ఇలా దాదాపు 10 లక్షల మంది వరకు రుణమాఫీకి దూరం అవుతారని వ్యవసాయ శాఖ వర్గాలు చెప్తు న్నాయి. అంటే సుమారు 28 లక్షల మందికి మాత్రమే రుణమాఫీ దక్కనున్న దని వ్యవసాయ, ఆర్థిక శాఖల నిపుణులు పేర్కొంటున్నారు. రుణం తీసుకున్న 55 లక్షల మందిలో సగం మందికి మాత్రమే రుణమాఫీ అందే అవకాశం ఉన్నదని స్పష్టం చేస్తున్నారు. 'సాధారణంగా ప్రభు త్వాలు ఒక సంక్షేమ పథకాన్ని అమలు చేసేటప్పుడు వీలైనంత ఎక్కువ మందికి ప్రయోజనం కలిగేలా అర్హతలు నిర్ణయి స్తుంటాయి. కానీ, రుణమాఫీ మార్గదర్శ కాల్లో వీలైనంత ఎక్కువ మందిని అనర్హు లను చేసేందుకే నిబంధనలు పెట్టినట్టు న్నది' అని ఒక బ్యాంకర్ పేర్కొన్నారు.

కఠినంగా పీఎం కిసాన్ నిబంధనలు

- అనర్హులుగా రిటైర్డ్, ప్రస్తుత ప్రభుత్వ ఉద్యోగులు

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వం రైతులకు పెట్టు బడి సాయం అందించే ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ యోజన పథకం నిబంధ నలు అత్యంత కఠినంగా ఉన్నాయి. ఈ నిబంధనల కారణంగా చాలామంది ఈ పథకానికి అనర్హులవుతున్నారు. 2019 ఫిబ్రవరి 1వ తేదీ నాటికి అర్హత పొందినవారికి మాత్రమే ప్రస్తుతం ఈ పథకాన్ని అమలుచే స్తున్నారు. మళ్లీ నాటి నుంచి ఐదేండ్ల వరకు నిబంధనలు మార్చేందుకు అవకాశం లేదు. ఇలాంటి కఠిన నిబంధనలను ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీకి అమలు చేయాలని నిర్ణయిం చింది. రుణమాఫీ అమలుకు ఈ నిబంధ నలను వీలైనంత మేరకు వర్తింపచేయా లని నిర్ణయించింది. దీంతో రుణమాఫీకి లక్షల మంది అనర్హులయ్యే ప్రమాదం ఏర్పడింది. రిటైర్డ్, ప్రస్తుత ప్రభుత్వ ఉద్యో గులు ఈ నిబంధనల వల్ల అత్యధికంగా నష్టపోయే అవకాశం ఉన్నది.



పీఎం కిసాన్‌కు అనర్హులు

- రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నవారికి ఈ పథకం వర్తించదు. ప్రస్తుతం పదవుల్లో ఉన్నవారితోపాటు మాజీలకు ఈ పథకం వర్తించదు. మాజీ, ప్రస్తుత మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మేయర్లు, జెడ్పీ ఛైర్మన్లు ఈ పథకానికి అనర్హులు. రిటైర్డ్, ప్రభుత్వ ఉద్యోగులకు కూడా పీఎం కిసాన్ వర్తించదు.
- అనర్హుల జాబితాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే వారు, ప్రభుత్వ ఆధీనంలోని స్వతంత్ర సంస్థల్లో పని చేసే వారు, స్థానిక సంస్థల్లోని ఉద్యోగులు ఉన్నారు.
- ఉద్యోగాల్లో రిటైర్ అయి ప్రతి నెల రూ.10 వేల కన్నా ఎక్కువగా పెన్షన్ తీసుకునేవారూ పథకానికి అనర్హులే.
- ఆదాయపు పన్ను(ఐటీ) చెల్లించేవారు కూడా ఈ పథకానికి అనర్హులు.
- డాక్టర్లు, ఇంజినీర్లు, లాయర్లు, చార్టర్డ్ అకౌంటెంట్లు, ఆర్కిటెక్ట్‌లకు పీఎం కిసాన్ వర్తించదు.
- ఎన్ఆర్ఐ కుటుంబాలకు వర్తించదు.

లేని రేషన్‌కార్డులతో రుణమాఫీకి లింకా?

- కొన్నేండ్లుగా కొత్త రేషన్‌కార్డుల మంజూరు లేదు
- కార్డుల్లో కుటుంబీకుల చేర్పులు, తొలగింపూ లేదు
- రేషన్‌కార్డుల కోసం లక్షల మంది ఎదురుచూపులు
- కొత్తవి ఇవ్వకుండానే రుణమాఫీకి రేషన్‌కార్డు లింకు
- ప్రభుత్వ తీరుతో అనర్హులుగా లక్షల కుటుంబాలు



హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): ఒక కుటుంబంలో ఇద్దరు కొడుకున్నారు. వారికి వివాహమై వేరుగా ఉంటున్నారు. తల్లిదండ్రులు, కొడుకులు ఎవరికి వారు వేర్వేరుగా వ్యవసాయం చేసుకుంటున్నారు. ఎవరి పట్టాదార్ పాస్‌బుక్‌పై వారు తలా రూ.1.5 లక్షల రుణం తీసుకున్నారు. అయితే కొత్త రేషన్‌కార్డులు ఇవ్వకపోవడం, మార్పులకు అవకాశం లేకపోవడంతో ఒకే రేషన్ కార్డులో తల్లిదండ్రులు, ఇద్దరు కొడుకుల పేర్లు ఉన్నాయి. ఇప్పుడు రేషన్‌కార్డును ప్రామాణి కంగా తీసుకుంటే, వారందరికీ కలిపి రూ.2 లక్షల రుణం మాత్రమే మాఫీ అవుతుంది. ఒకవేళ కొత్త రేషన్‌కార్డులు ఇచ్చి ఉంటే, ఆ కుటుంబానికి రూ.4.5 లక్షలు మాఫీ అయ్యేది. అందరూ రుణ విముక్తులయ్యేవారు. కానీ, ప్రభుత్వం కొత్త కార్డులు ఇవ్వకుండా రుణమాఫీ చేయడంతో ఆ కుటుంబం రూ.2.5 లక్షలు నష్టపోవాల్సి వస్తు న్నది. అప్పుల ఊబి నుంచి బయటపడే పరిస్థితి కనిపించడం లేదు. కొన్నేండ్లుగా రాష్ట్రంలో కొత్త రేషన్‌కార్డులను మంజూరు చేయలేదు. కార్డుల్లో మార్పులు, చేర్పులకు అవకాశం ఇవ్వలేదు. దీంతో సుమారు 10-12 లక్షల మంది కొత్త రేష న్‌కార్డులు, మార్పుల కోసం ఎదురు చూస్తు న్నారు. రేషన్‌కార్డులకు సంబంధించి రాష్ట్రంలో పరిస్థితి ఈ విధంగా ఉంటే ప్రభుత్వం మాత్రం రుణమాఫీకి రేషన్‌కార్డులను ప్రామాణికంగా తీసుకోవాలని నిర్ణయించింది. ఈ నిర్ణయంతో లక్షల మంది అర్హులు కూడా రుణమాఫీకి అనర్హు లుగా మిగిలిపోయే ప్రమాదం ఏర్పడింది. కుటుంబం యూనిట్‌గా రుణమాఫీ చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం.. రేషన్‌కార్డు ఆధారంగా కుటుంబసభ్యులను గుర్తించాలని నిర్ణయిం చింది. ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో ప్రస్తుతం 90 లక్షల తెల్ల రేషన్‌కార్డులు ఉండగా ఇందులో 2.81 కోట్ల మంది లబ్ధిదారులు ఉన్నారు. అయితే కొన్నేండ్లుగా రాష్ట్రంలో కొత్త రేషన్‌కా ర్డుల జారీ ప్రక్రియ నిలిచిపోయింది. అదేవి ధంగా కుటుంబ సభ్యులను చేర్చడం, తొలగించే అవకాశం కూడా లేకుండా పోయింది. దీంతో కొత్తగా పెండ్లి అయినవారు, కుటుంబం నుంచి వేరుపడినవారు కొత్త కార్డులు, మార్పుల కోసం ఎదురుచూస్తున్నారు. వీరికి గతంలో అవకాశం లేకపోవడం, ఇప్పుడు కూడా అవకాశం రాకపో వడంతో అర్హులైనప్పటికీ రేషన్‌కార్డు దక్కలేదు. ఈ నేపథ్యంలో ఇప్పుడు ప్రభుత్వం రుణమాఫీకి రేషన్‌కార్డు లింకు చేయడంతో వారంతా అందో ళన వ్యక్తంచేస్తున్నారు. కొత్త రేషన్‌కార్డు లేకపోవ డంతో అర్హత ఉన్నప్పటికీ రుణమాఫీ పొందలేక పోతున్నారు. వాస్తవానికి కాంగ్రెస్ ప్రభుత్వం దాదాపు అన్ని పథకాలకు రేషన్‌కార్డును ప్రామా ణికంగా తీసుకొని అమలు చేస్తున్నది. దీనిపై గతంలోనే విమర్శలొచ్చాయి. కొత్త రేషన్‌కా ర్డులు ఇవ్వకుండా పథకాలకు రేషన్‌కార్డును లింకు చేయడంపై అభ్యంతరాలు వ్యక్తమ య్యాయి. దీంతో ప్రభుత్వం త్వరలోనే కొత్త కార్డులు జారీ చేస్తామని ప్రకటించింది. కానీ, అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా కొత్త కార్డుల జారీకి చర్యలు తీసుకోలేదు. ఇప్పుడు కూడా కొత్త కార్డులు జారీ చేయకుండా రుణమాఫీ ప్రక్రియ ప్రారంభించి రేషన్‌కార్డును లింకు పెట్టింది. ఈ నేపథ్యంలో కొత్త కార్డులు ఇవ్వకుండా రుణమా ఫీకి రేషన్‌కార్డును ఏవిధంగా లింకు చేస్తారనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

'ఆంక్షల' రుణమాఫీ!

- ఎన్నికలప్పుడు కోతలపై మాట్లాడని కాంగ్రెస్
- అధికారంలోకి వచ్చాక ఎడాపెడ కోతలు
- ఆర్థికభారం తగ్గించుకునేందుకు కఠిన నిబంధనలు
- పీఎం కిసాన్, రేషన్‌కార్డు లింకుతో రైతులకు తీవ్ర నష్టం

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): ఎన్నికలకు ముందు రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామంటూ ఊదర గొట్టిన కాంగ్రెస్ పార్టీ తీరా అధికారంలోకి వచ్చాక కొందరికే పరిమితం చేస్తున్నది. అప్పుడు ఎలాంటి ఆంక్షలు పెట్టబోమని చెప్పి.. ఇప్పుడు ఎడాపెడ కోతలు పెడుతు న్నది. సోమవారం ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలే ఇందుకు నిదర్శనం. రుణమాఫీకి కుటుంబాన్ని గుర్తించేందుకు రేషన్‌కార్డును లింకు చేయడం, పీఎం కిసాన్ నిబంధనలను అమలు చేస్తామని పేర్కొ నడం కాంగ్రెస్ ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమనే విమర్శలొస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ తమను తీవ్రంగా మోసం చేసిందనే ఆగ్రహం రైతుల్లో వ్యక్తమవుతున్నది. రుణ మాఫీలో పేర్కొన్న పలు నిబంధనలు రైతు లను ఇబ్బంది పెట్టేలా ఉండటమే ఇందుకు కారణం. నిజానికి రుణమాఫీలో ఆంక్షలు పెట్టాలని ప్రభుత్వం ఎప్పుడో నిర్ణయిం చింది. పీఎం కిసాన్ నిబంధనలు అమలు చేస్తారంటూ నెల రోజుల క్రితమే తమ అను కూల మీడియాకు లీకులు అందించారు. ఇప్పుడు ఆ ప్రకారమే ఆంక్షలు పెట్టి రుణ మాఫీ అమలు చేస్తున్నది. తద్వారా మము అనిపించి ప్రభుత్వంపై భారం పడకుండా, ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేశా మంటూ ప్రచారం చేసుకునేందుకు ప్రయత్ని స్తున్నదనే విమర్శలొస్తున్నాయి.

కోతలు పెట్టి.. ఆర్థిక భారం తప్పించుకునేలా..

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ ప్రకారం రూ.2 లక్షల రుణమాఫీకి దాదాపు రూ.40 వేల కోట్ల వరకు నిధులు అవసరమవుతా యనే అంచనాలున్నాయి. అది కూడా ఆగస్టు 15లోపు ఒకే విడతలో మాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ నేప థ్యంలో తక్కువ సమయంలో అంత భారీ మొత్తం నిధులు సమకూరడం అసాధ్యంగా మారింది. దీంతో ప్రభుత్వం కోతలపై దృష్టి పెట్టిందనే విమర్శలొస్తున్నాయి. ఆర్థిక భారాన్ని తప్పించుకునేందుకు ఎక్కడ కోతలు పెట్టాలనేదానిపై కసరత్తు చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల మాట్లాడుతూ.. రుణమాఫీకి రూ.31వేల కోట్లు అవసరం అవుతాయని చెప్పారు. ఆ నిధులు కూడా సమకూర్చే సత్తా లేకపోవడంతో మరింత మందికి కోతపెడుతున్నారని, రేషన్‌కార్డు లింకు, పీఎం కిసాన్ నిబంధనలను అమలు చేస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. ఈ రెండు నిబంధనలతో రుణమాఫీ అర్హుల సంఖ్య సగానికి సగం తగ్గిపోతుంది. అప్పుడు ప్రభు త్వంపై ఆర్థిక భారం కూడా సగానికి సగం తగ్గిపోతుంది.

ఉద్యోగులకు రుణమాఫీ లేనట్టే

- రేషన్‌కార్డు, పీఎం కిసాన్ నిబంధనల అమలే కారణం
- సుమారు 7 లక్షల కుటుంబాలకు నష్టం

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ ఉద్యోగులకు రూ.2 లక్షల పంట రుణమాఫీ వర్తించే అవకాశం కనిపించడం లేదు. ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా మార్గద ర్శకాల్లో పేర్కొన్న రెండు నిబంధనలు ఉద్యోగులకు మొండి చెయ్యి చూపించను న్నాయి. రుణమాఫీలో కుటుంబాన్ని గుర్తించేందుకు రేషన్‌కార్డును ప్రామాణి కంగా తీసుకోవడం, పీఎం కిసాన్ నిబం ధనలను వీలైనంత మేరకు అమలుచేయా లని నిర్ణయించడంతో ఉద్యోగులకు రుణ మాఫీ దక్కదనే అభిప్రాయాలు వ్యక్తమవు తున్నాయి. రాష్ట్రంలో సుమారు 7 లక్షల ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలు రుణ మాఫీకి దూరమయ్యే అవకాశం ఉన్నది. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 4 లక్షల మంది వర్కింగ్ ఉద్యోగులుండగా మరో 3 లక్షల మంది పదవీ విరమణ పొంది పెన్షన్ పొందుతున్నవారు ఉన్నారు. ప్రభు త్వ ఉద్యోగులకు ఎలాగూ రేషన్‌కార్డు ఉండదు. రుణమాఫీ కోసం కుటుంబం లోని వ్యక్తులను లింకు చేయడానికి రేషన్ కార్డును ప్రభుత్వం ప్రామాణికంగా తీసు కున్నది. కాబట్టి ప్రభుత్వ ఉద్యోగులకు రేషన్‌కార్డు లేకపోవడంతో వాళ్లు దీని పరి ధిలోకి రారు. పీఎం కిసాన్ నిబంధనల ప్రకారం ఆ పథకానికి ప్రభుత్వ ఉద్యోగు లు అనర్హులు. వీరితోపాటు రూ.10 వేల కన్నా ఎక్కువ పెన్షన్ తీసుకుంటున్న రిటైర్డ్ ఉద్యో గులు కూడా అనర్హులే. దీంతో రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు రుణమా ఫీకి దూరమయ్యే అవకాశం ఏర్పడింది. ఈ నేపథ్యంలో రుణమాఫీ గైడ్‌లైన్స్‌పై ప్రభుత్వ, రిటైర్డ్ ఉద్యోగుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ఎన్నికల ప్పుడు ఎలాంటి నిబంధనలు లేకుండా అమలు చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు రేషన్‌కార్డు, పీఎం కిసాన్ అంటూ కొర్రీలు పెడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు మొండి చెయ్యి చూపడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తు న్నారు. ప్రభుత్వ ఉద్యోగుల్లోనూ వ్యవ సాయం చేసేవారు ఉన్నారని, పంట పెట్టు బడి కోసమే రుణం తీసుకున్నారని అంటు న్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం పరిగ ణనలోకి తీసుకోవాలని కోరుతున్నారు.

ఉద్యోగులకూ రుణమాఫీ చేయాలి: సీపీఎస్ ఉద్యోగుల సంఘం

ఉద్యోగులు, ఉపాధ్యాయులకు కూడా రుణమాఫీని వర్తింపచేయాలని తెలంగాణ సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్య క్షుడు మ్యాన పవన్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. పాలనలో ప్రభుత్వానికి ఎంత గానో సహకరిస్తున్న ఉద్యోగులను ఆహార భద్రతకార్డు, పీఎం కిసాన్ నిబంధనలతో రుణమాఫీకి దూరం చేయడం బాధాకర మని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు కూడా వ్యవసాయం కోసం రుణాలు తీసు కున్నారని, ఇచ్చిన హామీ మేరకు అందరికీ రుణమాఫీ చేయాలని విజ్ఞప్తి చేశారు.



అవి రైతు వ్యతిరేక మార్గదర్శకాలు

- రీషెడ్యూల్ రుణాలనూ మాఫీ చేయాలి
- మార్గదర్శకాలు రద్దు చేయాలి
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలు రుణమాఫీని ఎగ్గొట్టేలా, రైతులను మోసం చేసేలా ఉన్నాయని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విమ ర్శించారు. రుణమాఫీకి రేషన్‌కా ర్డును, కుటుంబాన్ని ప్రాతిపదికగా తీసుకోవడం సరికాదని ఓ ప్రకట నలో పేర్కొన్నారు. రేషన్‌కార్డు లేకుండా వ్యవసాయ రుణం పొంది నవారు అర్హులు కారా? అని ప్రశ్నిం చారు. రెండు బ్యాంకుల్లో రుణం తీసుకుని, ఒక బ్యాంకులో రూ. 2 లక్షల కంటే ఎక్కువ రుణం ఉంటే మిగిలిన మొత్తాన్ని చెల్లిస్తేనే రుణ మాఫీ అనడం దారుణమని మండి పడ్డారు. ఇప్పటికిప్పుడు రైతుల మెడపై కత్తిపెట్టి చెల్లించమంటే ఎలా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహి ళల పేరున ఉన్న రుణాలకే ప్రాధాన్యం ఇస్తామనడం చూస్తుంటే ఇది రాజకీయ ప్రకటన అనిపిస్తున్న దని పేర్కొన్నారు. ప్రభుత్వ మార్గద ర్శకాలను బట్టి 40 శాతం మంది రైతులకే రుణమాఫీ వర్తిస్తుందని, మిగతా 60 శాతం మంది రైతులు మోసపోయినట్టేనని ఆవేదన వ్యక్తం చేశారు. రీషెడ్యూల్ అయిన రుణా లకు రుణమాఫీ వర్తించదని చెప్పడం కూడా మోసమేనని పేర్కొ న్నారు. రైతు ఏ బ్యాంకులో రుణం తీసుకున్నా రూ. 2 లక్షలు మాఫీ చేయాల్సిందేనని, లేదంటే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గ్రామాల్లో తిరగలేరని, మంత్రులు జిల్లాలకు రాలేరని హెచ్చరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రెండుసార్లు ఎలాంటి షర తులు లేకుండా రుణాలు మాఫీ చేసిందని గుర్తు చేశారు. రైతులు రోడ్లపైకి రావడానికి ముందే మార్గద ర్శకాలను రద్దు చేయాలని సుదర్శన్ రెడ్డి డిమాండ్ చేశారు.

మధుమేహానికి బైబై!

డ్రగ్ థెరపీతో డయాబెటిస్ మటుమాయం

- బీటా కణాలను 700% ఉత్తేజితం చేసే థెరపీ
- ఎలుకలపై చేసిన ప్రయోగాల్లో సత్ఫలితాలు
- ఇన్సులిన్ ఇంజెక్షన్లు, మందుల వాడకానికి చెల్లు



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్ (నమస్తే తెలంగాణ): ప్రపంచ వ్యాప్తంగా ప్రతి పది మందిలో ఒకరు డయాబెటిస్‌తో బాధ పడుతున్నారు. రక్తంలో చక్కెర స్థాయి లను నియంత్రించడా నికి రోజూ ఇన్సులిన్ వంటి ఇంజెక్షన్లు, మందులను వాడటం రోగులకు ఇబ్బందే. దీనికి చెక్ పెడుతూ క్లోమంలో ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేసే కణాలను ఉత్తేజితం చేసే వినూత్న డ్రగ్ థెరపీని అమెరికా శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఎలుకల్లో చేసిన ఈ ప్రయోగాలు సత్ఫలితాలను ఇచ్చాయని, ఇన్సులిన్ ఉత్పత్తి చేసే కణాలను ఈ డ్రగ్ థెరపీతో 700 శాతం మేర ఉత్తేజితం చేశామని పరిశోధకులు పేర్కొన్నారు.

ఎలా చేశారంటే?

రక్తంలోని చక్కెర స్థాయిలను స్థిరీకరించడం కోసం క్లోమంలోని బీటా కణాలు ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేస్తాయి. అయితే, వీటి పనితీరులో ఇబ్బంది కలిగినా, లేక ఈ కణాలు నాశనమైనా టైప్ 1, టైప్ 2 డయాబెటిస్‌లకు గురవుతాం. దీన్ని నివారించడానికి ఇంజెక్షన్ల ద్వారా ఇన్సులిన్‌ను శరీరంలోకి ఇంజెక్ట్ చేయాల్సి ఉంటుంది. అయితే, దీనికి ముగింపు పలుకుతూ.. నిర్వీర్యంగా మారిన బీటా పనిచేయకుండాపోయిన బీటా కణాలను పునరుత్తేజితం చేసే డ్రగ్ థెరపీని మౌంట్ సినాయ్, సిటీ ఆఫ్ హోప్ సంస్థల వైద్య నిపుణులు అభివృద్ధి చేశారు. 'ఫంక్షనల్ డయాబెటిస్ క్యూర్'గా పిలిచే ఈ థెరపీ సాయంతో పనిచేయకుండా పోయిన బీటా కణాలను కేవలం మూడు నెలల వ్యవధిలోనే ఉత్తేజితం చేయగలమని చెప్పారు. నిర్వీర్యంగా మారిన బీటా కణాల స్థానంలో కొత్త కణాలను కూడా ఉత్పత్తి చేయవచ్చని పేర్కొన్నారు. దీని కోసం మూలకణాల సాయాన్ని తీసుకోవాలని వివరించారు. ఈ డ్రగ్ థెరపీలో సహజసిద్ధంగా దొరికే హార్మైన్, జీఎల్పీ1 వంటి ఔషధాలను వినియోగించినట్టు తెలిపారు. మనుషులపై ఈ ప్రయోగం విజయవంతమైతే, డయాబెటిస్‌కు శాశ్వతంగా చెక్ పెట్టవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు.

పాంక్రియాటిక్ క్యాన్సర్‌కు చెక్!

మహమ్మారిపై పోరాడే డీఎన్ఏలోని కీలక కణాలను గుర్తించిన పరిశోధకులు



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్ (నమస్తే తెలంగాణ): చివరి దశలో మాత్రమే గుర్తించగలిగే మహమ్మారి పాంక్రియాటిక్ క్యాన్సర్ (క్లోమ గ్రంధి క్యాన్సర్). ఇది సోకిన రోగుల్లో సగం మంది మూడు నెలల్లోనే మరణిస్తున్నారు. అయితే, ఈ క్యాన్సర్‌పై పోరాడే డీఎన్ఏలోని కీలక జన్యువులను అమెరికా, యూకే పరిశోధకులు గుర్తించారు. ఈ కణాలు నాశనం కాకుండా రివర్స్ థెరపీ ద్వారా చెక్ పెడితే.. పాంక్రియాటిక్ క్యాన్సర్ కేసులను కట్టడి చేయవచ్చని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఎలా చేస్తారంటే??

క్లోమంలో ఉన్న డీఎన్ఏలోని హెచ్ఎన్ఎఫ్4ఏ జన్యువుల సాయంతోనే శరీరంలోని కీలక అవయవాలన్నీ జీవక్రియలను సక్రమంగా నెరవేరుస్తాయి. అయితే, పాంక్రియాటిక్ క్యాన్సర్ సోకిన రోగిలో ఈ క్యాన్సర్ కణాలు హెచ్ఎన్ఎఫ్4ఏ జన్యువులపై దాడి చేసి, కొత్త కణాలు పుట్టకుండా నిరోధిస్తున్నట్టు పరిశోధకులు తాజాగా కనిపెట్టారు. ఈ ప్రక్రియకు 'డీఎన్ఏ మిథైలేషన్'గా పేరు పెట్టారు. అయితే, రివర్స్ థెరపీ సాయంతో ఈ 'డీఎన్ఏ మిథైలేషన్' ప్రక్రియను ఇనయాక్టివ్ చేసి, హెచ్ఎన్ఎఫ్4ఏ జన్యువుల వృద్ధిని పెంచితే పాంక్రియాటిక్ క్యాన్సర్ వ్యాప్తిని కట్టడి చేయవచ్చని పరిశోధకులు తాజాగా గుర్తించారు. త్వరలోనే ఔషధాలను తీసుకురానున్నట్టు తెలిపారు.

క్యాన్సర్ కన్నా నిస్సత్తువతోనే చావు!

- కాచెక్సియాతోనే అధిక మరణాలు
- సీఎస్‌హెచ్ఎల్ శాస్త్రవేత్తల అధ్యయనం



న్యూఢిల్లీ: ఒక క్యాన్సర్ కణం.. ఇంకో ఆరోగ్యకర కణాన్ని లొంగదీసుకుంటుంది. అలా ఒక్కో కణం.. ఇంకో కణాన్ని లొంగదీసుకుంటూ క్యాన్సర్ అంతటా పాకుతుంది. ఈ దశలో రోగనిరోధక వ్యవస్థ కుంటుపడుతుంది. అలసట, బలం లేకపోవటం, ఏ పని చేద్దామన్నా శరీరం సహకరించకపోవటం లాంటి సమస్యలు వస్తాయి. అయితే.. క్యాన్సర్ కణం చూపే ప్రభావం కన్నా.. అలసట, బరువు తగ్గిపోవటం (కాచెక్సియా) వల్లే ఎక్కువ మంది మరణిస్తున్నారని తాజా అధ్యయనంలో తేలింది. 'ఒక క్యాన్సర్ వ్యాధిగ్రస్తుడు ఈ దశలోకి వచ్చారంటే.. వ్యాధి నయం కావటం దాదాపు అసాధ్యం. ఎందుకంటే ఈ దశలో చికిత్స లేనేలేదు' అని అమెరికాకు చెందిన కోల్డ్ స్ప్రింగ్ హార్బర్ ల్యాబొరేటరీ (సీఎస్‌హెచ్ఎల్) శాస్త్రవేత్తలు వివరించారు. 50-80 శాతం పేషెంట్లు ఇలాగే మరణిస్తున్నారని వెల్లడించారు. రోగుల్లోని రోగనిరోధక వ్యవస్థలో ఇంటర్‌ల్యూకిన్-6 (ఐఎల్-6) అణువు మెదడు పనితీరుపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. దాంతో కాచెక్సియా దశలోకి వెళుతారని పేర్కొన్నారు. ఎలుకల్లోని న్యూరాన్లపై ఐఎల్-6 ప్రభావం చేరకుండా అడ్డుకొని పరిశీలించగా, కాచెక్సియా ప్రభావం లేదని, దాంతో ఆ ఎలుక మెదడు ఆరోగ్యంగా ఉండి, మరిన్ని రోజులు బతికిందన్నారు.

ఐఎల్-6 పాత్ర కీలకం

ఆరోగ్యవంతుల్లో ఐఎల్-6 పాత్ర చాలా కీలకమని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ అణువు శరీరమంతా ప్రవహించి, సహజ రోగనిరోధక వ్యవస్థ పనితీరును పరిశీలిస్తుందని, ముప్పు ఎదురవుతుందని తెలిస్తే వెంటనే మెదడుకు సమాచారం చేరవేస్తుందని తెలిపారు.



420 కోట్ల ఏండ్ల క్రితం భూమిపై జీవం

తాజా అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ, జూలై 15: భూమిపై జీవం పుట్టుకకు సంబంధించి పరిశోధకులు ఆసక్తికర విషయాన్ని వెల్లడించారు. సుమారుగా 420 కోట్ల సంవత్సరాల క్రితం భూమిపై జీవం ఆవిర్భవించిందని సైంటిస్టులు అంచనావేస్తున్నారు. 'నేచర్ ఎకాలజీ జర్నల్ నివేదిక ప్రకారం, భూమిపై ప్రస్తుత జీవుల జన్యువులను విశ్లేషించిన సైంటిస్టులు, పూర్వీకుల్లో చివరగా ఉన్న జీవుల పుట్టుక సమయాన్ని గణించారని నివేదిక పేర్కొన్నది. ఇన్ని క్రమంలో.. 'చివరి సార్వత్రిక సాధారణ పూర్వీకులు' సమయాన్ని వారు కనుగొన్నారు. భూమిపై జీవం పుట్టుకకు ఒకే ఒక పూర్వీకుడు కారణమైతే.. ఆ పూర్వీకుడు సుమారుగా 420 కోట్ల క్రితం పుట్టి ఉంటాడని అంచనా కట్టారు. భూమి ఏర్పడి కూడా 450 కోట్ల సంవత్సరాలు అవుతున్నది. తాజా పరిశోధన ప్రకారం.. భూమి శైశవ దశలోనే జీవం ఏర్పడినట్టు అధ్యయనం సూచిస్తున్నది.

చంద్రుడిపై గుహ!

కేప్ కెనావెరాల్, జూలై 15: చంద్రుడిపై ఒక గుహ ఉందని ఇటలీ శాస్త్రవేత్తల బృందం నిర్ధారించింది. భవిష్యత్తులో ఉపగ్రహంపైకి పంపే వ్యోమగాములకు దీనిని షెల్టర్‌గా వాడొచ్చని వెల్లడించింది. అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా' 1969లో ప్రయోగించిన 'అపోలో-11'.. చంద్రుడిపై దిగిన ప్రదేశానికి సమీపంలోనే ఈ గుహ ఉందని శాస్త్రవేత్తలు వెల్లడించారు. చంద్రుడిపై 'సీ ఆఫ్ ట్రాంక్విలిటీ' అనే ప్రదేశానికి 400 కిలోమీటర్ల దూరంలో గొయ్యి మాదిరి ఓ గుహ ఉందని, భవిష్యత్తులో అక్కడికి వెళ్లే వందలాది మంది వ్యోమగాములు అందులో ఆశ్రయం పొందవచ్చని సైంటిస్టులు విశ్వసిస్తున్నారు. లావా ట్యూబ్స్‌తో 200కుపైగా గొయ్యి మాదిరి ఉండే గుహలు ఏర్పడ్డాయని గుర్తించారు. చంద్రుడిపై నాసా లూనార్ ఆర్బిటర్ రాడార్ డాటాను విశ్లేషించిన సైంటిస్టులు, భూమిపై ఏర్పడ్డ లావా ట్యూబ్స్ (గుహలు)తో వాటిని పోల్చారు.



బీజేపీకి పెద్ద చిక్కు!

పెద్దల సభలో తగ్గిపోయిన సంఖ్యాబలం

- నలుగురి పదవీ విరమణతో 86కు పడిపోయిన కమలం ఎంపీల సంఖ్య
- ఎన్డీయేకు 101 మంది ఎంపీలు
- మెజార్టీకి 12 సీట్ల దూరంలో అధికారపక్షం
- రాజ్యసభలో బిల్లుల ఆమోదానికి తటస్థ పార్టీలపై ఆధారపడాల్సిన పరిస్థితి

న్యూఢిల్లీ, జూలై 15: రాజ్యసభలో అధికార బీజేపీ బలం 86కు పడిపోయింది. పెద్దల సభలో శనివారంతో నలుగురు నామినేటెడ్ ఎంపీల పదవీకాలం ముగిసింది. రాకేశ్ సిన్హా, రామ్ షకల్, సోనాల్ మాన్ సింగ్, మహేశ్ జెఠ్మలానీ రిటైర్ అయ్యారు. వీరిని రాష్ట్రపతి నామినేట్ చేసినప్పటికీ, తర్వాత అధికారికంగా మోదీ ప్రభుత్వానికి మద్దతు పలికారు. తాజాగా వీరి పదవీ విరమణ చేయడంతో రాజ్యసభలో బీజేపీ ఎంపీల సంఖ్యాబలం 86కు పడిపోగా, మిత్రపక్షాలతో కలుపుకొంటే ఎన్డీయే సంఖ్యా బలం 101కు తగ్గిపోయింది. బీజేపీ బలం ప్రస్తుత లెక్కల ప్రకారం రాజ్యసభలో మెజార్టీ మార్క్(113)కు 12 సీట్ల దూరంలో ఆగిపోయింది. ఎన్డీయేకు ఇతర ఏడుగురు నామినేటెడ్, ఒక స్వతంత్ర ఎంపీ మద్దతును కలుపుకొన్నా బిల్లులను పాస్ చేయించుకొనేందుకు మరో నలుగురు ఎంపీల సపోర్టు అవసరం అవుతుంది. దీంతో పెద్దల సభలో ఏ బిల్లును నెగ్గించుకోవాలన్నా బీజేపీ ఏ కూటమిలోనూ లేని పార్టీలపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొన్నది.

తటస్థ పార్టీలు కీలకం

కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమికి రాజ్యసభలో 87 మంది ఎంపీలు ఉన్నారు. వీరిలో కాంగ్రెస్‌కు 26 మంది, తృణమూల్ కాంగ్రెస్-13, ఆప్, డీఎంకే పార్టీలకు 10 మంది చొప్పున ఎంపీల బలం ఉన్నది. ప్రస్తుతం ఎన్డీయే, ఇండియా కూటముల్లో లేని బీఆర్ఎస్‌కు నలుగురు, వైసీపీకి 11, బీజూ జనతాదళ్‌కు 9 మంది రాజ్యసభ సభ్యులు ఉన్నారు. దీంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యసభలో బిల్లులను ఆమోదింపజేసుకోవాలంటే అన్నాడీఎంకే, వైసీపీ లాంటి ఎన్డీయే, ఇండియా కూటమియేతర పార్టీలతోపాటు నామినేటెడ్ ఎంపీలు, స్వతంత్ర ఎంపీలపై ఆధారపడాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఖాళీ అయిన 4 నామినేటెడ్ సీట్లను భర్తీ చేయడంతో పాటు ఈ ఏడాది 11 ఖాళీ సీట్లకు జరగాల్సిన ఎన్నికలు పూర్తయ్యే వరకు బీజేపీకి ఈ పరిస్థితి తప్పదు. ఇప్పటికైతే రాజ్యసభలో బిల్లును పాస్ చేసుకొనేందుకు బీజేపీకి ఎన్డీయేలోని ఇతర పార్టీల 15 ఓట్లతో పాటు మరో 12 మంది ఎంపీల ఓట్లు అవసరం అవుతాయి. గతంలో అంశాలవారీగా కేంద్రంలోని బీజేపీకి మద్దతు పలికిన ఒడిశా మాజీ సీఎం నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బీజేడీ.. ఈసారి ఆ పార్టీకి మద్దతిచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

పెద్దల సభలో 20 ఖాళీలు

మొత్తం 245 సీట్లున్న రాజ్యసభలో ప్రస్తుతం 20 ఖాళీలు ఉన్నాయి. వీటిల్లో 11 సీట్లకు ఈ ఏడాదిలో ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నది. మహారాష్ట్ర, అస్సాం, బీహార్‌లలో రెండు చొప్పున, హర్యానా, రాజస్థాన్, మధ్యప్రదేశ్, తెలంగాణ, త్రిపురలో ఒక్క స్థానం చొప్పున ఉన్నాయి. వీటిల్లో బీజేపీకి ఉన్న సంఖ్యా బలంతో కనీసంగా ఏడు సీట్లు గెలుచుకొనే అవకాశం కనిపిస్తున్నది. మహారాష్ట్రలో కూటమి ఎమ్మెల్యేలను నిలబెట్టుకోగలిగితే మరో రెండు సీట్లు కూడా గెలుచుకొనే చాన్స్ ఉన్నదని విశ్లేషకులు అంటున్నారు.



రాజ్యసభలో బలాబలాలు ఇలా..

- రాజ్యసభ స్థానాలు- 245
- ప్రస్తుతం ఉన్న ఖాళీలు-20
- 225 స్థానాలకు మెజార్టీ మార్క్- 113
- బీజేపీకి ఉన్న ఎంపీలు- 86

అధికార, విపక్షాల బలం

- ఎన్డీయే కూటమి - 101
- ఇండియా కూటమి - 87

ఏ కూటమిలో లేని పార్టీలు

వైసీపీ(11), బీజేడీ(9), అన్నాడీఎంకే(4), బీఆర్ఎస్(4)



మోదీ సారథ్యంలో టైటానిక్‌లా బీజేపీ మునక

సుబ్రమణ్య స్వామి వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: బీజేపీ నేత సుబ్రమణ్య స్వామి ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. 'బీజేపీలో ఉన్న మనం మన పార్టీ టైటానిక్ నౌక మాదిరిగా మునిగిపోవాలని కోరుకుంటే, అందుకు సారథ్యం వహించడానికి మోదీ అత్యుత్తముడు. బీజేపీ శాశ్వతంగా మునిగిపోయేలా బీటలు వారుతున్నదని ఉప ఎన్నికల ఫలితాలు వెల్లడిస్తున్నాయి' అని ట్వీట్ చేశారు. 13 శాసనసభ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు శనివారం విడుదలైన సంగతి తెలిసిందే. వీటిలో 10 స్థానాలను ఇండియా కూటమి గెలుచుకుంది. బీజేపీ కేవలం రెండు స్థానాలను మాత్రమే దక్కించుకోగలిగింది. మరొక స్థానంలో స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించారు. ఈ నేపథ్యంలో సుబ్రమణ్య స్వామి మోదీపై విమర్శలు గుప్పించారు.

డీకేకు చుక్కెదురు

- సీబీఐ కేసు కొట్టివేతకు సుప్రీంకోర్టు నిరాకరణ

న్యూఢిల్లీ, జూలై 15: అక్రమాస్తుల కేసులో కర్ణాటక డిప్యూటీ సీఎం, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తనపై సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం సోమవారం తిరస్కరించింది. ఈ వ్యవహారంలో కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. ఆదాయ పన్ను శాఖ దర్యాప్తు చేస్తున్న వ్యవహారంపై సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు అవకాశం లేదన్న శివకుమార్ తరపు న్యాయవాది ముకుల్ రోహత్గి వాదనలను కోర్టు తిరస్కరించింది. 2013-18 మధ్య కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో డీకే శివకుమార్ మంత్రిగా పనిచేశారు. ఆ సమయంలో డీకే ఆదాయానికి మించి అక్రమ ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలు ఉన్నాయి.

భరణంపై సుప్రీం తీర్పు ఇస్లాంకు వ్యతిరేకం

ముస్లిం పర్సనల్ లా బోర్డ్

న్యూఢిల్లీ : విడాకులు తీసుకున్న ముస్లిం మహిళలు భరణానికి అర్హులేనని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేయాలని అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఏఐఎంపీఎల్‌బీ) ఆదివారం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. దీనిపై తగిన కార్యాచరణ చేపట్టడానికి బోర్డు అధ్యక్షుడికి అధికారాలు ఇచ్చింది. ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన ఉమ్మడి పౌర స్మృతిపైనా కోర్టులో పిటిషన్ వేయాలని బోర్డు నిర్ణయించింది. మహిళలపై కోర్టు తాజా తీర్పు ఇస్లామిక్ చట్టానికి(షరియా) వ్యతిరేకంగా ఉందని సమావేశం తీర్మానించింది.

పండిట్లపై బీజేపీ కపట ప్రేమ!

- హిందువుల ఓట్ల కోసం మమ్మల్ని వాడుకున్నది
- కేంద్రంపై 'పనున్ కశ్మీర్' సంఘం తీవ్ర ఆగ్రహం

న్యూఢిల్లీ, జూలై 15: కశ్మీరీ పండిట్ల వలస అంశాన్ని బీజేపీ దేశవ్యాప్తంగా హిందువుల ఓట్లను పొందేందుకు ఉపయోగించుకొన్నదని కశ్మీరీ పండిట్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోయిన కశ్మీరీ పండిట్లపై బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత పదేండ్లుగా నిర్లక్ష్యం వహించిందని కశ్మీరీ పండిట్ల హక్కుల కోసం పోరాడే 'పనున్ కశ్మీర్' సంఘం మండిపడింది. ఆర్టికల్ 370ని రద్దు చేసినా, జమ్ముకశ్మీర్‌ను రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా చేసినా బీజేపీ ప్రభుత్వం కశ్మీరీ పండిట్ల పట్ల ఉదాసీనత, పక్షపాతం చూపిందని ఆవేదన వ్యక్తం చేసింది. పనున్ కశ్మీర్ చైర్మన్ అజయ్ చ్రుంగూ తాజాగా జమ్ములో మీడియాతో మాట్లాడుతూ ప్రతిపక్షాలపై నిందలు వేసేందుకు, దేశవ్యాప్తంగా హిందూ ఓట్లు పొందడం కోసం బీజేపీ నాయకత్వం పండిట్ల వలస అంశాన్ని ఉపయోగించుకొన్నదన్నారు. కశ్మీరీ పండిట్లను రెండో తరగతి పౌరులుగా బీజేపీ మార్చిందని ఆరోపించారు. జమ్ము, కశ్మీర్‌లో ఉగ్రవాద, వేర్పాటువాద శక్తులు బలపడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. కశ్మీరీ హిందువుల శాశ్వత పునరావాసం కోసం ఒక ప్రత్యేక కేంద్ర పాలిత ప్రాంతాన్ని ఏర్పాటు చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు.

బంగళా ఖాళీ చేయండి

200 మంది మాజీ ఎంపీలకు నోటీసులు

న్యూఢిల్లీ: ఢిల్లీలోని అధికారిక బంగళాలను ఖాళీ చేయాలని 200 మందికిపైగా మాజీ లోక్‌సభ సభ్యులకు నోటీసులు జారీ అయ్యాయి. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వర్గాలు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం, అనధికారికంగా ప్రభుత్వ బంగళాల్లో ఉండేవారిని ఖాళీ చేయించడానికి ఉద్దేశించిన చట్టం ప్రకారం ఈ నోటీసులను జారీ చేశారు. వీరు త్వరగా ఖాళీ చేయకపోతే, బలవంతంగా ఖాళీ చేయించేందుకు అధికారులను పంపిస్తారు. నిబంధనల ప్రకారం, గత లోక్‌సభ రద్దయిననాటి నుంచి ఒక నెలలోగా ఎంపీలు తమ అధికారిక బంగళాలను ఖాళీ చేయాలి.

భూతాపాన్ని తగ్గించేందుకు.. మర్రిచెట్టుకు, రావి చెట్టుకు పెండ్లి

బెంగాల్‌లో వేడుకగా వివాహం

కోల్‌కతా, జూలై 15: వానలు పడాలంటూ కప్పల పెండ్లి చేయటం విన్నాం. అయితే, భూతాపాన్ని తగ్గించేందుకు పశ్చిమ బెంగాల్‌లో కొంతమంది వినూత్న కార్యక్రమాన్ని చేపట్టడం వార్తల్లో నిలిచింది. బెల్దాంగే మున్సిపాలిటీలో కొంతమంది భూతాపాన్ని తగ్గించేందుకు ఇక్కడి దోలా దక్షిణపురా ఆలయంలో రెండు చెట్ల మధ్య వివాహాన్ని జరిపించారు. స్థానిక దేవాలయంలో మర్రిచెట్టుకు, రావిచెట్టుకు జరిగిన వివాహ వేడుకకు 3వేల మందికిపైగా జనం బంధువులుగా హాజరయ్యారు. ఇంట్లో పెండ్లికి తయారైనట్టు కొత్త దుస్తులు వేసుకొని వారంతా రావటం..



కనులపండువగా వివాహాన్ని నిర్వహించటం చూపరులను ఆకట్టుకుంది.

గుజరాత్‌లో చాందీపురా వైరస్ కలకలం

ఐదు రోజుల్లో ఆరుగురు పిల్లల మృతి

అహ్మదాబాద్: గుజరాత్‌లో చాందీపురా వైరస్ కలకలం రేపుతున్నది. ఈ వైరస్ కారణంగా ఐదు రోజుల్లో ఆరుగురు పిల్లలు మృత్యువాతపడ్డారు. వైరస్ బారినపడినవారి సంఖ్య 12కు చేరింది. ఇది అంటువ్యాధి కాదని అధికారులు తెలిపారు. మహారాష్ట్రలోని చాందీపురా గ్రామంలో తొలిసారి ఈ వైరస్‌ను గుర్తించారు. ఇది పిల్లలకు వ్యాపిస్తుంది. వైరస్ సోకిన వారికి ఫ్లూ వంటి లక్షణాలతో జ్వరం వస్తుంది. తీవ్రమైన మెదడు వాపు కూడా కనిపిస్తుంది. దోమలు, ఈగలు వంటివాటి ద్వారా ఇది వ్యాపిస్తుంది.



జగన్నాథుడు, సుభద్ర, బలభద్రుడి రథాలు తిరిగి జగన్నాథుడి ఆలయానికి వచ్చే బహుదా యాత్ర సోమవారం పూరీలో వైభవంగా సాగింది. వేలాది మంది ప్రజలు ఈ ఉత్సవంలో పాల్గొని రథాలను లాగారు.

అమర్‌నాథ్‌కు రికార్డు స్థాయిలో భక్తులు

న్యూఢిల్లీ: అమర్‌నాథ్ యాత్రకు రికార్డు స్థాయిలో భక్తులు తరలివస్తున్నారు. ఈ యాత్ర మొదలైన తర్వాత 16 రోజుల్లోనే 3 లక్షల మందికి పైగా భక్తులు అమరలింగేశ్వరుడిని దర్శించుకోవడంతో సరికొత్త రికార్డు నమోదైంది. జమ్ములోని భగవతి నగర్ యాత్రి నివాస్ నుంచి సోమవారం మరో 4,875 మంది భక్తులు బయల్దేరారు. ఆదివారం వర్షాలు, ఉరుములు, మెరుపులతో కూడిన వాతావరణం ఉన్నప్పటికీ 15,000 మందికిపైగా భక్తులు అమరలింగేశ్వరుడిని దర్శనం చేసుకున్నారు.

'కేదార్‌నాథ్ గుడిలో 228 కిలోల బంగారం అదృశ్యం'

ముంబై: ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ దేవాలయంలో 228 కిలోల బంగారం అదృశ్యమైందని జ్యోతిర్మఠం శంకరాచార్య స్వామి అవిముక్తేశ్వరానంద ఆరోపించారు. ఇక్కడ కుంభకోణం చేసి, ఢిల్లీలో మరో కేదార్‌నాథ్‌ను నిర్మిస్తారా? అక్కడ మరో కుంభకోణానికి పాల్పడతారా? అని ప్రశ్నించారు. ఈ కుంభకోణంపై దర్యాప్తు జరగడం లేదని, దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని నిలదీశారు. ఢిల్లీలో కేదార్‌నాథ్ నిర్మించడం జరిగే పని కాదన్నారు.

భోజశాలలో హిందూ ఆలయం శిథిలాలపైనే మసీదు నిర్మాణం


భోపాల్: మధ్యప్రదేశ్‌లోని ధార్‌లో ఉన్న భోజశాల-కమల్ మౌలా మసీదు ప్రాంగణంలో సైంటిఫిక్ సర్వే నివేదికను ఏఎస్ఐ సోమవారం హైకోర్టుకు సమర్పించింది. ప్రస్తుత నిర్మాణాన్ని దేవాలయానికి సంబంధించిన శిథిలాలపై నిర్మించారని తెలిపింది. స్తంభాలపై ఉన్న వాస్తు శిల్పం, కళలను బట్టి అవి దేవాలయాల్లో భాగమని తెలుస్తున్నదని వివరించింది. దేవాలయం శిథిలాలు, బ్రహ్మదేవుడు, విష్ణు మూర్తి, గణేశుడు, ఇతర విగ్రహాలు వివిధ స్థితిలో కనిపించాయని చెప్పింది.

చివరి నిమిషంలో తల తిప్పడంతో!

ప్రాణాలతో బయటపడ్డ డొనాల్డ్ ట్రంప్ • ఆయన్ను బతికించిన సభలోని ఓ చార్ట్

- అందులోని వివరాలు చెప్పేందుకు తల కొద్దిగా తిప్పిన మాజీ అధ్యక్షుడు
- లేకుంటే నేరుగా తలలోకి బుల్లెట్
- నేసలు చనిపోయాననే అనుకొన్నా
- ఓ వార్తా సంస్థ ఇంటర్వ్యూలో ట్రంప్

న్యూఢిల్లీ, జూలై 15: అమెరికాలోని పెన్సిల్వేనియాలో శనివారం ఎన్నికల ప్రచారం సందర్భంగా జరిగిన కాల్పుల ఘటనలో ఆ దేశ మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తృటిలో ప్రాణాలతో బయటపడ్డారు. చివరి నిమిషంలో ఆయన తల కొద్దిగా తిప్పడంతో దుండగుడు కాల్చిన బుల్లెట్ కుడి చెవిలో నుంచి పోయిందని, లేకుంటే సూటిగా తలలోకి దూసుకుపోయేదని దాడికి సంబంధించిన వీడియోలు, అంతర్జాతీయ కథనాలు చెబుతున్నాయి. అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో భాగంగా ట్రంప్ వేదికపై మాట్లాడుతూ తనకు కుడివైపున ఉన్న ఓ అక్రమ వలసదారుల గణాంకాలకు సంబంధించిన చార్ట్‌ను చూపిస్తూ అటు వైపు తల తిప్పారు. ఆ తర్వాత దుండగుడు కాల్పులు జరుపగా బుల్లెట్ ట్రంప్ చెవిని తాకింది. ఒక వేళ ట్రంప్ అటువైపు తిరగకుంటే బుల్లెట్ నేరుగా తలలోకి దూసుకెళ్లేది. ఈ విషయాన్ని ట్రంప్ కూడా వెల్లడించారు. 'ఆ చార్ట్ నా ప్రాణాలను కాపాడింది' అని హత్యాయత్నం తర్వాత వైట్‌హౌస్ మాజీ ఫిజీషియన్ రిప్రజెంటేటివ్ రాన్నీ జాక్సన్‌కు ఫోన్ కాల్‌లో తెలిపారు. తనపై హత్యాయత్నంపై ట్రంప్ వార్తా సంస్థతో మాట్లాడారు. 'అసలు నేను మీ ముందు ఇలా ఉండేవాడినే కాదు. కాల్పుల ఘటనలో చనిపోయాననే అనుకొన్నా. ఇదొక విచిత్రమైన పరిస్థితి' అని పేర్కొన్నారు. రిపబ్లికన్ నేషనల్ కన్వెన్షన్‌లో పాల్గొనేందుకు విమానంలో వెళ్తూ ట్రంప్ ఈ విధంగా స్పందించారు. ఈ కన్వెన్షన్‌లో ట్రంప్ తన ఉపాధ్యక్ష అభ్యర్థిని కూడా ప్రకటించే అవకాశం ఉన్నది. జేడీ వాన్స్, మార్కో రూబియో, డగ్ బర్గమ్ ఉపాధ్యక్ష రేసులో ఉన్నారు.



భద్రతా సిబ్బందికి చెప్పినా..

ట్రంప్‌పై హత్యాయత్నం ఘటనలో యూఎస్ సీక్రెట్ సర్వీస్ వైఫల్యం ఉందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. బుల్లెట్‌ను కాల్చడానికి ముందు నిందితుడు ట్రంప్ సభా వేదికపై 150 మీటర్ల దూరంలోని ఓ రూఫ్‌పై నక్కి ఉండటంపై సభకు హాజరైన కొంత మంది అధికారులకు తెలిపినా పట్టించుకోలేదనే ఆరోపణలు వస్తున్నాయి.


జగన్నాథుడి కృపే కారణం: ఇస్కాన్

ట్రంప్ ప్రాణాలతో బయటపడటానికి పూరీ జగన్నాథుడి కృపే కారణమని ఇస్కాన్ వ్యాఖ్యానించింది. 48 ఏండ్ల క్రితం రథయాత్రకు ట్రంప్ సహకారం అందించారని, ఆ భగవంతుడి అనుగ్రహమే ఆయన్ను రక్షించిందని ఇస్కాన్ ప్రతినిధి రాధారమణ్ దాస్ అభిప్రాయపడ్డారు. 1976లో ఇస్కాన్ భక్తులు రథయాత్ర కోసం రథాలు సిద్ధం చేసుకొనేందుకు ఉచితంగా తన ట్రైన్‌యార్డ్‌ను ఇచ్చి ట్రంప్ సహకరించారని తెలిపారు.

ట్రంప్‌పై రహస్య పత్రాల కేసు కొట్టివేత

ట్రంప్‌నకు భారీ ఊరట లభించింది. రహస్య పత్రాల తరలింపునకు సంబంధించిన ఆరోపణల కేసును ఫ్లోరిడా కోర్టు కొట్టివేసింది. అభియోగాలు దాఖలు చేసిన ప్రత్యేక న్యాయవాదిని చట్టవిరుద్ధంగా నియమించారని ట్రంప్ తరఫు లాయర్ చేసిన వాదనతో న్యాయస్థానం ఏకీభవించింది.


నరమేధ ఆయుధం 'ఏఆర్-15' రైఫిల్



ట్రంప్‌పై దాడికి నిందితుడు క్రూక్స్ అమెరికాలోనే అత్యంత ప్రాణాంతకమైన తుపాకీ 'ఏఆర్-15' రైఫిల్‌ను ఉపయోగించాడు. సామూహిక జనహనన ఆయుధంగా దీనికి పేరున్నది. ఆర్మ్ లైట్(ఏఆర్)-15 తుపాకీ ఒక సెమీ ఆటోమేటిక్ ఆయుధం. ఇది మోడ్రన్ స్పోర్టింగ్ రైఫిల్(ఎంఎస్ఆర్) విభాగంలోకి వస్తుంది. సైనిక అవసరాల కోసం తయారు చేసిన ఎం-16 రైఫిల్‌కు ఇది పౌర వెర్షన్. ఏఆర్-15ను ప్రధానంగా క్రీడల్లో, జంతువుల వేటలో ఉపయోగిస్తుంటారు. ఏఆర్-15 తుపాకీ నిమిషానికి 45 తూటాలను పేల్చగలదు. అత్యంత వేగంతో దూసుకొచ్చే దీని బుల్లెట్ తగిన చోట శరీరాన్ని ఛిద్రం చేస్తుంది.


రాష్ట్ర మార్కెట్లోకి అపాచీ సరికొత్త బైకు

ధర రూ.1.20 లక్షలు



హైదరాబాద్, జూలై 15: టీవీఎస్ మోటార్.. రాష్ట్ర మార్కెట్లోకి సరికొత్త అపాచీ 160 సిరీస్ డార్క్ ఎడిషన్‌గా విడుదల చేసింది. వీటిలో టీవీఎస్ అపాచీ ఆర్‌టీఆర్ 160 మాడల్ ధర రూ.1,09,990, అపాచీ ఆర్‌టీఆర్ 160 4వీ మాడల్ ధర రూ.1,19,990గా నిర్ణయించింది. ఈ సందర్భంగా కంపెనీ బిజినెస్ హెడ్ విమల్ సంబ్లీ మాట్లాడుతూ.. 160 సీసీ ఇంజిన్ సామర్థ్యంతో రూపొందించిన ఈ రెండు మోటర్‌సైకిళ్లు 17.6 పీఎస్ 9250 శక్తిని వ్యవసున్నదని, యువతకు నచ్చే విధంగా వీటిని రూపొందించినట్లు చెప్పారు.

రుణగ్రహీతలకు ఎస్బీఐ షాక్



ఎస్బీఐ రుణాలపై పెరిగిన వడ్డీరేట్లు (శాతాల్లో)

కాలవ్యవధి	ప్రస్తుత ఎంసీఎల్ఆర్	మారిన ఎంసీఎల్ఆర్	పెరుగుదల
ఓవర్‌నైట్	8.10	8.10	యథాతథం
ఒక నెల	8.30	8.35	5 బేసిస్ పాయింట్లు
3 నెలలు	8.30	8.40	10 బేసిస్ పాయింట్లు
6 నెలలు	8.65	8.75	10 బేసిస్ పాయింట్లు
ఏడాది	8.75	8.85	10 బేసిస్ పాయింట్లు
2 ఏండ్లు	8.85	8.95	10 బేసిస్ పాయింట్లు
3 ఏండ్లు	8.95	9.00	5 బేసిస్ పాయింట్లు

ముంబై, జూలై 15: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) తమ రుణగ్రహీతలకు షాకిచ్చింది. ఆయా కాలవ్యవధులతో కూడిన రుణాలపై వడ్డీరేట్లను పెంచుతున్నట్లు సోమవారం ప్రకటించింది. ఈ క్రమంలోనే మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్-బేస్డ్ లెండింగ్ రేటు (ఎంసీఎల్ఆర్)ను 10 బేసిస్ పాయింట్లదాకా పెంచింది. ఎంసీఎల్ఆర్ అంటే.. కనీస రుణ రేటు. దీనికంటే తక్కువ వడ్డీరేటుకు బ్యాంకులు రుణాలివ్వరాదు. ఎస్బీఐ అధికారిక వెబ్‌సైట్ ప్రకారం పెరిగిన వడ్డీరేట్లు వెంటనే అమల్లోకి వస్తాయి.

ఈఎంఐల భారం

ఎస్బీఐ తీసుకున్న తాజా నిర్ణయంతో ముఖ్యంగా వాహన, గృహ రుణాలు ప్రియమైపోయాయి. ఇప్పటికే ఆటో, హోమ్ లోన్లపై వడ్డీరేట్లు మోయలేనంతగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో వీటి ఈఎంఐలు మరింత పెరిగాయి. కరోనా మహమ్మారి ప్రభావంతో బలహీనపడ్డ దేశ ఆర్థిక వ్యవస్థను బలపర్చేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) 2020లో వడ్డీరేట్లను గణనీయంగా తగ్గించిన విషయం తెలిసిందే. దీంతో అంతా రుణాలు తీసుకున్నారు. అయితే కరోనా పరిస్థితులు అదుపులోకి రావడం, మరోవైపు ద్రవ్యోల్బణం విజృంభించడంతో ధరలను కట్టడి చేయడానికి సెంట్రల్ బ్యాంక్ వడ్డీరేట్లను పెంచుకుంటూపోయింది. వరుస ద్రవ్యసమీక్షల్లో వడ్డనల వల్ల రెపో రేటు గరిష్ఠంగా 6.50 శాతానికి చేరింది. నిరుడు ఫిబ్రవరిలో ఆఖరిసారిగా పెంచగా.. అప్పట్నుంచి రెపో అక్కడే ఉంటున్నది. దీంతో బ్యాంకులూ, ఇతరత్రా బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలూ తమ రుణాలపై వడ్డీరేట్లను ఆ మేరకు పెంచేశాయి. ఫలితంగా వడ్డీరేట్లు తక్కువగా ఉన్నాయని రుణాలు తీసుకున్నవారిపై ఇప్పుడు నెలవారీ వాయిదాల భారం మోయలేని విధంగా తయారైంది. ఇది ఎస్బీఐ రుణగ్రహీతలపై ఇంకా పెరిగిందివ్వదు. నిజానికి గత నెల జూన్‌లోనూ ఎంసీఎల్ఆర్‌ను ఎస్బీఐ 10 బేసిస్ పాయింట్లు వరకు పెంచింది. దీంతో అన్ని కన్జ్యూమర్ లోన్లు ఖరీదయ్యాయి.

మారని ఈబీఎల్ఆర్

ఎస్బీఐ ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లెండింగ్ రేటు (ఈబీఎల్ఆర్) 9.15 శాతం+సీఆర్పీ, బీఎస్పీగానే ఉన్నది. అన్ని గృహ రుణాలకు ఈ రేటే లింకై ఉంటుంది. సిబిల్ స్కోర్ ఆధారంగా ఖాతాదారులు తీసుకున్న రుణాలపై వడ్డీరేట్లు 8.50 శాతం నుంచి 9.65 శాతం మధ్య ఉంటాయి. ప్రాసెసింగ్ ఫీజు తీసుకున్న రుణంలో 0.35 శాతానికి సమానంగా ఉంటుంది. దీనికి పన్ను, సేవల పన్ను (జీఎస్టీ) అదనం. అయినప్పటికీ మొత్తంగా కనీస ఫీజు రూ.2,000, గరిష్ఠం రూ.10,000గానే ఉంటుంది. ఇక గత ఏడాది జూన్ 15 నుంచి ఎస్బీఐ బేస్ రేటు 10.40 శాతంగానే ఉంటున్నది. అలాగే ఈ ఏడాది జూన్ 15 నుంచి బ్యాంక్ వార్షిక బెంచ్‌మార్క్ ప్రైమ్ లెండింగ్ రేటు (బీపీఎల్ఆర్) 15.15 శాతంగా మారిన విషయం తెలిసిందే.



బెంగళూరులో జరిగిన ట్రైమ్స్ నౌ ఇండియా ఇన్‌ఫ్రా ట్రాన్స్‌పోర్టేషన్ సమ్మిట్‌లో ఇంపాక్ట్‌ఫుల్ ఇన్‌ఫ్రా లీడర్-2024 అవార్డు అందుకుంటున్న ఎల్ అండ్ టీ మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తదితరులు

ఐపీవోకి సాయి లైఫ్ సైన్సెస్!

న్యూఢిల్లీ, జూలై 15: హైదరాబాద్ కేంద్రస్థానంగా కార్యకలాపాలు అందిస్తున్న సాయి లైఫ్ సైన్సెస్..స్టాక్ మార్కెట్లోకి అడుగుపెట్టబోతున్నది. ఇందుకు సంబంధించి స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి దరఖాస్తు చేసుకున్నది కూడా. వ్యాపార విస్తరణకోసం అవసరమయ్యే నిధుల్లో రూ.800 కోట్ల నిధులను ఐపీవో ద్వారా సేకరించడానికి సిద్ధమైంది. ప్రమోటర్లు, షేరుహోల్డర్లు, ఇన్వెస్టర్ షేరుహోల్డర్లకు చెందిన 6.15 కోట్ల విలువైన షేర్లను ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో విక్రయించనున్నారు. వాటాలు విక్రయించనున్న ప్రమోటర్లలో సాయి క్రిస్ట్ ప్రైవేట్ లిమిటెడ్, టీపీజీ ఆసియా 8 ఎస్ఎఫ్ పీటీఈ లిమిటెడ్, హెచ్‌బీఎం ప్రైవేట్ ఈక్విటీ ఇండియాలు ఉన్నాయి.

బీవోబీ మాన్‌సూన్ ధమాకా డిపాజిట్ స్కీం

న్యూఢిల్లీ, జూలై 15: ప్రభుత్వ బ్యాంకింగ్ దిగ్గజాల్లో ఒకటైన బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ).. మాన్‌సూన్ ధమాకా డిపాజిట్ స్కీంను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ స్కీం కింద 399 రోజుల కాలపరిమితి కలిగిన రిటైల్ టర్మ్ డిపాజిట్లపై 7.25 శాతం వడ్డీని ఆఫర్ చేస్తున్న బ్యాంక్..333 రోజుల కాల పరిమితిపై 7.15 శాతం వడ్డీని ఆఫర్ చేస్తున్నది. అలాగే సీనియర్ సిటిజన్లకు అదనంగా మరో అర శాతం వడ్డీని చెల్లిస్తుండటంతో 7.65 శాతం నుంచి 7.75 శాతం మధ్యలో వడ్డీని ఆఫర్ చేస్తున్నది. రూ.3 కోట్ల లోపు టర్మ్ డిపాజిట్లకు ఈ ప్రత్యేక స్కీం వర్తించనున్నదని పేర్కొంది.

చెప్పేది విన్నాకే..

ఫ్రాడ్ రిస్క్ మేనేజ్‌మెంట్ మార్గదర్శకాలను మార్చిన ఆర్బీఐ

ముంబై, జూలై 15: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) సోమవారం ఫ్రాడ్ రిస్క్ మేనేజ్‌మెంట్‌పై తమ మాస్టర్ డైరెక్షన్స్‌ను సవరించింది. ఏదైనా ఖాతాను మోసంగా ప్రకటించే ముందు సదరు ఖాతాదారుడు లేదా రుణగ్రహీత చెప్పేది బ్యాంకులు (రుణదాతలు) వినాలన్న సుప్రీం కోర్టు తీర్పు సిఫార్సు మేరకే ఈ మార్పులు చేసింది.



ఎస్బీఐ, రాజేశ్ అగర్వాల్ కేసులో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం.. రుణగ్రహీతల హక్కులను గౌరవించాలని పేర్కొన్నది. ఈ క్రమంలోనే ఖాతాను మోసంగా వర్గీకరించే ముందు సదరు రుణగ్రహీత చెప్పేదాన్ని విని ఓ నిర్ణయానికి రావాలన్నది. దీంతో ఇకపై బ్యాంకులు దీన్ని అనుసరించాల్సిందేనంటూ ఆర్బీఐ తాజా మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది.



టీ హబ్‌కు ఇన్‌ఫ్రా కార్పొరేట్ ఎక్సలెన్స్ అవార్డు వరించింది. మార్కెట్ వ్యర్థాలను అధిక పోషక కంపోస్ట్ ఎరువుగా తయారు చేసి, వాటిని తిరిగి తమ ప్రాంగణంలో ఉన్న చెట్లకు వాడామని టీ హబ్ సీఈవో ఎంఎస్ రావు తెలిపారు. అదేవిధంగా ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి రీసైక్లింగ్ చేశామని, ఈ రెండు చర్యలకు గాను అవార్డు దక్కిందని ఆయన వెల్లడించారు.

టీసీఎస్‌లో ఫ్రెషర్లకు 40 వేల ఉద్యోగాలు!

న్యూఢిల్లీ, జూలై 15: దేశీయ ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్)..ఫ్రెషర్లకు పెద్దపీట వేస్తున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి 40 వేల మంది ఫ్రెషర్లను నియమించుకునేయోచనలో సంస్థ ఉన్నది. గత త్రైమాసికంలో కొత్తగా 5,452 మందిని రిక్రూట్ చేసుకోవడంతో మొత్తం సంఖ్య 6,06,998కి చేరుకున్నారు. ప్రపంచ ఐటీ రంగంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటున్న ప్రస్తుత తరుణంలో భారత్ ప్రతిభకు కేంద్రంగా మారిందని, భవిష్యత్తులో మార్పులు వచ్చే అవకాశాలు కనిపించడం లేదని టీసీఎస్ సీహెచ్ఆర్‌వో మిలింద్ లక్కాడ్ తెలిపారు.

ఆల్‌టైమ్ కనిష్ఠానికి రుపీ

మరో 10 పైసలు క్షీణించిన విలువ
83.61 స్థాయికి పతనం

ముంబై, జూలై 15: డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ మునుపెన్నడూ లేని స్థాయికి దిగజారింది. సోమవారం ఆల్ టైమ్ కనిష్ఠాన్ని తాకుతూ 83.61కి పడిపోయింది. గత శుక్రవారం ముగింపుతో చూస్తే 10 పైసలు తగ్గింది. ఒకానొక దశలో 83.62 స్థాయికి నష్టపోయింది. అయితే తిరిగి స్వల్పంగా కోలుకున్నది.

ద్రవ్యోల్బణం దెబ్బ

దేశీయంగా విజృంభిస్తున్న ద్రవ్యోల్బణం.. రూపాయిని ప్రభావితం చేస్తున్నట్లు బీఎస్పీ పరిబాస్‌కు చెందిన షేర్‌ఖాన్‌లో రిసెర్చ్ అనలిస్ట్‌గా ఉన్న అనుజ్ చౌదరి విశ్లేషించారు. ఈ క్రమంలోనే భారతీయ స్టాక్ మార్కెట్లు రికార్డు స్థాయి లాభాల్లో ముగిసినా.. ఆ ఉత్సాహాన్ని అందుకోలేకపోయినట్లు చెప్పారు.

బొటానికల్ గార్డెన్‌కు ఐఎస్‌వో సర్టిఫికెట్

శేరిలింగంపల్లి, జూలై 15: కొత్తగూడ బొటానికల్ గార్డెన్, పాలపిట్ట సైక్లింగ్ పార్కులకు ప్రతిష్ఠాత్మక ఐఎస్‌వో సర్టిఫికెట్ లభించింది. తెలంగాణలో నాణ్యత ధ్రువీకరణ పొందిన మొదటి ఉద్యానవనంగా నిలిచింది. బాధ్యతాయుత మొక్కల పెంపకం, నిర్వహణ, ఆరోగ్యకరమైన ప్రకృతి పర్యావరణాన్ని కలిగిఉండడంపై ఈ ఐఎస్‌వో సర్టిఫికెట్ లభించింది. సోమవారం టీఎస్ఎఫ్‌డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్‌నాయక్ ఈ సర్టిఫికెట్‌ను అందుకున్నారు.

టమాటలు కోసే అగ్రిబోట్

- సరికొత్త ఐడియాలు.. నూతన ఆవిష్కరణలు
- ఐఐటీ హైదరాబాద్‌లో ఆకట్టుకున్న ఇన్నోవేషన్ డే

సంగారెడ్డి జూలై 15(నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్ నూతన ఆవిష్కరణలకు వేదికగా మారుతున్నది. ఐఐటీ విద్యార్థులను పరిశోధనలు, నూతన ఆవిష్కరణలవైపు మళ్లించేలా ప్రతి ఏటా 'ఇన్నోవేషన్ డే'ను నిర్వహిస్తున్నది. సోమవారం ఐఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లో 'ఇన్నోవేషన్ డే-2024' నిర్వహించారు. హెచ్‌సీఎల్ ఫౌండర్ అజయ్‌చౌదరి, ఐఐటీహెచ్ పాలకవర్గం ఛైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి, ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బీఎస్ మూర్తి 'ఇన్నోవేషన్ డే'ను ప్రారంభించారు. ఐఐటీ హైదరాబాద్, ఎన్ఐటీ విద్యార్థులు, స్టార్టప్ కంపెనీల ప్రతినిధులు మొత్తం 32 నూతన ఆవిష్కరణలను ప్రదర్శించారు. ఆయా ఇంజినీరింగ్ కాలేజీల విద్యార్థులు, ప్రతినిధులు హాజరయ్యారు.



టమాటలు కోసే అగ్రిబోట్‌ను ప్రదర్శిస్తున్న ఇన్నోవేటర్

నేవీకోసం సరికొత్త ఫైర్‌రెసిస్ట్ సూట్..

నేవీ కోసం ఐఐటీ విద్యార్థి సుక్రుత్ సరికొత్త ఫైర్ రెసిస్టెంట్ సూట్‌ను తయారు చేశారు. ప్రస్తుతం ఇండియన్ నేవీ వార్‌షిప్, సబ్‌మెరైన్‌లో అగ్నిప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు వాటిని ఆర్పేందుకు నేవీ సిబ్బంది ఐదు కేజీలకుపైగా బరువున్న ఫైర్ రెసిస్టెన్స్ సూట్‌లను వాడుతారు. ఈ కష్టాలు తొలగించేలా వీరా స్టార్టప్ కంపెనీకి చెందిన సుక్రుత్ బృందం తేలికైన 'టార్చ్‌గేట్' అనే ఫైర్ రెసిస్ట్ సూట్ తయారు చేశారు. సాఫ్ట్ కాంపోజిట్ ఫైబర్‌తో తయారు చేసిన ఈ సూట్ 1200 డిగ్రీ ఫారన్‌హీట్ వరకు వేడిని రెసిస్ట్ చేస్తుంది. దీని బరువు 2.8 కేజీలు మాత్రమే. దీంతో ఇది నేవీ, ఫైర్ ఫైటర్ సిబ్బంది మంటలు ఆర్పేందుకు సులువుగా వాడవచ్చని ఆవిష్కర్త సుక్రుత్ తెలిపారు. కొన్ని పరీక్షలు ముగిసిన వెంటనే సరికొత్త సూట్లను భారత నేవీకి అప్పగిస్తామని చెప్పారు.



స్ట్రీట్ వెండర్ ఎలక్ట్రిక్ రిక్షా

టమాటలు పండించే రైతులు సాగు మొదలు పండిన టమాటాలు కోసేందుకు కూలీలు దొరక్క ఇబ్బందులు పడుతున్నారు. రైతుల కష్టాలను గుర్తించిన ఐఐటీ హైదరాబాద్‌కు చెందిన ఎంటెక్ విద్యార్థి యువరాజ్, అగ్రి టెక్ విద్యార్థి శివ టమాటలు కోసేందుకు సెమి అటానమస్ అగ్రిబోట్‌ను తయారు చేశారు. అగ్రిబోట్ వాహనం పైన సెన్సర్లు, రోబోటిక్ ఆర్మ్ ఉంటాయి. బ్యాటరీతో నడిచే అగ్రిబోట్‌ను టమాటా చేనులో పంపగానే పండిన టమాటాలను గుర్తించి కోస్తుంది. అలాగే వాటిని గ్రేడింగ్ చేసి ట్రేల(బాక్సులు)లో వేస్తుంది. పదిరోజుల్లో కూలీలు కోసే టమాటాలను అగ్రిబోట్ నాలుగు రోజుల్లో కోస్తుంది. టమాట సాగు చేసే రైతులకు ఉపయోగకరంగా ఉండాలన్న సంకల్పంతో అగ్రిబోట్ తయారు చేశామని ఫామ్ హెల్ప్ స్టార్టప్ కంపెనీ ప్రారంభించిన యువరాజ్, శివ తెలిపారు.

మెట్లు ఎక్కేందుకు 'హైలిట్ ఆటోమేషన్'

ఎత్తైన భవనాల్లోకి సామగ్రి, పరికరాలు, దివ్యాంగులను సులువుగా చేర్చేందుకు 'హైలిట్ ఆటోమేషన్' స్టార్టప్ కంపెనీ సెమి అటానమస్ యంత్రం తయారు చేసింది. అపార్టుమెంట్లు ఇతర భవనాల్లో లిఫ్టుల్లో చేరవేయలేని సామగ్రి, పరికరాలను సులువుగా మెట్ల మార్గం నుంచి తరలించేలా ఈ యంత్రాన్ని తయారు చేసింది. ఈ యంత్రంపై గృహ వినియోగ సామగ్రి, పరికరాలు, దివ్యాంగులు, వృద్ధులను ఉంచి మెట్లపైకి చేరిస్తే అది తనంతట తానుగా 50 అంతస్తులపైకి తీసుకువెళ్తుందని ఆవిష్కర్త నిక్కీ తక్కర్ తెలిపారు.

రిమోట్‌తో అల్ట్రాసౌండ్ స్కానింగ్..

అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రాలున్నప్పటికీ అత్యవసర సమయంలో రేడియాలజిస్టు లేకపోవడంతో గర్భిణులు, రోగులు ఇబ్బందులు పడుతుంటారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఐఐటీహెచ్‌కు చెందిన 'షెల్ఫ్ ఇన్నోవేషన్స్' స్టార్టప్ కంపెనీకి చెందిన ఐఐటీహెచ్ విద్యార్థి వివేక్ 'రోబోటిక్ అల్ట్రాసౌండ్ స్కానింగ్' యంత్రాన్ని తయారు చేశారు. హైదరాబాద్‌లో ఉన్న రేడియాలజిస్టు మండలకేంద్రంలో ఉన్న రోబోటిక్ అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రాన్ని రిమోట్ పద్ధతిలో వినియోగించి రోగులకు అవసరమైన స్కానింగ్ పరీక్షలు చేయవచ్చని, అత్యవసర పరిస్థితుల్లో ఇది రోగులకు ఎంతో ఉపయోగపడుతుందని ఆవిష్కర్త వివేక్ తెలిపారు.

వీధి వ్యాపారుల కోసం ఎలక్ట్రిక్ రిక్షా..

వీధి వ్యాపారులు కూరగాయలు ఇతర సరుకులను సులువుగా మార్కెట్‌కు తరలించేందుకు వీలుగా ఐఐటీ హెచ్ ఇంక్యుబేట్ చేసిన 'అమన్ ఆటో మోటివ్' స్టార్టప్ కంపెనీ ఎలక్ట్రిక్ రిక్షాను తయారు చేసింది. ఇది పూర్తిగా బ్యాటరీ ఆధారంగా నడుస్తుంది. ఒక్కసారి చార్జ్ చేస్తే గంటకు 45 కిలోమీటర్ల వేగంతో 100 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుంది. స్ట్రీట్ వెండర్ ఎలక్ట్రిక్ రిక్షా వాడటం వల్ల వీధి వ్యాపారులు తక్కువ ఖర్చులో తమ సరుకులను మార్కెట్‌కు తీసుకెళ్లవచ్చని ఆవిష్కర్తలు పరేశ్ మిస్త్రీ, సాత్విక్ రెడ్డి, గోపాల్ తెలిపారు.



ఆర్టీసీ బస్సు దగ్ధం.. ఇద్దరి పరిస్థితి విషమం

జడ్చర్ల, జూలై 15 : ఆర్టీసీ బస్సును డీసీఎం ఢీకొట్టిన ప్రమాదంలో బస్సు దగ్ధమైన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం మాచారం సమీపంలోని ఎన్‌హెచ్-44పై ఆదివారం రాత్రి 2 గంటల సమయంలో చోటుచేసుకున్నది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. ఏపీలోని సత్యసాయి జిల్లా ధర్మవరం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఆదివారం రాత్రి హైదరాబాద్ ఎంజీబీఎస్ నుంచి ధర్మవరానికి బయలుదేరింది. ఈ క్రమంలో మాచారం సమీపంలో హైవేపై యూటర్న్ తీసుకుంటున్న డీసీఎం ఆర్టీసీ బస్సును ఢీకొట్టడంతో అదుపుతప్పి కుడివైపున రోడ్డును దాటి కిందకు వెళ్లగా బస్సులో మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన ప్రయాణికులు అద్దాలను పగులగొట్టుకొని బయటపడ్డారు. జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి, ఎస్సై శివానందం, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. డ్రైవర్ సహా బస్సులో 37 మంది ప్రయాణిస్తుండగా.. 15 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో మహబూబ్‌నగర్ దవాఖానకు తరలించారు. వారిలో మైథిలి, లక్ష్మీదేవి పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. ఘటనా స్థలాన్ని ఎస్పీ జానకి ధరావత్, డీఎస్పీ వెంకటేశ్వర్లు పరిశీలించారు. జడ్చర్ల పోలీసులు కేసు నమోదు చేశారు.

వేధిస్తున్న కాల్‌డ్రాప్స్!

సర్వేలో 89 శాతం మంది వెల్లడి

న్యూఢిల్లీ, జూలై 15: ఫోన్ కాల్ మధ్యలోనే కట్ కావటం (కాల్ డ్రాప్) అనేది గత మూడు నెలల్లో 89 శాతం మందికి ఎదురైందని తాజా సర్వే ఒకటి తేల్చింది. దీంతో ప్రతి 10 మందిలో 9 మంది వైఫై నెట్‌వర్క్ ద్వారా ఫోన్ కాల్స్ చేశారు, ఇందుకోసం కాలింగ్, మెసేజింగ్, ఓటీటీ యాప్స్‌ను ఉపయోగించారని 'లోకల్ సర్కిల్స్' అనే సర్వే సంస్థ సోమవారం వెల్లడించింది. ఓటీటీతో వైఫై కాల్స్ గత రెండేండ్లలో పెరిగాయని పేర్కొన్నది. మార్చి-జూన్ మధ్య సర్వే నిర్వహించగా, 362 జిల్లాల నుంచి 32 వేల మంది పాల్గొన్నారని సర్వే సంస్థ తెలిపింది. 'ఫోన్ కాల్ కలవకపోవటం, కాల్ డ్రాప్ కావటం.. వంటి సమస్యలు ఎదురవుతున్నాయని సర్వేలో పాల్గొన్న 89 శాతం మంది చెప్పారు. తమ ఫోన్ కాల్స్‌లో 20 శాతానికిపైగా కాల్ డ్రాప్ అయ్యేవని 38 శాతం మంది చెప్పారు' అని సర్వే వివరించింది. కాల్ డ్రాప్ కారణంగా, అనేక మంది వాట్సాప్ వంటి మెసేజింగ్ యాప్‌లు ఆశ్రయించినట్టు చెప్పారు.

అటకెక్కిన ప్రాజెక్టులు

- కొత్త కంపెనీల ఏర్పాటులో కర్ణాటక కాంగ్రెస్ సర్కార్ ఫెయిల్
- 122 ప్రాజెక్టులకు అనుమతులు
- ప్రారంభమైనవి కేవలం 38 మాత్రమే
- అవినీతి, పారదర్శకతలేమే కారణం
- గత, ప్రస్తుత సర్కార్లదే బాధ్యత

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్(నమస్తే తెలంగాణ): 'సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియా'గా చెప్పుకొనే బెంగళూరు నగరానికి క్యూ కడుతున్న కంపెనీల సంఖ్య అంతకంతకూ తగ్గిపోతున్నది. పెట్టుబడులకు కేరాఫ్‌గా చెప్పుకొనే కర్ణాటక ఇప్పుడు తన ప్రాభవాన్ని క్రమంగా కోల్పోతున్నది. బీజేపీ, కాంగ్రెస్ పాలనలో గడిచిన ఐదేండ్ల వ్యవధిలో రాష్ట్రం అధోగతి పాలయ్యింది. ప్రభుత్వం విడుదల చేసిన తాజా గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.



పెట్టుబడులు ఫుల్.. ప్రారంభాలు నిల్

2018 నుంచి 2023 మధ్య రాష్ట్రానికి రూ. 4.29 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు వచ్చాయి. మొత్తంగా 122 భారీ ప్రాజెక్టులకు ప్రాథమికంగా అనుమతులు లభించాయి. దీంతో దాదాపు 3.52 లక్షల మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని అందరూ అంచనా వేశారు. అయితే, అనుమతులు లభించిన ప్రాజెక్టుల్లో కేవలం 38 ప్రాజెక్టులు (31.14 శాతం) మాత్రమే కార్యరూపం దాల్చాయి. మిగతా ప్రాజెక్టులన్నీ అటకెక్కాయి. మరికొన్ని పక్కరాష్ట్రాలకు తరలివెళ్లాయి. ఈ జాబితాలో ఐటీ సేవలు, ఈ-కామర్స్, తయారీ, ఏరోస్పేస్, ఫార్మా తదితర రంగాలకు చెందిన కంపెనీలు ఉన్నట్టు పారిశ్రామికరంగ నిపుణులు పేర్కొంటున్నారు.

కారణాలు ఇవే..

గత బీజేపీ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో పేరుకుపోయిన అవినీతి, తుది అనుమతుల్లో తీవ్ర జాప్యం, భూసేకరణ సమస్యలు, పారదర్శకతలేమి తదితర కారణాల వల్లే తొలుత పెట్టుబడులకు సుముఖంగా ఉన్న కంపెనీలు.. ఆ తర్వాత తమ నిర్ణయాన్ని మార్చుకొన్నట్టు పారిశ్రామికరంగ నిపుణులు చెప్తున్నారు. ఫలితంగా రూ. 3 లక్షల కోట్ల మేర పెట్టుబడులు, 2.5 లక్షల ఉపాధి అవకాశాలు కర్ణాటక ప్రజలకు దూరమైనట్టు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కేజ్రీవాల్ కోమాలోకి వెళ్లే ప్రమాదం

ఆయన ప్రాణానికి ముప్పు: సంజయ్ సింగ్

న్యూఢిల్లీ, జూలై 15: తీహార్ జైల్లో ఉన్న ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఆరోగ్య పరిస్థితి దిగజారుతున్నదని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాగే ఉంటే.. ఆయన కోమాలోకి వెళ్లిపోయే ప్రమాదముందని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ సోమవారం ఆందోళన వ్యక్తం చేశారు. కేజ్రీవాల్ ప్రాణానికి హాని తలపెట్టే కుట్ర మొదలైందని ఆరోపించారు. అరెస్టుకు ముందు 70 కిలోలున్న కేజ్రీవాల్, ఇప్పుడు 61.5 కిలోలకు తగ్గారని చెప్పారు. దీనికంటే ముందు, కేజ్రీవాల్ ఆరోగ్య పరిస్థితిపై ఆప్ వ్యక్తం చేసిన ఆందోళనల్ని తీహార్ జైలు అధికారులు ఖండించారు. ఆయన ఆరోగ్యం బాగానే ఉందని, వైద్య నిపుణులు నిరంతరం పరిశీలిస్తున్నారని తీహార్ జైలు అధికార వర్గాలు వెల్లడించాయి. కోర్టు ఆదేశాల ప్రకారం ఇంటి నుంచి తెప్పించిన ఆహారం అందిస్తున్నట్టు జైలు సూపరింటెండెంట్ తెలిపారు. దీనిపై స్పందించిన ఎంపీ సంజయ్ సింగ్, కేజ్రీవాల్ ఆరోగ్యంపై తీహార్ జైలు అధికారులు చెబుతున్నవాటిని కొట్టిపారేశారు. జైల్లో కేజ్రీవాల్ 8.5 కిలోల బరువు కోల్పోయారని, జూన్ 2 నుంచి 14 మధ్య 2 కిలోల బరువు తగ్గారని సంజయ్ సింగ్ తెలిపారు. కేజ్రీవాల్ షుగర్ స్థాయిలు 5 సార్లు పడిపోయినా, జైలు అధికారులు ఆ విషయాన్ని దాచిపెడుతున్నారని ఆరోపించారు.

ఎంబీబీఎస్ సీట్లు ఇప్పిస్తానని మోసం

- కర్ణాటకలో తెలంగాణ వ్యక్తి అరెస్టు
- విద్యార్థులకు రూ. లక్షలు టోకరా
- 20 లక్షల చొప్పున వసూలు
- పలు రాష్ట్రాల్లో ఇలాగే మోసాలు
- ముంబైలో దాక్కున్న నిందితుడు



ప్రకాశం

బెళగావి: ఎంబీబీఎస్ సీట్లు ఇప్పిస్తానంటూ పలు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులను లక్షల రూపాయల మేర మోసగించిన అరగొండ అలియాస్ అరవింద అరగొండ ప్రకాశంను కర్ణాటకలోని బెళగావి సీఈఎన్ పోలీసులు అరెస్టు చేశారు. ప్రకాశంను హైదరాబాద్‌లోని గచ్చిబౌలికి చెందిన నివాసిగా పోలీసులు గుర్తించారు. నిందితుడి వద్ద నుంచి రూ.12 లక్షల నగదు, ఐదు మొబైల్ ఫోన్లు, 12 మానిటర్లు, ఒక ల్యాప్‌టాప్ సీజ్ చేశారు. పెద్దమొత్తంలో డబ్బు ముట్టజెబితే.. ఎంబీబీఎస్ సీటు వచ్చేలా చేస్తానని ప్రకాశం పలు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులకు హామీ ఇచ్చి మోసం చేసినట్టు తెలుస్తున్నది. ప్రకాశం 2023లో బెళగావి పట్టణంలో నీట్ గైడెన్స్ సెంటర్‌ను ప్రారంభించారు. నీట్ తక్కువ స్కోర్ వచ్చిన అభ్యర్థులను టార్గెట్‌గా చేసుకొని, ఎంబీబీఎస్ సీట్లు వచ్చేలా చేస్తానని హామీ ఇచ్చేవాడు. తన మోసాన్ని సులభతరం చేసుకొనేందుకు విద్యార్థులను ఆకర్షించేందుకు ప్రకాశం పలువురు స్థానిక యువతను నియమించుకొన్నాడు. జిల్లాలోని కనీసం 10 మంది విద్యార్థులు ఈ మోసం బారిన పడ్డారని, ఒక్కొక్కరు కనీసంగా రూ.20 లక్షలు చొప్పున చెల్లించారని పోలీసు వర్గాలు తెలిపాయి.

విద్యార్థిని ఫిర్యాదుతో వెలుగులోకి

ఈ విధంగా మోసపోయిన బీదర్‌కు చెందిన ఒక విద్యార్థిని గత ఏడాది నవంబర్‌లో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అరవింద అరగొండ ప్రకాశం ఘరానా మోసం వెలుగులోకి వచ్చింది. తర్వాత పోలీసుల దర్యాప్తులో విస్తుగొల్పే విషయాలు బయటకు వచ్చాయి. ప్రకాశం తప్పుడు గుర్తింపుతో చెలామణి అవుతున్నట్టు పోలీసులు గుర్తించారు. ఆ తర్వాత ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి, దర్యాప్తును ముమ్మరం చేయగా.. ప్రకాశం ముంబైలో ఉన్నట్టు గుర్తించారు. అనంతరం పోలీసులు అతన్ని బెళగావికి తీసుకొచ్చి కోర్టు ముందు ప్రవేశపెట్టారు.

తెలంగాణలో ఆరు కేసులు

ప్రకాశంపై తెలంగాణలో ఆరు కేసులు, మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఒకటి, బెంగళూరులో రెండు కేసులు నమోదయ్యాయి. డీసీపీ రోహన్ జగదీశ్ మాట్లాడుతూ దర్యాప్తు కొనసాగుతున్నదని, మోసపోయిన విద్యార్థులు, వారి కుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ప్రకాశం మోసాల బారిన పడిన బాధితులు ముందుకు రావాలని, దర్యాప్తులో సహకరించాలని కోరారు.

అనారోగ్యకర ఆహార ఉత్పత్తుల ప్రమోషన్ వద్దు

న్యూఢిల్లీ: చక్కెర, ఉప్పు, కొవ్వు పదార్థాలు అధిక మోతాదులో ఉన్న అనారోగ్యకర ఆహార ఉత్పత్తులను ప్రమోట్ చేయవద్దంటూ 16 మంది సెలబ్రిటీలకు వైద్యులు, న్యూట్రిషనిస్టులతో కూడిన న్యూట్రిషన్ అడ్వకసీ ఇన్ పబ్లిక్ ఇంట్రెస్ట్ బహిరంగ లేఖ రాసింది. వీరిలో బాలీవుడ్, క్రికెట్ స్టార్లు ఉన్నారు.

పేరు మార్చుకుని 11 సార్లు సివిల్స్ పరీక్షకు

ముంబై, జూలై 15 (నమస్తే తెలంగాణ): ట్రైనీ ఐఏఎస్ అధికారిణి పూజా ఖేద్కర్ పేరు మార్చుకుని సివిల్స్ పరీక్షకు హాజరయ్యారని తెలుస్తున్నది. ఇప్పటి వరకు 11 సార్లు పరీక్షకు హాజరైనట్టు సమాచారం. 2020-21 వరకు ఖేద్కర్ పూజా దిలీప్ రావుగా పరీక్షలకు హాజరయ్యారు. 9 సార్లు పరీక్ష ప్రయత్నాలను పూర్తి చేసిన తర్వాత.. పూజా మనోరమ దిలీప్ ఖేద్కర్‌గా పేరు మార్చుకుని మరో రెండు సార్లు పరీక్షకు హాజరైనట్టు తెలిసింది. నిబంధనల ప్రకారం, ఓబీసీ క్యాటగిరీ అభ్యర్థి తొమ్మిది సార్లు పరీక్ష రాయవచ్చు.

రెండు రోజులుగా లిఫ్ట్‌లో చిక్కుకున్న రోగి

తిరువనంతపురం: కేరళలో 59 ఏండ్ల ఓ వ్యక్తి వైద్య చికిత్స కోసం తిరువనంతపురం ప్రభుత్వ దవాఖానకు వచ్చి.. అనూహ్యంగా అక్కడి లిఫ్ట్‌లో చిక్కుకుపోయాడు. అదే సమయంలో అతడి మొబైల్ ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ అయ్యింది. 'అలారం' బటన్ నొక్కినా బయట నుంచి అతడికి సాయం అందలేదు. శనివారం లిఫ్ట్‌లో చిక్కుకుపోయిన బాధితుడు సోమవారం ఎట్టకేలకు బయటపడ్డాడు.

ఇమ్రాన్ ఖాన్ పార్టీపై నిషేధం!

ఇస్లామాబాద్: దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నదన్న ఆరోపణలపై మాజీ ప్రధాని ఇమ్రాన్ పార్టీ పాకిస్థాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్(పీటీఐ)పై నిషేధం విధించనున్నట్టు పాకిస్థాన్ ప్రభుత్వం సోమవారం వెల్లడించింది. విదేశీ నిధుల కేసు, మే 9 నాటి అల్లర్లు తదితర అంశాలు పీటీఐ నిషేధానికి సాక్ష్యాలుగా పనికి వస్తాయని పేర్కొంది.

ఇంజినీరింగ్‌లో మరో 10వేలకు పైగా సీట్లు

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): బీటెక్‌లో మరో 10వేలకు పైగా సీట్లు పెరగనున్నాయి. 7-8 వేల వరకు సీట్ల కన్వర్షన్‌కు అనుమతినిచ్చిన ఉండగా, మరికొన్ని సీట్ల పెంపునకు సంబంధించినవి ఉన్నాయి. ఆయా సీట్లకు సోమవారం ప్రభుత్వం అనుమతినిచ్చింది. దీంతో ఎప్‌సెట్ మొదటి విడత వెబ్ ఆప్షన్ల నమోదు గడువును 17 వరకు పొడిగించారు. వెబ్ కౌన్సెలింగ్‌కు హాజరైన వారంతా వెబ్‌ఆప్షన్లు నమోదుచేసుకోవచ్చని సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన తెలిపారు. సోమవారం వరకు 93,167 మంది వెబ్ ఆప్షన్లు ఎంచుకున్నట్టు శ్రీదేవసేన తెలిపారు.

డీఎస్సీ హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): డీఎస్సీ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న వారు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి ఒక ప్రకటనలో కోరారు. హాల్‌టికెట్లను వెబ్‌సైట్‌లో పొందుపరిచామని తెలిపారు. 18 నుంచి ఆగస్టు 5 వరకు డీఎస్సీ పరీక్షలు జరగనున్నాయి.

వారంలో బీటెక్ ఫీజుల పెంపునకు నోటిఫికేషన్!

2025 - 28 విద్యా సంవత్సరానికి కొత్త ఫీజులు

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): 2025-26, 2026-27, 2027-28 సంవత్సరాల ఫీజుల సవరణకు తెలంగాణ అడ్మిషన్స్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ(టీఏఎఫ్‌ఆర్‌సీ) వారంలో నోటిఫికేషన్ జారీచేయనుంది. ఇప్పుడు అడ్మిషన్లు పొందే వారికి పాత ఫీజులే వర్తించనుండగా, వచ్చే విద్యాసంవత్సరం నుంచి కొత్త ఫీజులు అమల్లోకి వస్తాయి. అక్టోబర్ 30 వరకు కాలేజీలు ప్రతిపాదనలు సమర్పించేందుకు అవకాశమిచ్చి, నవంబర్, డిసెంబర్‌లో కాలేజీలను ప్రత్యక్ష విచారణకు పిలుస్తారు. ఇంజినీరింగ్‌తోపాటు ఎంబీఏ, ఎంసీఏ, ఫార్మసీ, బయోటెక్నాలజీ ఫీజులను పెంచుతారు. సోమవారం మాసాబ్‌ట్యాంక్‌లోని టీఏఎఫ్‌ఆర్‌సీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో చైర్మన్ జస్టిస్ గోపాల్‌రెడ్డి, ఓయూ, జేఎన్టీయూ రిజిస్ట్రార్లు లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్‌రావు, ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్ వెంకటరమణ, కార్యదర్శి వెంకటేశ్ హాజరై చర్చించారు.

చదువుల్లో నిమగ్నమయ్యేలా.. సహకరించరూ!

- తల్లిదండ్రులకు విద్యాశాఖ సూచనలు జారీ
- ప్రతి నెలా మూడో శనివారం పేరెంట్ టీచర్ సమావేశాలు

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): విద్యార్థులు ఇంట్లో చదువుకునేందుకు రీడింగ్ కార్నర్లు ఏర్పాటు చేయాలి. ఇంట్లో సక్రమంగా చదువుకునే వాతావరణాన్ని కల్పించాలి. శబ్దాలు రాకుండా, అంతరాయం కలగకుండా టీవీ, రేడియో, మొబైల్‌ఫోన్లను ఆఫ్‌చేయాలి. ఇవి విద్యార్థుల తల్లిదండ్రులకు విద్యాశాఖ జారీచేసిన సూచనలు. నూతన విద్యాసంవత్సరం ప్రారంభంకావడంతో అకడమిక్ అంశాలపై విద్యాశాఖ దృష్టిసారించింది. పాఠశాల సహా పిల్లల చదువుల్లో తల్లిదండ్రులను సైతం భాగస్వామ్యం చేసేందుకు పాఠశాల విద్యాశాఖ చొరవ తీసుకుంటోంది. ప్రతి నెలా మూడో శనివారం బడుల్లో పేరెంట్ టీచర్ సమావేశాలను నిర్వహిస్తుంది. 'పేరెంట్ యాజ్ పార్ట్‌నర్స్' థీమ్‌తో 20న రాష్ట్రంలోని అన్ని సర్కారు బడుల్లో పేరెంట్ టీచర్ సమావేశాలను నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్, సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి ఆదేశించారు. తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. ఆయా జాగ్రత్తలను తల్లిదండ్రులకు వివరించాలని, పాటించేలా చూడాలని హెచ్‌ఎంలకు ఆదేశాలిచ్చారు.



తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఇంటిని శుభ్రంగా ఉంచడం, వెలుతురు బాగా వచ్చే స్థలంలో రీడింగ్ కార్నర్‌ను ఏర్పాటు చేయడం.
- టీవీ, ఆరుబయట శబ్దాలు వినిపించని చోట రీడింగ్ కార్నర్‌ను ఏర్పాటు చేయాలి.
- ప్రతి రోజు రీడింగ్ కార్నర్‌లో పిల్లలు చదివేలా, గడిపేలా ప్రోత్సహించడం.
- పిల్లల ఏకాగ్రత దెబ్బతినకుండా టీవీ, రేడియో, మొబైల్‌ఫోన్ వంటి వాటిని ఆఫ్‌చేయడం.
- వారు చేయాల్సిన పనులను నిర్దేశించి, పనిపూర్తిచేసిన వెంటనే టిక్‌మార్కు పెట్టమని సూచించడం.
- రోజు బడిలో ఏం నేర్చుకున్నారో, హోం వర్క్ పూర్తి చేశారో లేదో తెలుసుకోవడం.
- ప్రతి రోజు నచ్చిన పుస్తకం నుంచి రెండు పేజీలు బిగ్గరగా చదవమని ప్రోత్సహించడం.
- సామర్థ్యాల సాధనకు ఇంటింటా చదువుల పంట యాప్‌ను ఉపయోగించడం.

ఉచిత శిక్షణకు 18న స్పాట్ అడ్మిషన్లు

హైదరాబాద్, జూలై15 (నమస్తే తెలంగాణ): ఉచిత ఉద్యోగ, ఉపాధి శిక్షణకు తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ యువతకు 18న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నది. తెలంగాణ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఫర్ నర్సింగ్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ సీహెచ్ సైదులు సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. 3 నెలల వ్యవధితో ఫార్మసీ అసిస్టెంట్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ కోర్సులకు సంబంధించి ఎస్సెస్సీ అర్హత ఉండాలని వివరించారు. 12 నెలల అడ్వాన్స్ డయాలసిస్ టెక్నీషియన్ కోర్సుకు ఇంటర్ పూర్తి చేసి ఉండాలని తెలిపారు. 18 -35 ఏండ్ల నిరుద్యోగులు 18న వనస్థలిపురం బాటా షోరూం, 4వ ఫ్లోర్‌లో నిర్వహించే స్పాట్ అడ్మిషన్లకు నేరుగా హాజరుకావాలని కోరారు. వివరాలకు 98485 81100, 90599 02355 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కాంట్రాక్టు పద్ధతిలో ఎగ్జిక్యూటివ్, డిజైనర్ పోస్టులు

హైదరాబాద్, జూలై 15(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని చేనేత జౌళి శాఖలో 8 క్లస్టర్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్, 22 టెక్స్‌టైల్ డిజైనర్ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసేందుకు ఆ శాఖ సోమవారం నోటిఫికేషన్ జారీచేసింది. మూడేండ్లకు గాను మొదటి సంవత్సరం నియామకం చేసి పనితీరు ఆధారంగా పొడిగిస్తారు. సీడీఈ పోస్టులకు ఐఐహెచ్‌టీ నుంచి చేనేత టెక్నాలజీలో డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు రెండేళ్ల సీడీఈగా పనిచేసిన అనుభవం ఉండాలి. టెక్స్‌టైల్ డిజైనర్ పోస్టులకు నిఫ్ట్/ఎన్‌ఐడీ లేదా పేరున్న సంస్థ నుంచి డిజైనింగ్‌లో ఉత్తీర్ణతతోపాటు రెండేళ్ల అనుభవం ఉండాలి. నెలకు రూ.24,000 వేతనం ఇస్తారు. ఔత్సాహికులు 21 రోజుల్లోగా నాంపల్లిలోని చేనేత జౌళి శాఖ కార్యాలయంలో బయోడేటా ఇవ్వాల్సి ఉంటుంది.

బీ క్యాటగిరీ సీట్ల అక్రమ భర్తీకి చెక్ పడేనా?

- నోటిఫికేషన్ రాకముందే సీట్ల భర్తీ
- ఆన్‌లైన్, నోటీస్ బోర్డుల్లో వివరాలు చూపని కాలేజీలు
- చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల డిమాండ్

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): బీటెక్ మేనేజ్‌మెంట్, ఎన్నారై కోటా సీట్ల భర్తీలో అక్రమాలకు పాల్పడుతున్న కాలేజీలపై ఈ ఏడాదైనా సర్కారు కొరడా ఝుళిపించాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి. బీ క్యాటగిరీ సీట్ల భర్తీకి జారీచేసే నిబంధనలను పాటించేలా చూడాలని డిమాండ్ చేస్తున్నాయి. నిబంధనల ప్రకారం కాలేజీలు మూడు భాషల దినపత్రికల్లో నోటిఫికేషన్ జారీ చేయాలి. ఆయా నోటిఫికేషన్‌లో వివరాలను ప్రస్ఫుటంగా పేర్కొనాలి. యాజమాన్యాలు ఆఫ్‌లైన్ లేదా ఆన్‌లైన్‌లో వచ్చే దరఖాస్తులన్నింటినీ స్వీకరించాలి. కోర్సుల వారీగా దరఖాస్తు చేసిన విద్యార్థుల జాబితాను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడంతోపాటు, నోటీస్‌బోర్డులోనూ పొందుపరచాలి. కానీ ఈ నిబంధనలు కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయి. నోటిఫికేషన్ రాకముందే పలు కాలేజీల్లో సీట్ల కోసం వెళితే లేవన్న మాటలే వినిపిస్తున్నాయి. అంటే నోటిఫికేషన్‌కు ముందే సీట్లు భర్తీ అయిపోయాయి. దీనిపై విద్యార్థి సంఘాలు భగ్గుమంటున్నాయి. కాగా, ఇంజినీరింగ్ బీ క్యాటగిరీ సీట్ల భర్తీకి వారంలో నోటిఫికేషన్ విడుదలకానుంది. కన్వీనర్ కోటా మొదటి విడత సీట్లను 19లోపు కేటాయిస్తారు. బీ క్యాటగిరీ సీట్ల భర్తీకి ఉన్నత విద్యామండలి నోటిఫికేషన్‌ను జారీచేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటుంది.

• 'బాస్ లేరు.. మనకేంటి?'



భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణికి కలెక్టర్ జితేష్ వీ పాటిల్ హాజరుకాకపోవడంతో అధికారులు ముచ్చట్లు పెట్టుకోవడం పలు విమర్శలకు దారితీసింది. అదనపు కలెక్టర్ విద్యాచందన, ఏవో గన్యానాయక్ ప్రజల దరఖాస్తులను స్వీకరించి పరిశీలిస్తుండగా జిల్లా అధికారులు మాత్రం ఫోన్లు చూసుకుంటూ సొంత పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేసిన అధికారుల తీరుపై ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. - భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ

ఓటరు జాబితా ఆధారంగా బీసీగణన

> మొదటిపేజీ తరువాయి...

దాటకుండా రిజర్వేషన్ అమలు చేయాలని నిర్ణయించినట్టుగా విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఈ మేరకు సోమవారం పంచాయతీరాజ్, బీసీ కమిషన్ అధికారులతో జరిగిన సమావేశంలో ప్రాథమికంగా ఒక అంచనాకు వచ్చినట్టు సమాచారం. బీహార్ సహా పలు రాష్ట్రాల్లో కులగణన చేసి బీసీలకు రిజర్వేషన్లు పెంచినా కోర్టులు ఆ రిజర్వేషన్లను కొట్టివేశాయి. రిజర్వేషన్లు 50 శాతానికి మించవద్దని స్పష్టం చేశాయి. రాజ్యాంగం ప్రకారం 50 శాతం రిజర్వేషన్‌లు దాటవద్దని సుప్రీం కోర్టు కూడా తీర్పు ఇచ్చినందున బీసీలకు 24 శాతం కంటే ఎక్కువ సాధ్యం కాదని ప్రాథమికంగా ఒక నిర్ణయానికి వచ్చారు. స్థానిక సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను ఓటరు జాబితా ప్రకారం తేల్చాలని ప్రాథమికంగా ఒక అవగాహనకు ప్రభుత్వం వచ్చినట్టు సమాచారం. దీనిపై త్వరలోనే అధికారికంగా నిర్ణయం తీసుకొని రిజర్వేషన్లను ఖరారు చేయనున్నది. ఓటరు జాబితా ఆధారంగా వేసిన లెక్కల్లో ఎస్సీ, ఎస్టీలకు ఎంత జనాభా ఉంటే అంత రిజర్వేషన్‌ను ఆయా పంచాయతీలు, మండలాలు, జిల్లాలను ప్రాతిపదిక తీసుకొని అమలు చేస్తారు. 50 శాతంలో మిగిలిన రిజర్వేషన్‌ను బీసీలకు కేటాయిస్తారు. దీని ద్వారా సగటున బీసీలకు 24 శాతం మించకపోవచ్చని సామాజిక వేత్తలు అంచనా వేస్తున్నారు. గతంలో కూడా ఇదే విధానాన్ని అమలు చేశారని గుర్తుచేస్తున్నారు. గ్రామ స్థాయిలో అందుబాటులో ఉన్న గ్రామ కార్యదర్శులు, అంగన్‌వాడీ, ఆశావర్కర్ల ద్వారా పార్లమెంట్ ఎన్నికల ఓటరు జాబితాను ప్రామాణికంగా చేసుకొని లెక్కలు తీయనున్నారు. దీంతో బీసీలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీ ఉత్తి మాటే కానున్నదని బీసీ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అయితే పంచాయతీలు, మండలాలు, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల్లో ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లు పూర్తిగా మారే అవకాశాలు ఉంటాయని అధికారులు చెప్తున్నారు.

పారిశుద్ధ్య కార్మికుల వేతనాలకు నిధులు విడుదల

బీఆర్ఎస్ పోరాటానికి స్పందించిన ప్రభుత్వం

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): పంచాయతీరాజ్ పారిశుద్ధ్య కార్మికుల పట్ల ప్రభుత్వం ఎట్టకేలకు కనికరం చూపింది. బీఆర్ఎస్ అనేక పోరాటాలు, ప్రభుత్వానికి విజ్ఞప్తులు, సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ పర్యవసానంతో వారి వేతనాలకు అవసరమైన నిధులను విడుదల చేసింది. సోమవారం జీపీలకు రూ.150 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మొత్తాన్ని రాష్ట్రంలోని 29,676 మంది పారిశుద్ధ్య కార్మికుల వేతనాలను చెల్లించాలని సూచించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామ పంచాయతీలకు ఒక్క పైసా నిధులు విడుదల చేయలేదు. దీంతో గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు కూడా ఇవ్వలేని పరిస్థితి దాపురించింది. దీంతో వారు గ్రామ పంచాయతీ, కలెక్టరేట్ల ముందు ఆందోళన చేశారు. భిక్షాటన చేశారు. ఈ సమస్యలన్నింటిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ బహిరంగ లేఖ రాసింది. పారిశుద్ధ్య కార్మికులకు సంఘీభావాన్ని ప్రకటించి, ప్రభుత్వాన్ని తీవ్ర స్థాయిలో తప్పుపట్టింది. దీంతో ఎట్టకేలకు ప్రభుత్వంలో కదలిక వచ్చింది. మే వరకు వేతనాలను చెల్లించేలా నిధులను విడుదల చేసింది. అయితే ట్రాక్టర్ నిర్వహణ, ఇతర పనులకు నిధులు విడుదల చేయలేదు.

బీసీ రిజర్వేషన్లపై యాక్షన్ ప్లాన్

- కులగణన ఆధారంగా ఎన్నికలకు వెళ్తే ఎలా ఉంటుంది?
- పంచాయతీ ఎన్నికలపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపుపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. పంచాయతీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు అంశంపై సచివాలయంలో సీఎం అధ్యక్షతన సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ల అమలు, రాబోయే ఎన్నికల్లో వాటి పెంపునకు సంబంధించిన అంశాలను వెల్లడించాలని అధికారులకు సీఎం సూచించారు. గత పంచాయతీ ఎన్నికల్లో అనుసరించిన విధానం, దానివల్ల పంచాయతీ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న తీరును రేవంత్‌కు అధికారులు వివరించారు. ఇప్పటికే కులగణనకు ఆమోదం తెలిపినందున, దాని ఆధారంగా పంచాయతీ ఎన్నికలకు వెళితే ఎలా ఉంటుందని, అందుకు ఎంత సమయం తీసుకుంటారని అధికారులను సీఎం ప్రశ్నించారు. కర్ణాటకలో 2015లో, బీహార్‌లో 2023లో కుల గణన చేశారని, ఆంధ్రప్రదేశ్‌లో కులగణన చేసినా వివరాలు ఇంకా బయటపెట్టలేదని అధికారులు వివరించారు. 2011లో కేంద్ర ప్రభుత్వం అనుసరించిన కులగణన ఫార్మాట్ 53 కాలమ్స్‌తో ఉన్నదని, దానికి మరో మూడు కాలమ్స్ జోడించి కులగణన చేసేందుకు దాదాపు ఐదారు నెలల సమయం పడుతుందని తెలిపారు. బీసీ రిజర్వేషన్ల పెంపుతో పాటు స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు ఆగిపోకుండా త్వరగా ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన ప్రణాళిక సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. ఈ సమావేశంలో రిజర్వేషన్ల పెంపు అంశంపై సుదీర్ఘ చర్చ సాగింది.

సందేహాలుంటే జానారెడ్డిని సంప్రదించండి

ఉమ్మడి రాష్ట్రం నుంచి తెలంగాణలో జరిగిన పంచాయతీ ఎన్నికల వరకు అనుసరించిన విధానాలు, వివిధ రాష్ట్రాల స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో దాఖలైన కేసులు, వాటి తీర్పులు, పర్యవసానాలను మాజీ మంత్రి జానారెడ్డి వివరించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ.. పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ల అమలుకు ఇప్పటి వరకు అనుసరించిన విధానాలపై కాలక్రమపట్టిక రూపొందించాలని, ఏమైనా సందేహాలు వస్తే మాజీమంత్రి జానారెడ్డితో పాటు పంచాయతీరాజ్‌శాఖ నిపుణులు, మాజీ ఉన్నతాధికారుల సలహాలు తీసుకోవాలని, చట్టపరమైన విషయాల్లో అడ్వకేట్ జనరల్‌తో చర్చించాలని సూచించారు. మిగతా రాష్ట్రాలు రిజర్వేషన్ల విషయంలో అనుసరిస్తున్న విధానాలపై అధ్యయనం చేయాలని ఆదేశించారు. త్వరగా ఆయా అంశాలపై నివేదిక రూపొందిస్తే కేబినెట్ సమావేశానికి ముందే మరోసారి సమావేశమై ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకుందామని అన్నారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ముఖ్యమంత్రి సలహాదారు వేంనరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, మాజీ మంత్రి కే జానారెడ్డి, బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ రిజర్వేషన్ల పెంపు సాధ్యాసాధ్యాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. సమావేశంలో సీఎస్ శాంతికుమారి, సీఎం ముఖ్య కార్యదర్శి వీ శేషాద్రి, ముఖ్యమంత్రి కార్యదర్శి డాక్టర్ జీ చంద్రశేఖర్‌రెడ్డి, బీసీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, పంచాయతీరాజ్‌శాఖ కార్యదర్శి డీఎస్ లోకేశ్‌కుమార్, న్యాయశాఖ కార్యదర్శి రెండ్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కుంభవృష్టి కురిసినా కరెంటు పోవద్దు: భట్టి

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కుంభవృష్టి కురిసినా విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూసుకోవాలని విద్యుత్ అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. సోమవారం ఆయన సచివాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈదురుగాలులు వీచినా, భారీ వర్షం ముంచెత్తినా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమీక్షలో ఇంధన శాఖ కార్యదర్శి రొనాల్డ్ రోస్, ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అధికారులతో సీఎం సమావేశం

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర అధికారులతో సమావేశం కానున్నారు. సచివాలయంలోని 7వ అంతస్తులో ఈ సమావేశం జరుగనున్నది. ప్రజాపాలన దరఖాస్తులు, ధ రణి, వానకాలం పంటలు, సీజనల్ వ్యాధులు, వన మహోత్సవం, విద్యారంగం, మహిళా శక్తి క్యాంటీన్లు, శాంతిభద్రతలు, యాంటీ డ్రగ్ క్యాంపెయిన్‌పై చర్చించనున్నారు.



ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం జల్లేపల్లిలోని వీధిలో పెంట కుప్పను పరిశీలిస్తూ వెళ్తున్న మంత్రి పొంగులేటి

కాంగ్రెస్ వచ్చేనాటికి అప్పు 7 లక్షల కోట్లు

- ప్రభుత్వానికి నిధుల కొరత
- 'జల్లేపల్లి' జ్వరపీడితుల పరామర్శలో మంత్రి పొంగులేటి

తిరుమలాయపాలెం, జూలై 15: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేనాటికి రాష్ట్రానికి రూ.7 లక్షల కోట్ల అప్పు ఉన్నదని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రస్తుతం నిధుల కొరత ఉన్నా గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు అత్యవసరమని భావిస్తున్నట్టు తెలిపారు. అందుకోసం ముఖ్యమంత్రి, మంత్రులతో మాట్లాడి పంచాయతీలకు నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఖమ్మం తిరుమలాయపాలెం మండలం జల్లేపల్లిలో కొద్దిరోజులుగా ఇంటికి ఒకరిద్దరు చొప్పున జ్వరాలతో బాధపడుతుండటంతో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో కలిసి సోమవారం ఆయన ఆ గ్రామాన్ని సందర్శించారు. కాలనీల్లో కలియదిరిగి పరిసరాల వీధులను పరిశీలించారు. జ్వర పీడితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మంత్రి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ప్రభుత్వం గ్రామాల్లోని ప్రజలందరికీ అండగా ఉంటుందని అన్నారు. జల్లేపల్లిలో జ్వరాలతో బాధపడుతున్న వారిని గుర్తించి మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు.

'కాళేశ్వరం'లో మీ పాత్ర ఏమిటి?

పలువురు ఐఏఎస్‌లు, మాజీ ఐఏఎస్‌లను ప్రశ్నించిన కమిషన్

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సోమవారం పలువురు ఐఏఎస్‌లు, మాజీ ఐఏఎస్‌లను విచారించింది. 'కాళేశ్వరం ప్రాజెక్టులో మీ పాత్ర ఏమిటి?, అనుమతులు, ఆర్థిక అంశాల్లో మీరు ఎలాంటి పాత్ర పోషించారు?' అని ప్రశ్నించినట్టు తెలిసింది. ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఐఏఎస్ అధికారులు రాహుల్ బొజ్జా, స్మితా సబర్వాల్, వికాస్ రాజ్, మాజీ ఐఏఎస్‌లు సోమేశ్ కుమార్, రజత్‌కుమార్, ఎస్కే జోషి విచారణకు హాజరయ్యారు. వీరిలో ఎస్కే జోషి ఆన్‌లైన్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. ప్రాజెక్టు ప్రారంభం నుంచి అనేక కోణాల్లో వారిని ప్రశ్నించినట్టు సమాచారం. వివరాలను అఫిడవిట్ రూపంలో వారం రోజుల్లోగా అందజేయాలని సూచించినట్టు తెలిసింది. బడ్జెట్ సమావేశాలు ఉండడంతో గడువు కావాలని రామకృష్ణారావు కోరగా, ఆగస్టు 5వరకు సమయం ఇచ్చినట్టు సమాచారం. విద్యుత్ శాఖ ఇంజినీర్ కే రఘు కూడా కమిషన్ ముందు హాజరయ్యారు.

అభిప్రాయ సేకరణలో రైతులేరి ?

- రైతు భరోసాపై మంత్రుల కమిటీ అభిప్రాయ సేకరణ
- ముందుగా ఎంపిక చేసిన వారికే మాట్లాడే అవకాశం
- అభిప్రాయాలు చెప్పింది కాంగ్రెస్ ప్రజాప్రతినిధులే
- తమనెందుకు పిలిచారని రైతుల ఆగ్రహం



హనుమకొండ కలెక్టరేట్‌లో 'రైతు భరోసా' అభిప్రాయ సేకరణలో పాల్గొన్న మంత్రులు

వరంగల్, జూలై 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రైతు భరోసా పథకం అమలు కోసం రైతుల అభిప్రాయం తీసుకుంటామంటూ ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలకు, వాస్తవ పరిస్థితులకు మధ్య ఏమాత్రం పొంతన కుదరడం లేదు. పంట పెట్టుబడి సాయంగా రైతులకు ప్రభుత్వం ఇవ్వనున్న రైతు భరోసాపై విధి విధానాల రూపకల్పన కోసం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆధ్వర్యంలోని మంత్రుల కమిటీ సోమవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో అభిప్రాయ సేకరణ చేపట్టింది. హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల రైతులతో సమావేశం నిర్వహించినట్టు అధికారులు తెలిపారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, సీతక్క పాల్గొన్నారు. రైతుల నుంచి అభిప్రాయ సేకరణ అని చెప్పినప్పటికీ, అధికారులు ముందుగా రూపొందించిన జాబితాలో పేర్కొన్న వారికి మాత్రమే మాట్లాడే అవకాశం కల్పించారు. ఒక్కో అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి ఇద్దరికి చొప్పున ఈ జాబితాలో చోటు కల్పించారు. స్థానిక ఎమ్మెల్యేలు సూచించిన పేర్లను అధికారులు జాబితాలో రాశారు. వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద రైతుల పేరు, ఊరు, మండలం, జిల్లా వివరాలు ప్రకటించగానే ఆ వ్యక్తి అభిప్రాయం చెప్పారు. అధికారులు తయారుచేసిన జాబితాలో అందరూ కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు, ఆ పార్టీకి చెందిన పీఏసీఎస్ చైర్మన్లు, డైరెక్టర్లు ఉన్నారు. అభిప్రాయ సేకరణ కార్యక్రమంలో వారు ఏం మాట్లాడాలో అధికారులే వీరికి స్పష్టంగా చెప్పారు. పేరు పిలిచిన వారే మాట్లాడాలని, మిగిలినవారు ఎవరూ లేచి మాట్లాడవద్దని కలెక్టర్ పలుమార్లు ఆదేశించారు. దీంతో విసిగిపోయిన రైతులు ఆ మాత్రానికి తమనెందుకు పిలిచారని ప్రశ్నించారు. మంత్రి తుమ్మల జోక్యం చేసుకుని జాబితాలో లేని మరో నలుగురితో మాట్లాడించారు. రైతుల అభిప్రాయాలు అని చెప్పి సమావేశానికి వచ్చిన కాకతీయ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్, ప్రస్తుత పాలకమండలి సభ్యుడితోనూ మాట్లాడించారు. రైతు భరోసా విస్తృతస్థాయి సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కొన్నిందర్సు, కార్పొరేటర్లు, కార్పొరేషన్ చైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను మాత్రమే అనుమతించారని అఖిల భారత రైతు సమాఖ్య హనుమకొండ జిల్లా కార్యదర్శి ఎస్ రెడ్డిహంసరెడ్డి, అఖిలభారత వ్యవసాయ కార్మిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోని కుమారస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు.

- అభిప్రాయ సేకరణలో అధికారులు మాట్లాడించిన వారు
- బొంపెల్లి దేవేందర్‌రావు, పర్వతగిరి, వర్ధన్నపేట - కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు
- తక్కళ్లపల్లి రవీందర్‌రావు, ఖానాపూర్, నర్సంపేట - మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా అధికార ప్రతినిధి
- పున్నం రవి - రేగొండ మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు(రవి భార్య లక్ష్మి, తాజా మాజీ ఎంపీపీ)
- బీంరెడ్డి కరుణాకర్‌రెడ్డి - ధర్మసాగర్, మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ నాయకుడు
- గంగం బుచ్చిరెడ్డి- బచ్చన్నపేట, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్
- మర్రి సందీప్- కాంగ్రెస్ యూత్ నాయకుడు
- చిట్టిబాబు - యూత్ కాంగ్రెస్ నాయకుడు, వర్ధన్నపేట నియోజకవర్గం
- ఆదిరెడ్డి, దేవన్నపేట - ఆత్మ మాజీ చైర్మన్, హసన్‌పర్తి

ప్రజాభిప్రాయమే సర్కారు జీవో

ప్రజాభిప్రాయం ప్రకారమే రైతు భరోసా పథకం అమలు మార్గదర్శకాలను రూపొందిస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, వ్యవసాయమంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు అభిప్రాయ సేకరణలో వచ్చిన అంశాలతోనే రైతు భరోసాపై ఉత్తర్వులు జారీ చేస్తామని చెప్పారు. రైతు భరోసా మార్గదర్శకాలపై ఉమ్మడి జిల్లాల వారీగా అభిప్రాయ సేకరణ జరుపుతున్నామని, ఈ అభిప్రాయాలపై శాసనసభలో చర్చించి తీర్మానం చేయనున్నట్టు చెప్పారు.

ప్రతి రైతుకు 'భరోసా' ఇవ్వాల్సిందే

> మొదటిపేజీ తరువాయి...

నిబంధన పెడితే చాలా భూములు లీడుబారిపోతాయి. సాగుచేసే భూమికే ఇస్తామంటే 30, 50 ఎకరాలు ఉన్నవారు ఖాళీగా ఉంచకుండా కౌలుకు ఇస్తారు. భూమి ఉన్న రైతులకే పథకం అందించాలి. రైతు పడే కష్టంలో రైతు భరోసా చిన్న పెట్టుబడి మాత్రమే. పంట నష్టపోతే పరిహారం ఇవ్వాలి. పండ్లు, కూరగాయల తోటలు పెట్టేలా రైతులను ప్రోత్సహించాలి. క్షేత్రస్థాయిలోకి వెళ్లి ఏ రైతు ఏ పంట వేస్తున్నాడన్న వివరాలు సేకరించి అర్హులకు రైతు భరోసా అమలు చేయాలి. వర్షాలు పడితే తొవ్వలు ఇబ్బందిగా ఉంటున్నాయి. గ్రామాల్లో సీసీ రోడ్లు వేయడం కాదు, బాయిలకాడికి వెళ్లేందుకు కూడా రోడ్లు వేయాలి. కూరగాయల విత్తనాలను సబ్సిడీపై అందించాలి" అని రమాదేవి కోరారు.

ఎస్ఓసీలపై 4 వారాల్లో కౌంటర్ వేయండి

ఏపీ ప్రభుత్వానికి బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ ఆదేశం

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): కృష్ణా జలాల పంపిణీకి సంబంధించిన స్టేట్‌మెంట్ ఆఫ్ కేస్ (ఎస్ఓసీ)లపై ఏపీ ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేసేందుకు బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ 4 వారాల సమయం ఇచ్చింది. కౌంటర్ దాఖలుకు ఇదే చివరి అవకాశమని సోమవారం జరిగిన విచారణలో ట్రిబ్యునల్ చైర్మన్ జస్టిస్ బ్రిజేశ్ కుమార్ స్పష్టం చేశారు. తదుపరి విచారణను ఆగస్టు 28, 29 తేదీలకు వాయిదా వేశారు.

ప్రతి పనికి పైసా వసూల్!

- సచివాలయంలో సీఎం తమ్ముడి ముఠా
- బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): ఏడు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దఎత్తున అవినీతిలో కూరుకుపోయిందని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ ఆరోపించారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. మంత్రులంతా ప్రతి పనికి పైసా వసూలు చేసే కార్యక్రమంలో బిజీ అయ్యారని, సీఎం తమ్ముడు కూడా సచివాలయంలో రాత్రింబవళ్లు ముఠాను వేసి డబ్బులు వసూలు చేస్తున్నారని విమర్శలు గుప్పించారు. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కల్యాణలక్ష్మి చెక్కు కోసం రూ.7,500 ఇచ్చినా రాలేదని బాధితులు ఓ కాంగ్రెస్ నాయకున్ని నిలదీయడమే ఇందుకు నిదర్శనమన్నారు.



ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం

కాంగ్రెస్‌లో చేరిన మహిపాల్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): పటాన్‌చెరు బీఆర్ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతోపాటు జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్, కార్పొరేటర్లు చేరారు. కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి, దామోదర, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, నీలం మధు పాల్గొన్నారు.

ఫిరాయింపులకు వ్యతిరేకమైనా తప్పట్లే

- ఆత్మరక్షణ కోసం కాల్పులు జరపొచ్చు
- ఉద్యోగం కోరేవాళ్లు పరీక్ష వాయిదా కోరరు
- మీడియా చిట్‌చాట్‌లో మధుయాష్కీ



హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): ఫిరాయింపులకు పార్టీ వ్యతిరేకమైనా తప్పడం లేదని కాంగ్రెస్ సీనియర్ నేత మధుయాష్కీ పేర్కొన్నారు. ఆత్మరక్షణ కోసం ఎదురు కాల్పులు చేయడంలో తప్పులేదని స్పష్టం చేశారు. సోమవారం ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి రేవంత్‌రెడ్డి, తాను చాలా కష్టపడ్డామని చెప్పారు. తాను కాంగ్రెస్‌లో 50 ఏండ్లకు పైగా ఉన్నానని చెప్పారు. తాను పార్టీలు మారలేదని తెలిపారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మాదిరిగా చేరికల సందర్భంగా తా ము ఎటువంటి హామీ ఇవ్వడంలేదని, మంత్రి పదవులు ఇస్తామని చెప్పడం లేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో పనిచేసిన అధికారులు కేసుల నుంచి తమను తప్పించాలని, ప్రతిఫలంగా వందల కోట్లు ఇస్తామని ప్రభుత్వంలోని కొందరు పెద్దల చుట్టూ తిరుగుతున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. నిజంగా పరీక్ష రాసే వారు ఎవరూ వాయిదా వేయాలని అడగరని పేర్కొన్నారు. రూ. 100 కోట్ల వ్యాపారం జరుగుతుందని, ఈ నేపథ్యంలోనే శిక్షణ కేంద్రాలు వాయిదా వేయాలని కోరుతున్నాయని ఆరోపించారు.



డీజీపీ జితేందర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పోలీస్ అధికారుల సంఘం నేతలు

పోలీస్ ఆరోగ్య భద్రత బకాయిలు ఇప్పించండి

డీజీపీకి పోలీస్ అధికార సంఘాల వినతి

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ) : పోలీస్ సిబ్బంది ఆరోగ్య భద్రతకు సంబంధించిన రూ.260 కోట్ల బకాయిలు ఇప్పించాలని వివిధ జిల్లాలకు చెందిన పోలీస్ అధికారుల సంఘం నేతలు సోమవారం డీజీపీ జితేందర్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా తాత్కాలిక పోలీస్ అధికారుల సంఘాన్ని రద్దు చేసి, కొత్త పోలీస్ అధికారుల సంఘం ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో త్వరలోనే ఎన్నికలు నిర్వహిస్తామని డీజీపీ హామీ ఇచ్చినట్టు పోలీస్ అధికారుల సంఘం మాజీ కోశాధికారి, టీజీవో ఉపాధ్యక్షుడు జేఎస్ రాజు తెలిపారు. భద్రత రుణాల ప్రక్రియను పునరుద్ధరించాలని, ప్రమోషన్లు చేపట్టాలని, జీవో 317ను సవరించాలని కోరారు. ఈ సందర్భంగా ఇటీవల గౌరవ డాక్టరేట్ పొందిన చిందం సుభాష్‌ను డీజీపీ అభినందించారు. కార్యక్రమంలో వివిధ పోలీస్ అధికారుల సంఘాల ప్రతినిధులు జంగయ్య, జనార్దన్, సుభాష్, సూరి, నాగరాజు, నరేందర్, ఉమ, చంద్రశేఖర్‌రెడ్డి, యాదిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మల్లేశ్, శ్రీనివాస్, నర్సింహ, భాస్కర్ పాల్గొన్నారు.

ఇచ్చంపల్లి రిజర్వాయర్‌ను అంగీకరించం

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ) : గోదావరి, కావేరి అనుసంధానంలో భాగంగా ఇచ్చంపల్లి వద్ద రిజర్వాయర్ నిర్మాణానికి అంగీకరించేది లేదని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. సోమవారం కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ అధ్యక్షతన నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ(ఎన్‌డబ్ల్యూడీఏ)పాలకమండలి సమావేశం జరిగింది. రాష్ట్రం నుంచి నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్సీ(జనరల్) అనిల్‌కుమార్, అంతర్రాష్ట్ర వ్యవహారాల చీఫ్ ఇంజినీర్ మోహన్‌కుమార్ హాజరయ్యారు. ఇచ్చంపల్లి నుంచి కేవలం 24 కిలోమీటర్ల దిగువనే తుపాకులగూడెం(సమ్మక్క సాగర్) బరాజ్ ఉందని గుర్తుచేశారు. ఒకవేళ ఇచ్చంపల్లి నుంచి అకస్మికంగా వరదను విడుదల చేస్తే బరాజ్ వద్ద నియంత్రించడం కష్టమవుతుందని స్పష్టం చేశారు.

నైజీరియా డ్రగ్స్ ముఠా అరెస్టు

- పోలీసుల అదుపులో ఓ సినీనటి సోదరుడు ఉన్నట్టు ప్రచారం

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 15 (నమస్తే తెలంగాణ): నైజీరియా కేంద్రంగా నగరంలో మరో డ్రగ్స్ ముఠా పట్టుబడింది. టీజీ న్యాబ్ పోలీసులు సైబరాబాద్ పోలీసులతో కలిసి ఐదుమంది డ్రగ్స్ సరఫరాదారులను అరెస్టు చేశారు. గచ్చిబౌలిలోని కమిషనరేట్‌లో రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ కేసు పూర్వాపరాలు వెల్లడించారు. నైజీరియాకు చెందిన ఒనోహా బ్లెస్సింగ్ అలియాస్ జోవాన జోమ్స్ అలియాస్ జో డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్టు సమాచారం రావడంతో టీజీ న్యాబ్ పోలీసులతో కలిసి నార్సింగి పోలీసులు నిఘా పెట్టగా హైదర్‌షాకోట్‌లోని వినాక్ నగర్‌లో ఒనోహా బ్లెస్సింగ్(31), నైజీరియాకు చెందిన అజీజ్ నోహీమ్(29), విశాఖపట్నంకు చెందిన అల్లం సత్యవెంకట గౌతం(31), తూర్పుగోదావరికి చెందిన సానబోయిన వరుణ్‌కుమార్(42), రాజేంద్రనగర్‌కు చెందిన మహ్మద్ మహబూబ్ షరీఫ్(36) డ్రగ్స్ సరఫరా చేస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.35 లక్షల విలువ చేసే 199గ్రాముల కొకైన్‌తో పాటు రెండు పాస్‌పోర్టులు, రెండు బైక్, 10 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీరి రిమాండ్‌ను తరలించిన పోలీసులు, వీరు ఇచ్చిన సమాచారంతో 13మంది డ్రగ్స్ వినియోగదారులను గుర్తించారు. ఇందులో బంజారాహిల్స్ లోటస్‌పాండ్‌కు చెందిన అమన్‌ప్రీత్ సింగ్, బంజారాహిల్స్‌కు చెందిన అనికేత్‌రెడ్డి, ప్రసాద్, పంజాగుట్టకు చెందిన నిఖిల్ దావన్, మాదాపూర్‌కు చెందిన మధుసూదన్‌ను అరెస్టు చేసినట్టు డీసీపీ వివరించారు. వీరికి మూత్ర పరీక్షలు జరుగగా కొకైన్ పాజిటివ్ వచ్చినట్టు వెల్లడించారు. వీరిలో ఒక ప్రముఖ సినీనటి సోదరుడు కూడా ఉన్నట్టు సమాచారం.

ఎక్సైజ్‌శాఖలో రూల్స్ ఆధారంగానే బదిలీలు

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ఎక్సైజ్ శాఖలో త్వరలో చేపట్టనున్న బదిలీలు ఏ ప్రాతిపదిక చేపట్టాలనే రూల్స్‌ను ఇప్పటికే సీఎస్ శాంతికుమారి దృష్టికి ఎక్సైజ్‌శాఖ తీసుకెళ్లింది. ప్రభుత్వ ఆమోదం తర్వాత సాధారణ బదిలీల ప్రక్రియ కొనసాగున్నది. కానిస్టేబుల్ నుంచి ఉన్నతాధికారుల వరకు 1500 మంది బదిలీకి అవకాశం ఉన్నట్టు సమాచారం.

31వరకు బదిలీల షెడ్యూల్

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): ఇంటర్, సాంకేతిక, కళాశాల విద్యలో బోధన, బోధనేతర సిబ్బంది బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. ఒకే చోట ఐదేండ్లు పూర్తైన వారు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉండగా, రెండేండ్ల సర్వీసు పూర్తిచేసుకున్న వారు మాత్రమే బదిలీకి అర్హులుగా ప్రభుత్వం పేర్కొంది. మంగళవారం నుంచి బదిలీల ప్రక్రియ ప్రారంభంకానుండగా, 31 వరకు అవకాశమిచ్చారు. రాష్ట్రంలో ఉద్యోగుల బదిలీల ప్రక్రియ కొనసాగుతుండగా.. ఇంటర్, సాంకేతిక, కళాశాల విద్యాశాఖల్లో బదిలీల ప్రక్రియను చేపట్టలేదు. ఇదే అంశంపై 'ముందుకు సాగని బదిలీలు.. విద్యాశాఖలో ఇంకా విడుదల కాని మార్గదర్శకాలు' పేరుతో నమస్తే తెలంగాణ మెయిన్‌లో కథనం ప్రచురితమైంది. దీనిపై సర్కారు సోమవారం స్పందించి మార్గదర్శకాలు విడుదలచేసింది.

ఎస్సీ హాస్టల్ వెల్ఫేర్ బదిలీల్లో రగడ

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ) : షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖలోని ఉద్యోగుల బదిలీల్లో అధికారుల తీరుపై హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. దీంతో బదిలీలను కొద్దిసేపు వాయిదా వేశారు. డిపార్ట్‌మెంట్‌లోని పలు పోస్టుల బదిలీలకు సంబంధించి అధికారులు ఇప్పటికే షెడ్యూల్ ప్రకటించారు. అందులో భాగంగా సోమవారం డీఎస్ఎస్ భవన్‌లో కౌన్సెలింగ్ చేపట్టారు. అయితే ఈ కౌన్సెలింగ్ ప్రక్రియను పలువురు హెచ్‌డబ్ల్యూవోలు అడ్డుకున్నారు. లోకల్, నాన్‌లోకల్ ఖాళీలను ప్రత్యేకించి చూపకుండానే బదిలీ చేస్తుండంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో అధికారులు కొద్దిసేపు కౌన్సెలింగ్‌ను నిలిపివేశారు.

శ్రీశైలంలో విద్యుత్తు ఉత్పత్తి ప్రారంభించాలి

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ) : శ్రీశైలం ప్రాజెక్టులో జల విద్యుత్తు ఉత్పత్తిని ప్రారంభించాలని కేఆర్ఎంబీ త్రీమెన్ కమిటీ నిర్ణయించింది. సోమవారం జలసౌధలో జరిగిన సమావేశంలో శ్రీశైలంలో విద్యుత్తు ఉత్పత్తి ప్రారంభించాలని, తద్వారా సాగర్ అవసరాలు తీర్చాలని ప్రకటించి తెలంగాణకు 5.5 టీఎంసీలు, ఏపీకి 4.5 టీఎంసీలను కేటాయించింది.

శ్రీశైలం నడక మార్గంపై నిషేధం

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ) : శ్రీశైలం మల్లికార్జున స్వామిని దర్శించుకునేందుకు నల్లమల అటవీ గుండా కాలినడకన వెళ్లే దారిని అటవీశాఖ 3నెలలపాటు నిషేధించింది. జూలై నుంచి సెప్టెంబర్ వరకు పులుల సంతానోత్పత్తి సమయం కావడంతో ఎన్టీసీఏ ఆదేశాల మేరకు సెప్టెంబర్ వరకు అనుమతి లేదని తెలిపింది. భక్తులు ఈ విషయాన్ని గమనించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలంది.

ఆన్‌లైన్‌లోనే 'సీఎంఆర్ఎఫ్'

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ) : సీఎం సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్)దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించే ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. నిధుల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రభుత్వం తెలిపింది. ఇందులో భాగంగా సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ఆధ్వర్యంలో వెబ్‌సైట్ రూపొందించగా.. స్థానిక మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి లాగిన్ ఐడీ కేటాయించింది. సీఎంఆర్ఎఫ్ కోసం వారి వద్దకు వచ్చిన రోగుల వివరాలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తారు. వీటితోపాటు వారి సిఫారసు లేఖను కూడా జత చేస్తారు. అప్లికేషన్‌ను పూర్తి చేసిన తర్వాత ప్రత్యేక నంబర్ కేటాయిస్తారు. అనంతరం ఒరిజినల్ మెడికల్ బిల్లులను సచివాలయంలోని సీఎంఆర్ఎఫ్ సెక్షన్‌లో సమర్పిస్తారు. వివరాలన్నీ సరైనవేనని నిర్ధారణకు వచ్చాకే వాటిని సీఎంఆర్ఎఫ్‌కు పంపుతారు. ఆ తర్వాత దరఖాస్తును ఆమోదించి లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తారు.

నమస్తే తెలంగాణ హైదరాబాద్
మంగళవారం 16 జూలై 2024
www.ntnews.com



అప్పటివరకూ మామూలుగా ఉన్న వ్యక్తికి.. హఠాత్తుగా చెయ్యి మొద్దుబారుతుంది. కాలు కదపడమూ కష్టమవుతుంది. మూతి వంకర్లు పోతుంది, మాట పడిపోతుంది. మాట్లాడినా నత్తినత్తిగానే. శరీరం సమతూకం కోల్పోతుంది. చూపులో అస్పష్టత. ఒంట్లో మగతగా ఉంటుంది. స్పందనలు ఉండవు. విపరీతమైన తలనొప్పి. ఇవన్నీ 'పక్షవాతం' లేదా 'బ్రెయిన్ స్ట్రోక్' లక్షణాలే. లక్ష మందిలో సగటున 150 మంది ఏటా పక్షవాతానికి గురవుతున్నట్టు అంచనా. కొవిడ్ రోగుల్లో, కొవిడ్ నుంచి కోలుకున్న వారిలో పక్షవాతం రావడానికి ఆస్కారం మరింత ఎక్కువని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇక పక్షవాతం అంటే... ఏ అరవైలలోనో వస్తుందన్నది కూడా ఇప్పుడు అపోహే! మారుతున్న జీవనశైలి, ఒత్తిడి, ధూమపానం తదితర కారణాల వల్ల 40 ఏండ్లలోపు వారిలో కూడా పక్షవాతం లక్షణాలు కనిపిస్తుండటం ఆందోళనకరం.

జిందగీ
ఊపిరి

పక్షవాతమా.. పరేషానొద్దు

పక్షవాతం లేదా బ్రెయిన్ స్ట్రోక్ రావడానికి ప్రధాన కారణం మెదడుకు రక్తం సరఫరా చేసే నాళాలు పూడుకుపోవడం (బ్లాక్ కావడం). ఇందులో రెండు రకాలు ఉన్నాయి. మొదటిది... ఇస్కిమిక్ స్ట్రోక్. మెదడుకు రక్తం సరఫరా చేసే నాళాల్లో అవరోధాలు లేదా గడ్డలు (క్లాట్స్) ఏర్పడటం వల్ల వస్తుంది. బ్రెయిన్ స్ట్రోక్ కేసుల్లో 85 శాతం ఈ తరహావే. రెండోది.. హేమరేజిక్ స్ట్రోక్. మెదడులో నరాలు చిట్లడం వల్ల రక్తస్రావం జరిగినప్పుడు వస్తుంది. బ్రెయిన్ స్ట్రోక్ కేసుల్లో హేమరేజిక్ కేసుల వాటా 15 శాతం. ఇవిపోతే రెండు రకాల పక్షవాతాలు కూడా ఒకే రకమైన లక్షణాలను కలిగి ఉంటాయి. ప్రపంచవ్యాప్తంగా మరణాలకు, అంగవైకల్యానికి రెండో ప్రధాన కారణంగా పక్షవాతం నిలుస్తున్నది. కొన్ని సర్వేల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 25 ఏండ్లు పైబడిన వారిలో ప్రతి నలుగురిలో ఒకరు వారి జీవితకాలంలో ఎప్పుడో ఒకప్పుడు బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడుతున్నారు. చికిత్స సమయానికి అందించకపోతే వీరిలో దాదాపు 40 శాతం మంది మరణించవచ్చని పరిశోధకుల అంచనా! ఇక భారతదేశం విషయానికి వస్తే, దేశంలో ప్రతి ఏటా సంభవించే అన్ని మరణాలలో, 7.4 శాతం మంది బ్రెయిన్ స్ట్రోక్ కారణంగా జరుగుతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి.





నివారణ సాధ్యమే

పక్షవాతం అనగానే భయపడాల్సిన పనేదు. రోగిని వీలైనంత త్వరగా దవాఖానకు తీసుకువెళ్లగలిగితే ప్రాణాలు కాపాడుకోవచ్చు. రెండు రకాల స్ట్రోక్స్‌కూ వివిధ రకాలైన చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. ఇక బ్రెయిన్ స్ట్రోక్‌తో రోగి హాస్పిటల్‌లో చేరగానే, డాక్టర్లు అది ఇస్కి మిక్ తరహానా లేదా హేమరేజికా అన్నది నిర్ధారణ చేస్తారు. దీనికోసం సీటీ స్కాన్ కానీ, ఎంఆర్ఐ స్కాన్ కానీ చేస్తారు. ఇస్కిమిక్ స్ట్రోక్ అయితే, రెండు రకాల చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. వీటిని దేనికదే ప్రత్యేకంగా గానీ, లేదంటే రెండింటినీ కలిపిగానీ అందిస్తారు.



మొదటి రకం.. థ్రాంబోలైసిస్

ఈ పద్ధతిలో, రక్తనాళాల్లో గడ్డల్ని తొలగించే ఔషధాన్ని ఇంజెక్షన్ ద్వారా ఒంట్లోకి ఎక్కిస్తారు. అయితే, సమస్య మొదలైన 4-5 గంటలలోపే రోగిని దవాఖానలో చేర్పిస్తేనే ఈ థ్రాంబోలైసిస్ చికిత్స సాధ్యమవుతుంది. ఈ సమయంలో రోగులకు టిష్యూ ప్లాస్మినోజెన్ యాక్టివేటర్ (టీపీఏ) లేదా టెనెక్టెప్లేస్ ఇంజెక్షన్ ఇస్తారు. దీనివల్ల రక్త సరఫరాకు ఆటంకంగా ఉన్న గడ్డ కరిగిపోయి రక్తనాళం తెరుచుకుంటుంది. రక్తనాళాల్లో అవరోధాలు చిన్నవైనప్పుడు, ఈ ఇంజెక్షన్‌తో సమస్య తీరిపోతుంది.

రెండోది మెకానికల్ థ్రాంబెక్టమీ

మెదడుకు రక్తాన్ని సరఫరా చేసే నాళాల్లో గడ్డలను తొలగించేందుకు మెకానికల్ థ్రాంబెక్టమీని ఎంచుకుంటారు. అయితే, దీన్ని పక్షవాతానికి గురైన 24 గంటల్లోపు చేయాలి. రక్తనాళాల్లో ఆటంకం పెద్దగా ఉన్నప్పుడు థ్రాంబోలైటిక్ ఔషధాలు పనిచేయవు. కాబట్టి, ప్రత్యామ్నాయంగా వైద్యులు మెకానికల్ థ్రాంబెక్టమీ చికిత్సను ఎంచుకుంటారు. ఈ ప్రక్రియలో మెదడుకు ఎలాంటి కోతలూ పెట్టరు. కుట్లు కూడా పడవు. ఒుట్టను పోలిన ఓ పరికరం సాయంతో ఒక చిన్న గొట్టాన్ని కాలి రక్తనాళం ద్వారా శరీరంలోకి పంపిస్తారు. తర్వాత, ఫ్లోరోస్కోపిక్ గైడెన్స్ ద్వారా మెదడు నాళాలకు చేరేలా చూస్తారు. అలా మెదడులోని గడ్డలను తొలగిస్తారు. మత్తుమందు (లోకల్ అనస్థీషియా) ఇచ్చాకే ఈ చికిత్స చేస్తారు. మొత్తం చికిత్సకు గంట సమయం పడుతుంది.

కాగా హేమరేజిక్ స్ట్రోక్ చికిత్స కూడా ఇస్కిమిక్ తరహాలోనే ఉంటుంది. కాకపోతే, హేమరేజిక్‌లో ముందుగా రోగి రక్తపోటును (బీపీ) నియంత్రణలోకి తీసుకువస్తారు. మెదడులో రక్తస్రావాన్ని నివారించడానికి చిట్లుతున్న నాళాలను క్లిప్పుల ద్వారా మూసేస్తారు. లేదంటే, ఎండోవైకేషన్ ప్రక్రియ ద్వారా రక్తస్రావానికి అడ్డుకట్ట వేస్తారు.

ఆలస్యం అమృతం.. విషం

పక్షవాతం చికిత్సలు ఏవైనా సరే వాటిని నిర్ణీత సమయంలోపే చేయాలి. ఆలస్యమైన ప్రతి నిమిషానికీ రోగి తన మెదడులో 20 లక్షల న్యూరాన్లను నష్టపోతాడు. దీంతో వ్యాధి నుంచి కోలుకోవడం కష్టం అవుతుంది. అందుకే, సాధ్యమైనంత త్వరగా మెదడుకు రక్త ప్రసరణ జరిగేలా చూడాలి. అప్పుడే, మెదడు కణాలు నశించిపోకుండా నివారించగలం. థ్రాంబోలైసిస్, థ్రాంబెక్టమీ చికిత్సల ద్వారా పక్షవాతం కారకాలను నివారించవచ్చు.

కారణం జీవనశైలి

పక్షవాతానికి... ధూమపానం, మధుమేహం, అధిక ఒత్తిడి, అధిక కొలెస్ట్రాల్, అధిక రక్తపోటు, గుండె సంబంధ వ్యాధులే దారితీస్తాయి. ఈ దుస్థితి బారిన పడకూడదంటే ఏ విధమైన శారీరక శ్రమలేని కూర్చుని ఉండే జీవనశైలిని వదిలించుకోవాలి. ధూమపానం మానుకోవాలి. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి. రోజువారీగా తగినన్ని నీళ్లు తాగుతూ శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవాలి. డీహైడ్రేషన్‌ను దరిదాపుల్లోకి కూడా రానివ్వకూడదు. మన సన్నిహితుల నడకలో కానీ, మాటలో కానీ ఏ మాత్రం తేడా కనిపించినా నిర్లక్ష్యం చేయకూడదు. మరో విషయం మహిళలతో పోలిస్తే పక్షవాతం పురుషులకు రావడానికి ఆస్కారం ఎక్కువ. పక్షవాతం రాగానే భయపడకూడదు. వెంటనే, తగిన సదుపాయాలు ఉన్న దవాఖానలో మంచి చికిత్స అందిస్తే రోగి త్వరగా కోలుకుంటాడనే విషయం మర్చిపోవద్దు.

పక్షవాత రోగుల్లో రక్తనాళాలు తిరిగి మామూలుగా అవడానికి రెండు రకాల చికిత్స విధానాలు అందుబాటులో ఉన్నాయి. ఒకటి, థ్రాంబోలైసిస్ ఇంజెక్షన్... దీన్ని బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన 4 - 5 గంటల వరకు ఇవ్వవచ్చు. రెండోది, థ్రాంబెక్టమీ లేదా రక్తనాళంలో అవరోధాన్ని స్టెంట్ ద్వారా తొలగించే పద్ధతి. దీన్ని 24 గంటల వరకు చేయవచ్చు. ఇక ఎవరైనా పక్షవాతానికి గురికాగానే రోగులు కానీ, వారి బంధువులు కానీ కుంగిపోవాల్సిన అవసరం లేదు. స్ట్రోక్ వచ్చిన తర్వాత వీలైనంత త్వరగా హాస్పిటల్‌లో చేరిస్తే రోగి మునుపటిలా జీవించడానికి వీలు ఉంటుంది. ఇక బ్రెయిన్ స్ట్రోక్ వచ్చినవారు వారికి లక్షణాలు ప్రారంభమైన తర్వాత చికిత్సకు ఒక్కో గంట ఆలస్యం అయ్యేకొద్దీ, మంచి ఫలితం వచ్చే అవకాశాన్ని 30 శాతం వరకు తగ్గిపోతుంది. బ్రెయిన్ స్ట్రోక్ రోగులకు వీలైనంత వేగంగా చికిత్స అందించే ఉద్దేశంతో యశోద హాస్పిటల్స్ 'స్ట్రోక్ కేర్ ఆన్ వీల్స్' పేరిట ప్రత్యేకమైన అంబులెన్సులను ప్రారంభించింది. వైద్య రంగంలో అత్యాధునిక వైద్య విధానాలను అందుబాటులోకి తేవడంలో యశోద హాస్పిటల్స్ ఎప్పుడూ ముందే ఉంటుంది. పక్షవాతం రోగులకు మరింత మెరుగైన చికిత్సను అందించడానికి ఇప్పుడు 'డైరెక్ట్ టు ఆంజియో సూట్' (డీటీఏఎస్) టెక్నాలజీతో పనిచేసే బై-ప్లేన్ న్యూరో ఆంజియో ప్రొసీజర్ సూట్ అనే అధునాతన సాంకేతికతను యశోద హాస్పిటల్స్ అందుబాటులోకి తీసుకువచ్చాయి.

డైరెక్ట్ టు ఆంజియో సూట్ సాంకేతికత



డాక్టర్. షాహ్యాన్ మొహసిన్ సిద్ధిఖీ
సీనియర్ న్యూరో & ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్,
యశోద హాస్పిటల్స్,
సికింద్రాబాద్.

పిల్లల్లో కీళ్ల ఇన్ఫెక్షనా..?



డాక్టర్ విజయానంద్
నియోనేటాలజిస్ట్ అండ్ పీడియాట్రీషియన్
రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్స్

పిల్లల పెంపకం

మా పాప వయసు 9 నెలలు. వారం కిందట కొన్ని రోజులు బిడ్డ సరిగా పాలు తాగలేదు. జ్వరం కూడా వచ్చింది. పిల్లల డాక్టర్‌కు చూపించాం. సిరప్ ఇచ్చారు. అది వాడితే జ్వరం కాస్త తగ్గుముఖం పట్టింది. మళ్లీ తీవ్ర జ్వరం వచ్చింది. టెంపరేచర్ 102, 103 ఫారన్‌హీట్‌గా నమోదైంది. పాప కుడికాలు సరిగ్గా కదిలించలేకపోతున్నట్టు అనిపించింది. కాలు ముట్టుకుంటే భరించలేనంతగా నొప్పిపెట్టి.. తీవ్రంగా ఏడ్చింది. మళ్లీ వైద్యుణ్ని సంప్రదించాం. బ్లడ్ టెస్ట్, స్కాన్ చేశారు. పరీక్షల ఫలితాలు గమనించి ఇన్ఫెక్షన్ ఉందని వైద్యుడు చెప్పారు. తుంటి ఎముక జాయింట్‌లో ఇన్ఫెక్షన్ ఉందన్నారు. శస్త్రచికిత్స చేసి చీము తీసేశారు. ఆరువారాలు యాంటీబయాటిక్స్ ఇవ్వమన్నారు. నెలల చిన్నారికి ఇన్ని వారాలు యాంటీబయాటిక్స్ వాడొచ్చా? ఈ జాయింట్ ఇన్ఫెక్షన్ భవిష్యత్తులో ప్రమాదకరంగా మారుతుందా? ఆందోళనగా ఉంది, సలహా ఇవ్వగలరు?

- ఓ పాఠకురాలు



మీరు చెప్పిన వివరాల ప్రకారం మీ బిడ్డకు సెప్టిక్ ఆర్థరైటిస్ సమస్య ఉంది. అంటే తుంటి ఎముకలో ఉన్న కీలులో చీము చేరుతుంది. ఇది పూర్తిగా నయం చేయదగిన జబ్బే! సమయానికి గుర్తించడం చాలా అవసరం. మీ విషయంలో సత్వరం స్పందించడం చాలా మంచి విషయంగా చెప్పవచ్చు. పాప తుంటి ఎముక కీలులో చేరిన చీమును తొలగించడం జరిగింది. దీంతోపాటు సరైన యాంటీబయాటిక్స్ ఇచ్చారు. భవిష్యత్తులో ఏ సమస్యా రాకుండా ఉండటానికి.. జాయింట్‌లో చీము తొలగించడం, యాంటీబయాటిక్స్ ఇవ్వడం చేస్తారు. వీటిని ఆరు వారాలు కొనసాగించాల్సిందే! మీ పీడియాట్రీషియన్, ఆర్థోపెడిక్ వైద్యులు సూచించినట్టు చికిత్స కొనసాగించండి. క్రమం తప్పకుండా ఫాలోఅప్ చేయండి. సరైన సమయంలో చికిత్స అందటం వల్ల కంగారుపడాల్సిందేమీ లేదు. పాపకు జబ్బు పూర్తిస్థాయిలో నయం అవుతుంది.

హైడ్రోజన్ పెరాక్సయిడ్ అంటే చాలామందికి తెలిసే ఉంటుంది. హెచ్‌2ఓ2 అనే రసాయన సంకేతాన్ని కలిగి ఉండే ఈ ద్రవ పదార్థాన్ని గాయాలు కడగడం మొదలుకుని దంతాలను మిలమిలలాడేలా చేసుకోవడం వరకు చాలా సందర్భాల్లో వినియోగిస్తుంటారు. అయితే, దీన్ని అవసరానికి మించి ఉపయోగించడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయంటున్నారు నిపుణులు.

నీళ్ల నుంచి పుట్టిన మంట

- హైడ్రోజన్ పెరాక్సయిడ్ అనేది యాంటీసెప్టిక్‌గా పనిచేస్తుంది. వైద్యపరంగా దీన్ని విస్తృతంగా ఉపయోగిస్తారు. కానీ, తగిన విధంగా వాడకపోతే మాత్రం ఆరోగ్యం మీద తీవ్రమైన ప్రభావాలే చూపుతుంది.



- ఈ ద్రావణాన్ని చర్మానికి పట్టించినప్పుడు మంట, ఎర్రగా మారిపోవడం, కొన్నిసార్లు బొబ్బలెక్కే ప్రమాదం కూడా ఉంది. ఎవరో చెప్పారు కదా అని అధిక పరిమాణంలో దీన్ని వాడితే ప్రమాదకరంగా పరిణమిస్తుంది.
- హైడ్రోజన్ పెరాక్సయిడ్‌ను కొద్ది పరిమాణంలో కూడా నోట్లోకి తీసుకోకూడదు. ఇలా చేస్తే పొట్టకు సంబంధించిన సమస్యలు తలెత్తుతాయి. వికారం, వాంతులు, అంతర్గత రక్తస్రావం మొదలైన ఇబ్బందులు వస్తాయి. అంతేకాదు రక్తనాళాల్లో గాలి బుడగలు ఏర్పడి రక్త సరఫరాకు ఆటంకం కలుగుతుంది. వైద్యపరంగా ఈ పరిస్థితిని గ్యాస్ ఎంబాలిజం అంటారు. ఇది ప్రాణాలకు ప్రమాదం కూడా కలిగించవచ్చు.
- ఈ ద్రవాన్ని ముక్కుతో పీలిస్తే శ్వాసనాళంలో మంట కలిగిస్తుంది. దగ్గు వస్తుంది. ఊపిరి తీసుకోవడం మందగిస్తుంది. విపత్కర పరిస్థితుల్లో ఊపిరితిత్తుల్లో ఫ్లూయిడ్ పేరుకుపోయే పరిస్థితి అయిన- పల్మనరీ ఎడిమాకు దారితీయొచ్చు.
- హైడ్రోజన్ పెరాక్సయిడ్ కంటికి తగిలితే విపరీతమైన మంట, నొప్పి పుడతాయి. పైగా కొన్ని తీవ్రమైన సందర్భాల్లో చూపు పోయే ప్రమాదం కూడా ఉంది. ఇలాంటి సమయాల్లో నష్ట నివారణ కోసం ఏమాత్రం ఆలస్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించాలి. తగిన చికిత్స చేయించుకోవాలి.

ఏఐతో రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ

భారతదేశంలో అన్ని క్యాన్సర్ కేసులలో... స్త్రీ, పురుష భేదం లేకుండా రొమ్ము క్యాన్సర్ వాటా 13.6 శాతం. ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ రిసెర్చ్ ఆన్ క్యాన్సర్ ప్రచురించిన 2022 ప్రపంచ క్యాన్సర్ నివేదిక ఈ వివరాలను వెల్లడించింది. అదే క్యాన్సర్ బాధిత మహిళల్లో సుమారు 26 శాతం మంది రొమ్ము క్యాన్సర్ బాధితులేనట. అయితే, రొమ్ము క్యాన్సర్‌పై పోరాటంలో కృత్రిమ మేధ (ఏఐ) సహాయకారిగా ఉంటుందని తాజా అధ్యయనం ఒకటి పేర్కొన్నది. రొమ్ము క్యాన్సర్ రోగులు కోలుకోవడంలో తొలిదశలోనే వ్యాధి నిర్ధారణ, తగిన చికిత్స కీలకంగా నిలుస్తాయనే విషయం తెలిసిందే. ఈ దిశగా కొత్తగా అభివృద్ధి చేసిన ఏఐ సాంకేతికత దాదాపు కచ్చితమైన రోగ నిర్ధారణ చేస్తుంది. ఈ అధ్యయనాన్ని బోస్టన్‌కు చెందిన నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ, మేన్ హెల్త్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రిసెర్చ్ సంస్థల పరిశోధకులు నిర్వహించారు. వీళ్లు అభివృద్ధి చేసిన ఎన్‌సెంబుల్ డీప్ లర్నింగ్ అనే ఏఐ నమూనా రొమ్ములో కణితి కణజాలాన్ని కచ్చితంగా విశ్లేషించగలదు. ఆ కణితి క్యాన్సర్‌కు దారితీస్తుందా (మాలిగ్నెంట్), లేదా మామూలు గడ్డగా (బినైన్- నాన్ క్యాన్సరస్) అనేది గుర్తించగలుగుతుంది. ఇక రొమ్ము క్యాన్సర్ లక్షణాలను గుర్తించడంలో ఈ ఏఐ నమూనాకు పబ్లిక్‌గా అందుబాటులో ఉన్న బ్రెస్ట్ క్యాన్సర్ హిస్టోపాథాలాజికల్ డేటాబేస్- బ్రేక్‌హిస్; ఇంకా బ్రెస్ట్ క్యాన్సర్ హిస్టోపాథాలజీ ఇమేజెస్- బ్యాచ్ అనే సమాచార నిధుల (డేటాసెట్స్) ఆధారంగా శిక్షణ ఇచ్చారు.



బ్యాచ్ నమూనా కోసం పరిశోధకులు రొమ్ములోని కణజాలం ఇమేజెస్‌ను... బినైన్, ఇన్వేసివ్, ఇన్‌సిటు, నార్మల్ అని నాలుగు రకాలుగా వర్గీకరించారు. అదే బ్రేక్‌హిస్ కోసం బినైన్, మాలిగ్నెంట్ కణాలను నాలుగు ఉపవిభాగాలుగా వర్గీకరించారు. డక్టల్ కార్సినోమా, లోబ్యులార్ కార్సినోమా, మ్యూసినస్ కార్సినోమా, పాపిలరీ కార్సినోమా రకాలు మాలిగ్నెంట్ కిందికి వస్తాయి. ఎడినోసిస్, ఫైబ్రో ఎడినోమా, ఫైలోడస్ ట్యూమర్, ట్యూబ్యులార్ ఎడినోమా అనేవి బినైన్ ప్రధాన జాబితాలో ఉన్నాయి. వీటన్నిటినీ కూడా ఎన్‌సెంబుల్ ఎంఎల్ నమూనా 99.84 శాతం కచ్చితత్వంతో గుర్తించిందని పరిశోధకులు వెల్లడించారు.

చెమటల వానా?

చంకల్లో ఎక్కువగా చెమట పట్టడాన్ని హైపర్ హైడ్రోసిస్ అంటారు. ఇబ్బంది కలిగించే ఈ సమస్య అందరిలోనూ తలెత్తుతుంది. అతిగా చెమట పట్టడం వల్ల బట్టల మీద మరకలు, దుర్వాసన, తరచుగా బట్టలు మార్చుకోవడం మొదలైన ఇబ్బందులు తలెత్తుతాయి. అంతేకాదు ఈ సమస్య మన ఆత్మవిశ్వాసాన్ని దెబ్బ తీస్తుంది. హైపర్‌హైడ్రోసిస్‌కు కొన్ని చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. నిపుణులను సంప్రదించిన తర్వాతే తగిన చికిత్సను ఎంచుకోవాలి.

ప్రిస్క్రిప్షన్ స్ట్రెంత్ యాంటీ పెర్స్పిరెంట్స్: మామూలు డియోడరెంట్ల లాంటివి పనిచేయనప్పుడు డాక్టర్లను సంప్రదించాలి. వాళ్లు చంకల్లో అతి చెమటను నివారించే యాంటీ పెర్స్పిరెంట్స్ సిఫారసు చేస్తారు. వీటిలో అల్యూమినియం క్లోరైడ్ హెక్సాహైడ్రేట్ లాంటివి అత్యధిక గాఢతలో ఉంటాయి కాబట్టి, నిపుణుల సలహా మేరకే వాడాలి.

టాపికల్ యాంటీపెర్స్పిరెంట్స్: చంకల్లో అతి స్వేదం సమస్యకు టాపికల్ యాంటీపెర్స్పిరెంట్స్ తేలికగా అందుబాటులో ఉన్న చికిత్స సదుపాయాలు. వీటిలో ఉండే అల్యూమినియం క్లోరైడ్ స్వేద గ్రంథుల్ని మూసేస్తుంది. అలా ఎక్కువ చెమట వెలువడటాన్ని తగ్గిస్తుంది. టాపికల్ యాంటీపెర్స్పిరెంట్స్‌ను పడుకునే ముందు చంకల్లో పొడిచర్మం మీద పూతగా రాసుకుంటే ఫలితం కనిపిస్తుంది.

బొటాక్స్ ఇంజెక్షన్స్: చంకల్లో చెమటకు బొటులినమ్ టాక్సిన్ కలిగిన బొటాక్స్ ఇంజెక్షన్స్ సమర్థమైన చికిత్స అందిస్తాయి. బొటులినం టాక్సిన్ చంకల్లో చెమటను ప్రేరేపించే రసాయన సిగ్నల్స్‌ను అడ్డుకుంటాయి. కొన్ని నెలలపాటు ప్రభావం చూపే బొటాక్స్ ఇంజెక్షన్లను వైద్యుడి ద్వారానే తీసుకోవాలి. క్రమం తప్పకుండా ఇంజెక్షన్లు తీసుకుంటేనే అతి స్వేదం సమస్య నుంచి ఉపశమనం కొనసాగుతుంది.

అయాన్‌టోఫోరిసిస్: ఇందులో భాగంగా నీళ్ల ద్వారాగానీ, లేదంటే తడి ప్యాడ్‌ను చంకల్లో ఉంచి ఓ మోస్తరు విద్యుత్తును చంకల్లోకి పంపిస్తారు. దీంతో స్వేద గ్రంథులు తాత్కాలికంగా పూడుకుపోతాయి. అలా అధికంగా చెమట పట్టడం నుంచి విముక్తి లభిస్తుంది. మంచి ఫలితాలు రావడానికి ఈ చికిత్సను కొన్ని వారాలకు ఒకసారి నిపుణుల పర్యవేక్షణలో చేయించుకోవాలి.

లేజర్ చికిత్స: లేజర్ అబ్లేషన్, లేజర్ లైపోలైసిస్ చంకల్లో చెమటకు మంచి చికిత్స. ఈ చికిత్సలో చంకల్లో స్వేద గ్రంథుల్ని లక్ష్యంగా చేసుకుని చికిత్స చేస్తారు. దాంతో చెమట వెలువడటం తగ్గిపోతుంది. లేజర్ చికిత్సతో చర్మంపై కోత తక్కువగా ఉంటుంది (మినిమల్లీ ఇన్వేసివ్). అదే సమయంలో సమస్యకు పరిష్కారం తొందరగా దొరుకుతుంది. కానీ, లేజర్ చికిత్స మీ చర్మానికి తగిందో కాదో డాక్టర్‌ను సంప్రదించాకే నిర్ధారించుకోవాలి.

సర్జరీ ద్వారా: మామూలు చికిత్సల ద్వారా హైపర్‌హైడ్రోసిస్ సమస్య ఏమాత్రం తగ్గకపోతే వైద్యులు సర్జరీని కూడా పరిగణనలోకి తీసుకుంటారు. ఇలాంటివాటిలో ఆగ్జిలరీ స్వెట్ గ్లాండ్ సక్షన్ క్యూరెటేజ్ ఒకటి. దీని ద్వారా చంకల్లో స్వేద గ్రంథుల్ని పూర్తిగా తొలగిస్తారు. మరో చికిత్స థొరాసిక్ సింపథెక్టమీ. ఇందులో చెమట ఉత్పత్తికి మూలమైన నరాలను కత్తిరించడం లేదా మూసివేయడం చేస్తారు. అయితే సర్జరీని చివరి అస్త్రంగా మాత్రమే ఎంచుకోవాలి. అదీ నిపుణుడిని సంప్రదించిన తర్వాతే.

